రేపు ఎన్టీఆర్ పార్కులో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

1 హాజరుకానున్న ఎమ్మెల్యే దామచర్ల, ఆంధ్రజ్యోతి డైరెక్టర్ ఆదిత్య

1 అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండాగా కార్యక్రమం

7



డ్రగ్స్ వద్దు బ్రో..!

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఒంగోలులో గురువారం సాయంత్రం ప్రభుత్వ యంత్రాంగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించడంతోపాటు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ నషాముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ రహిత జిల్లాగా చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ సందర్భంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుంచి అద్దంకి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. తొలుత అధికారులు, ప్రజాప్రతినిధులు బెలూన్లు ఎగురవేసి ర్యాలీలో పాల్గొన్నారు.


కొండపిలో నిరసన తెలుపుతున్న రైతులు

రోడ్డెక్కిన పొగాకు రైతులు

జిల్లాలోని వెల్లంపల్లి, కొండపి కేంద్రాలలో పొగాకు రైతులు రోడ్డెక్కారు. నిత్యం భారీగా నోబిడ్(తిరస్కరణలు) బేళ్లు అధికంగా ఉండటంపై తీవ్ర ఆవేదన చెందుతున్న రైతులు గురువారం వేలాన్ని బహిష్కరించి రోడ్డెక్కి నిరసన తెలిపారు. గత రెండు, మూడేళ్లతో పోల్చితే ప్రస్తుతం ధరలు చాలా తక్కువగా ఉండటమే కాక గరిష్ఠ ధరలపై వ్యాపారులు కూటమి కట్టి సీలింగ్ పెట్టారు. అదేసమయంలో రోజురోజుకూ కనిష్ఠ ధరలు దిగజారుతున్నాయి. అంతేకాక ధర తగ్గించి అధికారులు బిడ్ పెడుతున్నా, వ్యాపారులు కొనుగోలు చేయక నిత్యం భారీగా నోబిడ్(తిరస్కరణ) అవుతున్నాయి. 7



నియోజకవర్గ కేంద్రంలో సీవీఏపీ యూనిట్లు

1 ఎమ్మెల్యే సారథ్యంలో అమలు

1 స్పెషల్ ఆఫీసర్ పర్యవేక్షణ

1 సభ్యులుగా తహసీల్దార్లు, ఎంపీడీవోలు

1 ఐదుగురు సచివాలయ సిబ్బంది నియామకం

1 మునిసిపాటీల్లో చైర్మన్, కమిషనర్ కూడా..

1 ప్రస్తుత ఏడాది ప్రణాళిక అమలుపై పది రోజుల్లో సమీక్షలకు ప్రభుత్వం ఆదేశం

ఒంగోలు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : వికసిత భారత్, స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనలో భాగంగా విజన్ 2029 పేరుతో ఐదేళ్లలో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించిన ప్రభుత్వం ప్రస్తుతం వాటి అమలుపై దృష్టిసారించింది. నాలుగు రోజుల క్రితం అమరావతిలో సుపరిపాలనకు ఏడాది సభను ప్రభుత్వం నిర్వహించగా అందులో

మిగతా 6లో...

ముందుకు సాగునా..?

మారిన వాతావరణంతో రైతుల్లో అయోమయం


జూన్ ముగుస్తున్నా తొలకరి పైర్లకు పడని విత్తనం

దుక్కులు దున్ని వాన కోసం ఎదురుచూపులు

మారిన వాతావరణం రైతులను అయోమయానికి గురిచేస్తోంది. జూన్ ముగుస్తున్నా ఇంకా తొలకరి పైర్లకు విత్తనం చాలాచోట్ల పడలేదు. సాధారణంగా ఈ సమయంలో ఒక మోస్తరు వర్షాలు పడుతూ తొలకరి పైర్ల సాగుతోపాటు ప్రధానమైన ఖరీఫ్ పంటల సాగుకు అవసరమైన పనుల్లో రైతులు నిమగ్నమవుతారు. ఈ ఏడాది రుతుపవనాలు ముందుగా రావడం, మే నెల రెండో పక్షంలో మంచి వర్షాలు పడటంతో రైతులు పంటల సాగుపై నమ్మకం పెంచుకొని దుక్కులు దున్నకం చేసి విత్తనాలు వేసేందుకు సిద్ధమయ్యారు. ఇంచుమించు నెలరోజులుగా జిల్లాలో సరైన వర్షం కురవక పోవడమే కాక ఉష్ణోగ్రతలు కూడా అధికంగా నమోదవుతుండటంతో ఆందోళన చెందుతున్నారు.

అర్ధవీడు మండలంలో పత్తి సాగు కోసం దుక్కి దున్ని వర్షం లేక విత్తనాలు వేయని పొలం





ఒంగోలు, జూన్ 26(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సాధారణంగా మే రెండో పక్షం నుంచి జూన్ తొలివారం వరకు వేసవి తీవ్రత అధికంగా ఉంటుంది. ఆ సమయంలో రోహిణి కార్తె కావడంతో రోళ్లు పగిలే ఎండలు కాస్తాయన్న నానుడికి అనుగుణంగా ఉష్ణోగ్రత కూడా 45 డిగ్రీల వరకు నమోదవుతాయి. తర్వాత వచ్చే మృగశిర కార్తెలో జల్లులు ఆరంభమై ఆరుద్ర కార్తెలో పెరుగుతాయి. అలా మృగశిరలో తిరిగి వాతావరణం చల్లబడటంతో ఉపశమనం లభిస్తుంది. 'మృగశిరలో వానలు పడితే ముసలి ఎద్దు కూడా రంకె వేస్తుంది, అలాగే ఆరుద్ర కార్తెలో వర్షం కురిస్తే ఆరు కార్తెల్లోనూ కురుస్తాయి. ఆరుద్ర కరుణిస్తే దరిద్రం పోతుంది' అన్నవి రైతాంగంలో ఎప్పటి నుంచో ఉండే నానుడి.

1 కొనసాగుతున్న బెట్ట వాతావరణం

కొన్నిచోట్ల బోర్లు ఇతర పరిమితి నీటి సౌకర్యం దగ్గర వేసవి పత్తి సాగు చేస్తారు. మృగశిర కార్తె రైతాంగాన్ని నిరాశపర్చగా ప్రస్తుతం ఆరుద్ర వచ్చినా వాన జాడ లేదు. రోహిణి ముగిసిన జూన్ 8న మృగశిర కార్తె రాగా ఈనెల 22తో మృగశిర కార్తె ముగిసి ఆరుద్ర వచ్చింది. ఈ రెండు కార్తెల్లోనూ బెట్ట వాతావరణమే నెలకొంది. ఈ నెలలో జిల్లాలో

మిగతా 6లో...

1 మేలో వానలు.. జూన్‌లో ఎండలు

రాళ్లు పగిలే ఎండలు కాయాల్సిన రోహిణికార్తెలో ఈ ఏడాది జోరు వానలు కురిశాయి. మే నెలలో సాధారణ వర్షపాతం 53.0 మి.మీ కాగా ఈ ఏడాది ఏకంగా 103.01 మి.మీ నమోదైంది. దాదాపు సగం మండలాల్లో అక్కడ పడాల్సిన వర్షం కన్నా రెట్టింపు నుంచి నాలుగైదు రెట్లు కురిసింది. ప్రత్యేకించి గిద్దలూరు, మార్కాపురం, దర్శి, వైపాలెం, కనిగిరి నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో అధికంగా పడింది. ఇతర ప్రాంతాల్లోనూ సాధారణం కన్నా అధికంగానే కురిసింది. సాగు సాధారణంగా జల్లులు పడే మృగశిర ఆరంభం నాటికి.. రోహిణి కార్తెలో ఎండల తీవ్రతకు బదులు వర్షాలు పడటంతో రైతులు ఆనందంగా సాగుకు సిద్ధమయ్యారు. తొలకరి పైర్లు సజ్జ, నువ్వు, పెసరలతో పాటు పచ్చిరొట్ట ఎరువులతోపాటు పశుగ్రాస పంటల సాగుకు ఉపక్రమించేవి.. అలానే ప్రధాన ఖరీఫ్ పంటలైన పత్తి, కంది, మినుము ఇతర పంటల సాగుకు భూములు సిద్ధం చేసే పనులు చేపట్టారు.



జూలైకు ముందుగానే ప్రారంభించిన ప్రభుత్వం

జిల్లాలో తొలి రోజు 11,633 మందికి అందజేత

ఒంగోలులో రేషన్‌బియ్యం ఇచ్చేందుకు దివ్యాంగుల నుంచి వేలిముద్రలు తీసుకుంటున్న డీలర్

దివ్యాంగులు, వృద్ధులకు రేషన్ పంపిణీ

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ కార్డు కలిగి ఉన్న 65 ఏళ్లకు పైబడి ఉన్న వృద్ధులు, అలాగే దివ్యాంగులకు జూలై నెలకు సంబంధించి రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. జిల్లాలో 1,392 రేషన్ షాపుల పరిధిలో వృద్ధులు, దివ్యాంగులు 77,770 మంది ఉండగా గురువారం 11,633 మందికి రేషన్ పంపిణీ చేశారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ బియ్యం పంపిణీని పారదర్శకంగా చేపట్టే విధంగా పలు చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా మొబైల్ వాహనాలను రద్దు చేసి జూన్ నుంచి పాత పద్ధతిలోనే రేషన్‌షాపుల ద్వారా కార్డుదారులకు రేషన్ పంపిణీ ప్రక్రియను చేపట్టింది. అయితే రేషన్‌షాపుల వద్దకు దివ్యాంగులు, 65 ఏళ్లకుపైబడిన వృద్ధులు వచ్చి బియ్యం తీసుకోవాలంటే ఇబ్బందులు పడతారని మధ్యాహ్న సమయంలో వారి ఇంటి వద్దకే వెళ్లి ఇవ్వాలని ఆదేశాలు జారీచేసింది. తదనుగుణంగా వృద్ధులు, దివ్యాంగులకు జూన్ నెలకు సంబంధించి పంపిణీ ప్రక్రియను పూర్తిచేసింది. అయితే జూలై నెలకు సంబంధించి ముందుగానే వారికి సరుకులు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో తదనుగుణంగా పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. జిల్లావ్యాప్తంగా గురువారం అన్ని షాపుల పరిధిలో ఉన్న వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ పంపిణీ చేపట్టారు. వారి నివాసాల వద్దకే డీలర్లు వెళ్లి కార్డుదారులతో వేలిముద్రలు వేయించుకొని సరుకులను అందించారు. ఈ ప్రక్రియను ఈ నెలాఖరులోపు పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రేషన్ పంపిణీపై ప్రత్యేక దృష్టిసారించడమే కాకుండా సకాలంలో సరుకులను అందించేందుకు చర్యలు తీసుకున్నారు. రేషన్ బియ్యం అక్రమ

మిగతా 6లో...



రూ.5.87 కోట్లు స్కూలు గ్రాంటు విడుదల

తొలి విడత 50శాతం మంజూరు

ఒంగోలు విద్య, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ రంగ పాఠశాలలకు 2025-26 విద్యా సంవత్సరానికి రూ.5.87 కోట్లు కాంపోజిట్ స్కూలు గ్రాంటు విడుదలైంది. ప్రాజెక్టు అప్రూవల్ బోర్డు(పీఏబీ) ఈ మొత్తం విడులకు ఆమోదముద్ర వేసింది. జిల్లాలోని 2,295 పాఠశాలలకు ఈ మొత్తాన్ని విడుదల చేస్తారు. ఈ మేరకు సమగ్ర శిక్షా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసులు ఉత్తర్వులు జారీచేశారు. అయితే ప్రస్తుతం తక్షణమే 50శాతం గ్రాంటు అంటే రూ.2.94 కోట్లు పాఠశాలలకు విడుదల చేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. పాఠశాలలకు ప్రస్తుతం విడుదల చేస్తున్న 50శాతం గ్రాంటులో 20శాతం జూలై 5న నిర్వహించనున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్(ఎంపీటీఎం) ఖర్చులకు వినియోగించుకునేందుకు అనుమతిస్తూ ఎస్‌పీడీ ఉత్తర్వులు జారీ చేశారు. కాంపోజిట్ స్కూలు గ్రాంటు విడుదలకు సంబంధించి ఈనెల 24న జారీచేసిన ఉత్తర్వుల్లో పాఠశాలలకు విడుదలయ్యే 50 శాతం స్కూలు గ్రాంటులో 10 శాతం స్వచ్ఛతా కార్యక్రమాలకు, 10శాతం మెగా పీటీఎం ఖర్చులకు వినియోగించుకోవాలన్నారు. తాజాగా గురువారం జారీచేసిన ఉత్తర్వుల్లో స్వచ్ఛతా కార్యక్రమాలకు వినియోగించే 10శాతం మెగా పీటీఎం ఖర్చులకు వినియోగించుకోమన్నారు.



విస్తరణకు మార్కింగ్ వేస్తున్న అధికారులు

ట్రంక్ రోడ్ విస్తరణ 90 అడుగులకే..!

1 కోర్టును ఆశ్రయించిన ఓ వ్యాపారి

1 కౌంటర్ వేసిన కార్పొరేషన్ అధికారులు

1 త్వరలోనే విస్తరణ పనులు ప్రారంభం


రోడ్డు విస్తరణలో కోల్పోనున్న దుకాణాల మ్యాప్

ఒంగోలు, కార్పొరేషన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర అభివృద్ధిలో భాగంగా రహదారుల విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈక్రమంలో నగరంలో కీలకమైన ట్రంక్ రోడ్ విస్తరణలో కొంత ఆటంకాలు ఎదురవుతున్నాయి. వంద అడుగులు విస్తరిస్తే కొన్ని షాపులు శాశ్వతంగా తొలగిపోతాయని, మరికొన్ని సగానికిపైగా కోల్పోయే అవకాశం ఉందన్న భావనలో వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తుండగా, ప్రజాప్రయోజనం దృష్ట్యా మాస్టర్ ప్లాన్ ప్రకారం వంద అడుగుల విస్తరించే యోచనలో కార్పొరేషన్ అధికారులు ఉన్నారు. అయితే అందిన సమాచారం మేరకు.. వ్యాపారుల్లోని ఒకరు కోర్టును ఆశ్రయించడంతో వంద నుంచి 90 అడుగులు విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే వ్యాపారులు

మిగతా 6లో...



కార్పొరేట్ కబంధహస్తాల్లో పత్రికారంగం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ఒంగోలులో ముగిసిన ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర మహాసభలు

చివరి రోజు పలు తీర్మానాలు ఆమోదం

ఏపీయూడబ్ల్యూజే ముగింపు మహాసభల్లో ప్రసంగిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

7


పార్కులో సిద్ధమైన వాకింగ్ ట్రాక్

రేపు ఎన్టీఆర్ పార్కులో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

ఒంగోలు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 37వ డివిజన్‌లోని ఎన్టీఆర్ పార్కులో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఈనెల 28న ప్రారంభోత్సవాలు జరగనున్నాయి. సాయంత్రం నాలుగు గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఆంధ్రజ్యోతి డైరెక్టర్ వేమూరి ఆదిత్యలు పాల్గొని ప్రారంభోత్సవాలు చేయనున్నారు. 'అక్షరం అండగా- పరిష్కారం అజెండాగా' ఆంధ్రజ్యోతి నిర్వహించిన సభలో 37వ డివిజన్‌లో ప్రత్యేకించి ఎన్టీఆర్ పార్కులో పలు అభివృద్ధి పనులను కార్పొరేషన్ అధికారులు చేపట్టారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చొరవతో సుమారు రూ.1.96 కోట్ల విలువైన పనులు డివిజన్‌లో మంజూరయ్యాయి. అందులో దాదాపు రూ.70లక్షల విలువైన పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. మరికొన్ని పురోగతిలో ఉన్నాయి. పార్కులో చేపట్టిన పనులు పూర్తికావడంతో వాటికి ఈనెల 28న ప్రారంభోత్సవాలు నిర్వహించిన అనంతరం జరిగే సభలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఆంధ్రజ్యోతి డైరెక్టర్ వేమూరి ఆదిత్య, మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు, స్థానిక కార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాల్ పాల్గొననున్నారు.

ముక్తి భవనాసికి విముక్తి కలిగేనా.!

గత టీడీపీ హయాంలో రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు

ఆ తర్వాత వైసీపీ రావడంతో పట్టించుకోని పాలకులు

పాతసింగరాయకొండ దేవస్థానంలో కోనేరు దుస్థితి ఇది

వాడుకలోకి తీసుకురావాలని కోరుతున్న భక్తులు

సింగరాయకొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఉన్న ముక్తి భవనాసి(కోనేరు)కు విముక్తి కలిగించాలని భక్తులు కోరుతున్నారు. ఎంతో ప్రాశస్త్యం కలిగిన కోనేరు వినియోగంలో లేకపోవడంతో వారిని కలిచివేస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తుదిదశకు వరకు చేపట్టిన అభివృద్ధిని ఆ తర్వాత వచ్చిన వైసీపీ పాలకులు కొనసాగించకపోవడంతో చేసినదంతా బూడిదలోపోసిన పన్నీరు అయ్యింది. దీంతో క్రమంగా కోనేరు రూపురేఖలు కోల్పోయింది. ప్రస్తుత కోనేటి దుస్థితిని చూసి భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఘనమైన చరిత్ర

దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన శ్రీవరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఉన్న రెండు కోనేర్లకు ఎంతో ప్రాశస్త్యం ఉంది. ఒకటి పశ్చిమ వాయువ్య దిశలో ఉన్న భవనాసికాగా, మరొకటి తూర్పు ఆగ్నేయ దిశలో ఉన్న ముక్తి భవనాసి. ఇందులో ముక్తి భవనాసికి ఘనమైన చరిత్ర ఉంది. ఇంద్రుడు ఆకాశమార్గంలో పయనించే సమయంలో యోగానంద లక్ష్మీనరసింహస్వామి తీక్షణమైన రూపాన్ని చూసి తన చేతిలో ఉన్న వజ్రాయుధాన్ని నేల జారవిడుస్తాడు. వజ్రాయుధం కిందపడిన చోట ఘాతం ఏర్పడుతుంది. అదే ముక్తి భవనాసిగా ప్రసిద్ధికెక్కింది.

గతంలో అప్పటి ఎమ్మెల్యే స్వామి చొరవతో..

దేవస్థానంలో రెండు కోనేర్లలో భవనాసి వాడుకలో ఉండగా దాదాపు 60 ఏళ్ల నుంచి ముక్తి భవనాసిని పట్టించుకోకపోవడంతో అది మట్టితో పూడుకుపోయింది. చిల్లచెట్లు పెరిగిపోయి కాలుపెట్టలేని విధంగా తయారైంది. 2014-19 టీడీపీ ప్రభుత్వం హయాంలో ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆ కోనేరు అబివద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. రూ. 20 లక్షల నిధులు కేటాయించి అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. చిల్లచెట్లను, పిచ్చిమొక్కలను తొలగించారు. పూడుకుపోయినన కోనేరును తవ్వ మట్టిని కట్టగా పోసి దీర్ఘచతురస్రాకారంలో తీర్చిదిద్దారు. కట్టచుట్టూ గ్రానైట్ రాళ్లతో రివిట్‌మెంట్ చేశారు. కోనేరు మధ్య తాండవ కృష్ణుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు కూర్చోవడానికి వీలుగా గ్రానైట్‌తో పెద్ద అరుగును నిర్మించారు. భక్తుల రాకపోకలకు వీలుగా రెండు ముఖద్వారాలను ఏర్పాటుచేశారు. ముక్తి భవనాసిలో కొంతభాగం స్వామికి నిత్యం పుష్పాలు తులసీదళాలు పంపించేందుకు కేటాయించారు. కట్టచుట్టూ సెంట్రల్ లైటింగ్‌కు కూడా ప్రతిపాదనలు చేశారు. అంతలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సెంట్రల్ లైటింగ్, పూలు, తులసీమొక్కల పెంపకాన్ని పట్టించుకున్న దిక్కులేదు.


అభివృద్ధి చేయాల్సిన స్వామి పుష్కరిణి భవనాసి

వాడుకలోకి తీసుకురావాలని కోరుకుంటున్న భక్తులు

వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో అధ్వానస్థితికి చేరుకున్న ముక్తి భవనాసిని ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో వాడుకలోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు. మిగిలిన సెంట్రల్ లైటింగ్, మొక్కల పెంపకం, కోనేరు మరమ్మతులను పూర్తి చేసి కోనేరుకు ప్రారంభించి విముక్తి కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అంతేగాక స్వామివారికి తెప్పోత్సవం నిర్వహించే ప్రధాన పుష్కరిణి అయిన భవనాసిని కూడా అభివృద్ధి చేయాలని భక్తులు కోరుకుంటున్నారు.


మార్కాపురం మండలంలో సాగు చేసిన మిర్చి పైరు వర్షం లేక బెట్టకు వచ్చిన తీరు

ముందుకు 'సాగు'నా..?

(5వ పేజీ తరువాయి)

సాధారణ వర్షపాతం 58.0 మి.మీ. కాగా ఇప్పటివరకు కేవలం 24.4 మి.మీ మాత్రమే నమోదైంది. కురిసిన కాస్త కూడా అడపాదడపా కావడంతో ఎందుకు ఉపయోగపడలేదు. అంతేకాక ఎండల తీవ్రత కూడా అధికంగా ఉంది. రెండు, మూడు రోజులు ముందు వరకు చాలా ప్రాంతాల్లో 38 నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రతలతోపాటు వేడిగాలులు కూడా వీచాయి.

పంటలపై తీవ్ర ప్రభావం

వాతావరణ సీజన్‌లో చోటుచేసుకున్న మార్పులు జిల్లాలో పంటల సాగుపై తీవ్రంగా చూపిస్తోంది. సాధారణంగా ఈ సమయానికి జిల్లాలో 40వేల హెక్టార్ల వరకు తొలకరి పైర్లు పశుగ్రాస పంటలు సాగు కావాలి. ఈ ఏడాది రోహిణి కార్తెలో కురిసిన వర్షాలతో మరో పదివేల హెక్టార్లలో అదనంగా సాగు కావాల్సి ఉంది. అయితే అనంతరం వచ్చిన మృగశిర, ఆరుద్ర కార్తెలో వర్షం లేకపోవడం, ఎండలు పెరగడంతో ఇప్పటివరకు ఆరువేల హెక్టార్లలో మాత్రమే పంటలు సాగైనట్లు సమాచారం. అందులోనూ వేసవి పత్తి, నువ్వు మాత్రమే ఉండగా ఇతర పైర్ల సాగు లేదు. దుక్కులు దున్నిన రైతులు వానకోసం ఎదురుచూస్తున్నారు.

బధిర విద్యార్థినికి గర్భం

ఒంగోలు క్రైం, జూన్26 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికను క్లాస్‌మేట్ గర్భవతిని చేశాడు. ఈమేరకు గురువారం రిమ్స్‌వైద్యశాలలో డాక్టర్లు నిర్ధారించారు. ప్రస్తుతం బాపట్ల బధిరుల ఆశ్రమ కాలేజీలో జూనియర్ ఇంటర్ చదువుతున్న మూగ బాలికకు కాళ్లకు నీరు రావడంతో అక్కడ ఉపాధ్యాయులు గుర్తించి ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు చేయగా బాలిక 8 నెలల గర్భవతిగా నిర్ధారించారు. బాలిక ఒంగోలులోని బధిరుల పాఠశాలలో 10 వతరగతి వరకు చదువుకుంది. ఆసమయంలో కావలి చెన్నాయిపాలెంనకు చెందిన మూగ విద్యార్థి ఆదే పాఠాశాలలో పదో తరగతి చదువుతున్నాడు. అక్కడ వారి మధ్య పరిచయం ఏర్పడిందని బాలిక చెబుతున్నట్లు పోలీసులు తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం మైనర్ బాలికను సఖీ సెంటర్‌కు చేర్చారు. పోలీసులు విచారణ చేపట్టారు.

నియోజకవర్గ కేంద్రంలో సీవీఏపీ యూనిట్లు

(5వ పేజీ తరువాయి)

విజన్ ప్రణాళికల అమలుపై సీఎం చంద్రబాబునాయుడు దిశానిర్దేశం చేశారు. ఇప్పటివరకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో 15శాతం వృద్ధి లక్ష్యంతో అన్ని రంగాలలో అభివృద్ధి ప్రణాళికలను రూపొందించారు. ఈ ప్రణాళికలను నియోజకవర్గం యూనిట్‌గా స్థానిక ఎమ్మెల్యే భాగస్వామ్యంతో అమలు చేయడం ద్వారా మరింత మెరుగైన ఫలితాలు వచ్చే అవకాశం ఉందని గుర్తించి నాలుగు నెలలుగా తదనుగుణంగా కసరత్తు చేపట్టింది. ప్రస్తుతం ఆ ప్రక్రియ కొలిక్కి వచ్చింది.

ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు

ఎమ్మెల్యేల సారథ్యంలో ఆ పరిధిలోని పట్టణ, మండలాల ప్రణాళికలు క్రోడీకరించి నియోజకవర్గ ప్రణాళిక రూపొందించి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) లక్ష్యాలను సాధించేందుకు కార్యాచరణ ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఎమ్మెల్యే సారథ్యంలో ఇందుకోసం కానిస్టెన్సీ విజన్ యాక్షన్ ప్లాన్(సీవీఏపీ) యూనిట్ పేరుతో ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే సిబ్బంది నియామకం పూర్తయింది. సచివాలయాల్లో పనిచేసే సాంకేతిక పరిజ్ఞానం కలిగిన వారిని నియోజకవర్గానికి ఐదుగురు సిబ్బందిని నియమించారు. తాజాగా యంగ్ ప్రొఫెషనల్ పేరుతో ఎంబీఏ లేదా బీటెక్ చదివిన వారిని ఒకరిని తీసుకుంటున్నారు. నియోజకవర్గానికి ఒక డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారిని స్పెషల్ ఆఫీసర్‌గా నియమించారు. ఎమ్మెల్యే సారథ్యంలో ఉండే సీవీఏపీ కమిటీలో ఆ పరిధిలోని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు సభ్యులుగా ఉంటారు. ఒకవేళ ఆ నియోజకవర్గంలో పట్టణ, స్థానిక సంస్థ ఉంటే ఆ సంస్థ మేనేజర్, చైర్మన్ అలాగే కమిషనర్ సభ్యులుగా ఉంటారు. మార్కాపురానికి స్పెషల్ ఆఫీసర్‌గా అక్కడి సబ్ కలెక్టర్, ఒంగోలు, కనిగిరిలకు అక్కడి ఆర్డీవోలు, ఇతర నియోజకవర్గాలకు ఎస్‌డీసీలను నియమించారు.

ప్రభుత్వ భవనాల్లో సీవీఏపీ కార్యాలయం

నియోజకవర్గ కేంద్రాలలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాల్లో సీవీఏపీ కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో యూనిట్‌లో ఫర్నీచర్ ఇతర అవసరాల కోసం రూ.10 లక్షల చొప్పున ఇవ్వనున్నారు. రెండు, మూడు రోజుల్లో ప్రభుత్వ ఉత్తర్వులు రానున్నాయి. వీటిఏర్పాటు ద్వారా నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యేకు ఒక ప్రత్యేక కార్యాలయం కూడా అందుబాటులోకి రానుంది. ఇప్పటివరకు వారు సొంత కార్యాలయాలను లేదా పార్టీ కార్యాలయాల నుంచే పనిచేస్తుండగా ప్రత్యేక సిబ్బంది కరువయ్యారు. ప్రస్తుత ఏర్పాటు చేస్తున్న సీవీఏపీ యూనిట్ ద్వారా అధికారిక కార్యాలయాలు కూడా ఏర్పడనున్నాయి.

సమన్వయ బాధ్యత నియోజకవర్గ కేంద్ర ఎంపీడీవోదే

సీవీఏపీ యూనిట్‌లోని సిబ్బంది అన్ని మండలాల అధికారులను సమన్వయం చేసే బాధ్యతను నియోజకవర్గ కేంద్ర ఎంపీడీవోలకు అప్పగించారు. అలా ఈ యూనిట్లలో ఎమ్మెల్యే, స్పెషలాఫీసర్, సమన్వయ ఎంపీడీవోలు కీలకం కానున్నారు. ఇదిలాఉండగా వచ్చేనెల 7వ తేదీలోపు అన్ని నియోజకవర్గ కేంద్రాలలో సీవీఏపీ యూనిట్ కార్యాలయాల ఏర్పాటు, నియోజకవర్గ విజన్ ప్లాన్ తొలి మీటింగ్‌లు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించడంతో తదనుగుణ చర్యలపై సంబంధిత అధికారులు దృష్టిసారించారు. ఇదే తరహాలో జిల్లా స్థాయి విజన్ ప్రణాళిక అమలుపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి సారథ్యంలో కలెక్టర్ పర్యవేక్షణలో వివిధ కీలక శాఖల అధికారులతో కమిటీలు ఏర్పాటు చేశారు. అందులో కీలక ప్రజాప్రతినిధులు కూడా సభ్యులుగా ఉండనుండగా ఆ సమావేశాలను కూడా వెంటనే నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది.

ట్రంక్ రోడ్ విస్తరణ 90 అడుగులకే..!

(5వ పేజీ తరువాయి)

పలుమార్లు సమావేశం నిర్వహించుకుని విస్తరణ వలన తమకు నష్టం జరుగుతుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని కలిసి విన్నవించారు. అయితే ఎమ్మెల్యే దామచర్ల వ్యాపారులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా, ప్రభుత్వం నుంచి టీడీఆర్ బాండ్లు అందజేస్తామని హామీ ఇవ్వడంతోపాటు, వ్యాపారులను విస్తరణకు ఏకాభిప్రాయానికి తీసుకొచ్చే ప్రయత్నాలు చేశారు. వ్యాపారులు నగరాభివృద్ధికి సహకరించాలని సూచించడంతో త్వరలోనే పనులు చేపట్టనున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, ఎంపీ మాగుంట సమస్యపై స్పందించి ఎమ్మెల్యే దామచర్లతోను, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నష్టం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కాగా నేడు వ్యాపారులు మరోసారి సమావేశం నిర్వహించుకుని ఎట్టకేలకు 90 అడుగులకు విస్తరణ చేసే దిశగా అధికారులు చర్యలు వేగవంతం చేపట్టారు. అలాగే బీవీఎస్ హాలు రోడ్‌ను 80 అడుగులు, ట్రంక్‌రోడ్ 90 అడుగులు విస్తరించనుండగా, త్వరలోనే ఆ పనులు చేపట్టేందుకు కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టినట్లు సమాచారం

దివ్యాంగులు, వృద్ధులకు రేషన్ పంపిణీ

(5వ పేజీ తరువాయి)

వ్యాపారాన్ని అడ్డుకోవడంతోపాటు ప్రభుత్వం అందిస్తున్న సరుకులను పేదలకు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. దీంతో జిల్లావ్యాప్తంగా పౌరసరఫరాల శాఖ అధికారులు కూడా ప్రత్యేక దృష్టిసారించి పంపిణీకి చర్యలు తీసుకున్నారు. తొలిరోజైన గురువారం ఈ ప్రక్రియ ప్రారంభం కాగా 14.96శాతంతో 11,633 మందికి పంపిణీ చేశారు. ముండ్లమూరు మండలంలో అత్యధికంగా 444 మందికి పంపిణీ చేయగా అర్ధవీడు మండలంలో కేవలం 68మందికి మాత్రమే పంపిణీ చేశారు.

లోగ్రేడ్ నోబిడ్‌లపై పొగాకు రైతుల నిరసన

- కొండపిలో రోడ్డుపై బైఠాయించి రెండు గంటలపాటు నిరసన
- బ్రైట్ రకం ఎక్కడ నుంచి తీసుకురావాలని ఆవేదన
- 54 బేళ్ల కొనుగోలు తర్వాత ఆగిన వేలం

కొండపి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : లోగ్రేడ్ రకం పొగాకును వ్యాపారులు కొనుగోలు చేయకపోవడాన్ని నిరసిస్తూ కొండపి పొగాకు వేలం కేంద్రం పరిధిలోని జువ్విగుంట, అయ్యవారిపాలెం, తంగెళ్ల, జాళ్లపాలెం, పీరాపురం గ్రామాల రైతులు గురువారం వేలం కేంద్రం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. రెండు గంటలపాటు కొండపి-టంగుటూరు రోడ్డుపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు వచ్చి ఆందోళన విరమించాలని విజ్ఞప్తి చేసినా వెనక్కితగ్గలేదు. ఈ సందర్భంగా రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ ఏడాది లోగ్రేడ్ పొగాకు అధిక దిగుబడి వచ్చిందని, మాడు రకం కేజీకి 159 రూపాయలు బిడ్ పెట్టినా, వ్యాపారులు కొనుగోలు చేయకపోవడంతో అధికారులు నోబిడ్ చేస్తున్నారని రైతు జాస్తి గోపి ఆవేదన వ్యక్తం చేశారు. వేలం కేంద్రం అధికారులు, పొగాకు వ్యాపారులు బ్రైట్ రకం పొగాకును వేలానికి తీసుకురావాలని అంటున్నారని, తమ వద్ద బ్రైట్ రకం పొగాకు అయిపోయిందని, లేని పొగాకును ఎక్కడ నుంచి తెస్తామని రావెళ్లవారిపాలెం గ్రామ మాజీ సర్పంచ్ రామబ్రహ్మం వాపోయారు. అనంతరం వేలం నిర్వహణాధికారి రైతులను చర్చలకు పిలవడంతో నిరసన కార్యక్రమాన్ని విరమించారు. కార్యక్రమంలో సుబ్బారావు, రఘు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. గురువారంనాటి వేలం కేంద్రానికి 1175 బేళ్లు రాగా 54 బేళ్ల కొనుగోలు తర్వాత రైతులు వేలాన్ని అడ్డుకోవడంతోఆగిపోయింది.


మద్దిపాడులో ఆందోళన చేస్తున్న రైతులకు నచ్చచెబుతున్న పోలీసులు

వెల్లంపల్లి వద్ద రోడ్డెక్కిన రైతులు

మద్దిపాడు: పొగాకు రైతులు తమకు గిట్టుబాటు ధర లభించడం లేదని గురువారం వెల్లంపల్లి వద్ద గల జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు పొగాకును తగులబెట్టి నిరసన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న మద్దిపాడు పోలీసులు వెల్లంపల్లి వద్దకు చేరుకుని రైతలకు నచ్చచెప్పేందుకు ప్రయత్నించారు. అయితే రైతులు ధర్నా కొనసాగించటంతో జాతీయ రహదారిపై రెండు వైపులా సుమారు ఐదు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. అనంతరం పొగాకు బోర్డు ఆర్ఎం.లక్ష్మణరావు కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి వారి చేత కొనుగోలు చేయించటానికి ప్రయత్నించారు. దీనితో తిరిగి వేలం ప్రారంభం కాగా ఐదు బేళ్లకు ఒక బేల్ చొప్పున కంపెనీ వారు కొనుగోలు చేయడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పొగాకు కొనుగోలును నిలిపివేస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం ఉదయం ఆగిపోయిన బేళ్ల దగ్గర నుంచి ప్రారంభిస్తామని ఆర్ఎం ప్రకటించారు.


భూముల మ్యాపును పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

మా భూములకు హద్దులు చూపించండి

- అటవీ అధికారులు బోర్లు వేయనీయడం లేదు
- జేసీకి నరజాముల తాండా గిరిజనుల ఫిర్యాదు

పుల్లలచెరువు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : గత కొన్ని సంవత్సరాలుగా నరజాముల తాండాలో ఫారెస్టు భూముల విషయాల్లో సమస్యలు ఏదుర్కొంటున్న గిరిజన తాండాలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, అధికారులు పర్యటించారు. గురువారం మండలంలో నరజాముల తాండాలో అధికారులతో కలిసి జేసీ రెవెన్యూ, ఫారెస్టు భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ ఏన్నో ఏళ్లుగా భూములు సాగు చేసుకుంటున్నా ఫారెస్టు అధికారులు ఆ భూముల్లో బోర్లు వేయనీయడం లేదని, విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేయనీయడం లేదని జేసీకి ఫిర్యాదు చేశారు. సాగులో ఉన్న భూములకు హద్దులు చూపించాలని కోరారు. అనంతరం జేసీ నివేశన స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టరు వెంకట త్రివినాగ్, డీవీవోసందీప్ కృపాకర్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ చక్రబంధంలో పర్చూరు

అవస్థలు పడుతున్న వాహనదారులు. ప్రయాణికులు


ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్

పర్చూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రమైన పర్చూరులో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు జఠిలంగా మారుతోంది. వాహనాల రద్దీ పెరగడంతో పాటు, ఉదయం - సాయంత్రం సమయాల్లో గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. పర్చూరులో బాధ్యతలు స్వీకరించే పోలీసు అధికారులు, స్టేషన్‌కు వచ్చిన ఉన్నత అధికారులు విలేకర్ల సమావేశంలో 'ట్రాఫిక్ సమస్య ఉంది అని గుర్తించాం. సమస్యను పరిష్కరిస్తాం' అని చెప్పడం సర్వసాధారణం. పర్చూరు స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టే అధికారులు సమస్యను పరిష్కరిస్తాం అని చెప్పడం మినహా చర్యలు మచ్చుకు కూడా కానరాని దుస్థితి. గతంలో ఎస్సై, సీఐ స్థాయి అధికారులు బొమ్మల కూడలిలో నిలబడి ట్రాఫిక్‌ను నియంత్రించిన ఘటనలు అనేకం ఉన్నాయి. కొన్నేళ్లుగా ట్రాఫిక్ సమస్య పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. సిబ్బంది కొరత సాకుతో సమస్యను ప్రయాణికుల కష్టానికి వదిలేస్తున్నారని వారు వాపోతున్నారు. వాహనాలు స్తంభించిన సమయాల్లో పోలీసుకు సమాచారం ఇచ్చినా స్పందించిన దాఖలాలు లేవని ప్రజలు అంటున్నారు. ఉదయం సాయంత్రం సమయాల్లో 2 గంటల చొప్పున కనీసం ఇద్దరు పోలీసు సిబ్బందిని ఏర్పాట్లు చేస్తే ఇలాంటి దుస్థితి ఉండదని ప్రజలు అంటున్నారు. ఆదిశగా పోలీసు అధికారులు పర్చూరులో ట్రాఫిక్ సమస్యపై స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రిల్స్‌ను ఢీ కొన్న ఆర్టీసీ బస్

అద్దంకి,జూన్26(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో శ్రీనగర్ వద్ద నామ్ రోడ్డు వెంబడి ఉన్న గ్రిల్స్‌ను ఆర్టీసీ బస్ ఢీ కొని సర్వీస్ రోడ్డులో నిలిచింది. స్థానికుల కథనం మేరకు నెల్లూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న డీలక్స్ బస్ బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత 2 గంటల సమయంలో అద్దంకి పట్టణంలోని శ్రీనగర్ వద్ద గ్రిల్స్‌ను ఢీ కొట్టుకుంటూ సర్వీస్ రోడ్డులో నుంచి ముందుకు పోయి సమీపంలోని పాఠశాల ప్రహరీ గోడ వద్ద నిలిచిపోయింది. అర్ధరాత్రి సమయం కావడం జనసంచారం లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రమాదం జరగడంతో బస్ లో ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపాటుకు గురయ్యారు. డ్రైవర్ కరిముల్లాకు స్వల్ప గాయాలు అయ్యాయి.

డ్రగ్స్‌తో భవిష్యత్ నాశనం

● మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి ● అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ అన్సారియా ● పోలీస్ కార్యాలయం నుంచి అద్దంకి బస్టాండ్ వరకూ భారీ ర్యాలీ

ఒంగోలు క్రైం,జూన్26(ఆంధ్రజ్యోతి): యువత మాదకద్రవ్యాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని కలెక్టర్ తమీమ్‌అన్సారియా హితవు పలికారు. గురువారం అంతర్‌జాతీయ మాదకద్రవాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వలన యువత నిర్వీరం అవుతారని అన్నారు. నషాముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్‌రహిత జిల్లాగా చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇప్పటికే నవోదయం 2.0 కార్యక్రమంలో నాటుసార రహిత జిల్లాగా ప్రకటించామని అన్నారు.ముఖ్యంగా విద్యార్థులు డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సంకల్పం తీసుకోవాలని అన్నారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ యువత కొత్తదనం పట్ల ఆకర్షితులు అవుతున్నారని ,ఒక్కసారి వాడి చూద్దమని డ్రగ్స్‌కు బానిసలు అవుతున్నారని తెలిపారు. డ్రగ్స్‌కు అలవాటుపడిన వారు తప్పకుండా జైలుకు వెళతారని, వారికి ఉద్యోగ అవకాశాలు ఉండవని గుర్తు చేశారు. డ్రగ్స్ నియంత్రణకు ఐజీ నేతృత్వంలో ప్రతి జిల్లాలో 30 మందితో ఈగల్ అనే విభాగాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. ఇప్పటి వరకు 41 కేసులు నమోదుచేసి 220 మందిని డ్రగ్స్‌కు బానిసలైనవారిని గుర్తించామని అన్నారు.అలాగే వారి ప్రవర్తనలో మార్పు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్దనరావు మాట్లాడుతూ ప్రభుత్వం డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చి దిద్దాలని లక్ష్యంతో పనిచేస్తున్నదని చెప్పారు.మాదకద్రవ్యాల వలన కలిగే దుష్పరిణామాలపై అవగాహన కలిగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుటుందన్నారు. సంతనూతలపాడు శాసన సభ్యులు బీఎన్‌విజయకుమార్ మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వలన ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిపారు. దాని ప్రభావం వారి కుటుంబాల మీద పడుతుందని అన్నారు. అనంతరం పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుంచి అద్దంకి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పి.వి జయకుమార్, లైవ్‌స్టాక్ ఏజెన్సీ చైర్మన్ షేక్ రియాజ్, జిల్లా అధికారులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థినులతో నగరంలో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ



అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఒంగోలు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో బెలూన్‌లు ఎగురవేస్తున్న కలెక్టర్ అన్సారియా, ఎస్పీ దామోదర్, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు (ఇన్‌సెట్లో) డ్రగ్స్ వద్దంటూ ప్లకార్డు ప్రదర్శిస్తున్న విద్యార్థిని



సబ్ కలెక్టర్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు

పని చేస్తున్నా వేతనంలో కోత

● సబ్ కలెక్టర్‌కు వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగుల ఫిర్యాదు

మార్కాపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : సమయానికి మించి వివిధ ప్రభుత్వ ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన విధుల నిమిత్తం పనిచేస్తున్నా సాంకేతిక కారణాలు చూపి తమకు నెలలో రెండు నుంచి నాలుగు రోజులపాటు మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు జీతాలు కట్ చేస్తున్నారని వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు గురువారం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్వోల సంఘం డివిజన్ అధ్యక్షుడు వైపీ రంగయ్య మాట్లాడుతూ వీఆర్వోలు ప్రభుత్వం నిర్దేశించిన సమయాన్ని మించి విధులు నిర్వహిస్తున్నారన్నారు. మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయాల్లో పనిచేసే వీఆర్వోలు కొందరికి ప్రతినెలా రెండు నుంచి నాలుగు రోజులు విధులకు హాజరుకానట్లు కమిషనర్ నారాయణరావు జీతాలు కట్ చేయిస్తున్నారన్నారు. ఈ విషయమై సదరు వీఆర్వోలు తాము సమయానికి బయోమెట్రిక్ వేయకపోవడానికిగల కారణాలను వివరించి చెప్పినా వినడంలేదన్నారు. ఈ విషయమై తహసీల్దార్ చొరవతీసుకుని మాట్లాడినా కమిషనర్ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ వీఆర్వోలే కాక ఇతర శాఖలకు చెందిన సచివాలయ సిబ్బందికి కూడా ఇదే విధంగా ప్రతి నెలలో ఒకటి నుంచి మూడు వరకు విధులకు గైర్హాజరైనట్లు జీతాల్లో కట్ చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని ఏ మున్సిపాలిటీలోనూ ఈ పద్ధతి లేదన్నారు. సమస్యలను విన్న సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ తాను కలెక్టర్ దృష్టికి ఈ విషయాలను తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, నన్నేబి, టి.జ్యోతిలక్ష్మి పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఆశ వర్కర్ల యూనియన్ నాయకురాలు ధనలక్ష్మి

సమ్మెను జయప్రదం చేయాలి

గిద్దలూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం జూలై 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి కోరారు. స్థానిక ఆశ వర్కర్లతో ఆమె సమావేశమై ప్రసంగించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రాఘవమ్మ, యూనియన్ నాయకులు విశ్రాంతమ్మ, నూర్జహాన్, సీఐటీయూ నాయకులు ఆవులయ్య, అన్వర్ పాల్గొని ప్రసంగించారు.

కౌలు కార్డుల జారీపై అవగాహన

గిద్దలూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : కౌలు రైతులకు పంట సాగు - హక్కు పత్రం జారీపై గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమ సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది మండలంలో 1,534 కౌలు కార్డులు ఇవ్వాలని లక్ష్యం నిర్ణయించుకున్నామని, ఇప్పటివరకు 400 మంది కౌలు రైతులకు కార్డులు జారీ చేసినట్లు తహసీల్దార్ ఆంజనేయరెడ్డి తెలిపారు. ఈకార్డు కాలపరిమితి 11 నెలలు మాత్రమేనని, భూయజమానులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, కౌలు రైతులకు పంట మీద మాత్రమే హక్కు ఉంటుందని, ఈవిషయాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రావు, వ్యవసాయ విస్తరణాధికారి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కౌన్సెలింగ్‌కు 136 మంది హాజరు

ఒంగోలు విద్య, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : పాలిటెక్నిక్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు ఒంగోలు డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో జరుగుతున్న కౌన్సెలింగ్‌కు గురువారం 136 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ శివప్రసాద్ తెలిపారు. ఉదయం 9గంటలకు 86,001నుంచి 95వేల వరకు, మధ్యాహ్నం 95,001 నుంచి 1,04,000 ర్యాంకు వరకు విద్యార్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. శుక్రవారం కూడా సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని ఆయన తెలిపారు.

డీఎస్సీకి 92 శాతం మంది హాజరు

ఒంగోలు విద్య, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న మెగా డీఎస్సీ కంప్యూటర్ ఆధారిత పరీక్షకు 92శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు జిల్లాలోని 8 పరీక్షా కేంద్రాల్లో కేవలం మూడు పరీక్షా కేంద్రాల్లో మాత్రమే పరీక్షలు జరిగాయి. పరీక్షకు 427 మందికి 394 మంది హాజరు కాగా 33 మంది గైర్హాజరయ్యారు. ఉదయం సెషన్‌కు 326 మందికి 301 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 101 మందికి 93 మంది హాజరయ్యారు. పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో తెలిపారు.

పుస్తకాలు, సామగ్రి పంపిణీ

కొమరోలు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్లీనగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను యడవల్లి గ్రామానికి చెందిన యశ్వంత్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా యశ్వంత్ ఎడ్యుకేషన్ అధ్యక్షుడు మొర్రి పిచ్చయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని పేద విద్యార్థులకు ఈ మెటీరియల్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మజ, ఉపాధ్యాయులు జనార్దన్‌రాజు, చంద్రమోహన్, శివరాం, ఆదిలక్ష్మి, శ్రీనివాసులు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కార్పొరేట్ల కబంధహస్తాల్లో పత్రికారంగం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ముగిసిన ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర మహాసభలు

చివరి రోజు

పలు తీర్మానాలకు ఆమోదం

ఒంగోలు కల్చరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి):ప్రజాస్వామ్య పరిరక్షణలో పత్రికారంగానిది కీలక పాత్ర అని, అటువంటి పత్రికారంగం ప్రస్తుతం దేశవ్యాప్తంగా కార్పొరేట్ల చేతిలో ఉందని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఒంగోలు విష్ణుప్రియ కన్వెన్షన్‌లో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర మహాసభ చివరిరోజైన గురు వారం ఉదయం జరిగిన సభాకార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రామకృష్ణ ప్రసంగిస్తూ స్వాతంత్ర్య ఉద్యమంలో సైతం పత్రికలు ఎంతో కీలక పాత్ర పోషించాయని అన్నారు. అయితే ప్రస్తుతం అనేక ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలు కార్పొరేట్ల అధీనంలో ఉండి వారికి అనుకూలమైన రాజకీయ పార్టీల కోసం పనిచేస్తున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మీడియా రెండు వర్గాలుగా విడిపోయిందని, ఇది ఎంతో బాధాకరమని అన్నారు. పాత్రికేయుల సమస్యల పరిష్కారం కోసం చేసే ఏ పోరాటానికైనా తమ పార్టీ అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మరొక అతిథిగా పాల్గొన్న పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే కె.మురళీమోహన్ మాట్లాడుతూ తన అభివృద్ధికి ముఖ్యమైన కారణం పత్రికారంగం, ఏపీయూడబ్ల్యూజే అని, ఒక పాత్రికేయునిగా పనిచేసిన తాను సమాజం గురించి ఎంతో నేర్చుకున్నానని అన్నారు. శాసనమండలి సభ్యులు కంచెర్ల శ్రీకాంత్ ప్రసంగిస్తూ ఏపీయూడబ్ల్యూజే మహాసభలలో ఒక ప్రజాప్రతినిధిగా కాకుండా ఒక పాత్రికేయుని కుమారునిగా తాను పాల్గొంటున్నందుకు ఆనందంగా ఉందని, తన తండ్రి కంచెర్ల రామయ్య పాత్రికేయునిగా ఎంతో విశేషమైన సేవలు అందించారని ఆయన నుంచి జీవితంలో ఎన్నో నేర్చుకున్నానని అన్నారు. ఒంగోలు నగర కమిషనర్ డాక్టర్ కోడూరి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పత్రికలు ఎంతో కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ సందర్భంగా పత్రికారంగంపై ఆయన రాసి చదివిన కవిత విశేషంగా ఆకట్టుకుంది.



ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర మహాసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

పలు తీర్మానాలకు ఆమోదం

ఇక మహాసభలో పలు తీర్మానాలను ఆమోదించారు. ముందుగా ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస రెడ్డి ఏపీయూడబ్ల్యూజేకు సంబంధించి బ్యాలెన్స్ షీట్‌ను సభ ముందు ప్రవేశపెట్టగా సభ దానిని ఏకగ్రీవంగా ఆమోదించింది. అదేవిధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన కారణంగా యూనియన్ కానిస్టిట్యూషన్‌లో అవసరమైన మార్పులను ఆయన సభ ముందు ఉంచగా వాటిని ఆమోదించారు. ఇక చిన్నపత్రికల మనుగడకు అవసరమైన చర్యలు, పాత్రికేయుల రక్షణకు చట్టం, గ్రామీణ ప్రాంత పాత్రికేయుల సమస్యల పరిష్కారం వంటి అనేక సమస్యలపై ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యల గురించి పలు జిల్లాల ప్రతినిధులు తీర్మానాలను ప్రవేశపెట్టగా వాటిని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

అనంతరం సభాధ్యక్షుడు సుబ్బారావు మాట్లాడుతూ ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర మహాసభలను మూడు రోజులు ఒంగోలులో నిర్వహించటానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా పాత్రికేయుల సమస్యల పరిష్కారం కోసం, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించే విషయంలో ఏపీయూడబ్ల్యూజే ఎప్పుడూ ముందుంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో పలువురు ఐజేయూ నాయకులు,ఏపీయూడబ్ల్యూజే, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొనగా ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.సురేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌వీ రమణ, దాసరి కనకయ్య, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్రావు తదితరులు నిర్వహణా సహకారాన్ని అందజేశారు



ఏడాది పూర్తి చేసుకున్న కలెక్టర్‌ను సత్కరిస్తున్న ఎన్‌జీవో సంఘ నాయకులు

పీ4 అమలుకు ప్రత్యేక మార్గదర్శిగా కలెక్టర్

వెట్టిచాకిరీ నుంచి విముక్తి పొందిన కుటుంబాల దత్తతకు నిర్ణయం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ4 కార్యక్రమాన్ని జిల్లాలో అమలు చేయడంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రత్యేక మార్గదర్శిగా నిలిచారు. వెట్టిచాకిరీ నుంచి విముక్తి పొందిన కుటుంబాలను తాను దత్తత తీసుకొని ఈ పథకం కింద వారికి మార్గదర్శిగా ఉండాలని కలెక్టర్ నిర్ణయించారు. మార్గదర్శిగా ఉండటంలోనూ, మార్గదర్శకులను గుర్తించడంలోనూ తీసుకోవాల్సిన చర్యలపై గురువారం స్థానిక కలెక్టరేట్ నుంచి మునిసిపల్ కమిషనర్లు, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. జిల్లాలో 74వేలకుపైగా బంగారు కుటుంబాలను ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపారు. వారికికావాల్సిన అవసరాలను గుర్తించడంతో పాటు వాటిని సమకూర్చి ఆయా కుటుంబాలకు అండగా ఉండే మార్గదర్శకులను కూడా త్వరగా గుర్తించాలన్నారు. సంబంధిత వివరాలను రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని కలెక్టర్ ఆదేశించారు. సహాయం చేసేందుకు ముందుకు వచ్చే ఎన్‌ఆర్‌ఐలు, ఇతర ప్రైవేటు వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థలను గుర్తించాలన్నారు. ఎన్ని కుటుంబాలనైనా దత్తత తీసుకోవచ్చని, ఈ విషయంలో పరిమితి లేదని స్పష్టం చేవారు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా హోదాతో సంబంధం లేకుండా ఆసక్తి ఉన్న వారందరూ బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని సూచించారు. మార్గదర్శకులను ప్రత్యేకంగా ఆహ్వానించి వారితో తాను సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఆగస్టు 15వతేదీలోపు ఈ గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కాగా ఈ వెబ్‌సైట్‌లో బంగారు కుటుంబం, మార్గదర్శకుల వివరాలను ఏ విధంగా నమోదు చేయాలో జిల్లాపరిషత్ సీఈవో చిరంజీవి ఈ సందర్భంగా అధికారులకు వివరించారు. వర్షాలు ప్రారంభమైనందున పారిశుధ్యం, సురక్షిత తాగునీటి సరఫరా తదితర అంశాలకు గ్రామాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో చిన ఓబులేషు, వివిధశాఖల అధికారులు వెంకటేశ్వరరావు, డాక్టర్ టి. వెంకటేశ్వర్లు, శ్రీనివాస నాయక్, పద్మశ్రీ, జగన్నాథరావు, అర్జున్‌నాయక్, నారాయణ, బాల శంకరరావు, వరలక్ష్మి, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌కు అభినందనలు

జిల్లా కలెక్టర్‌గా ఏడాది కాలం పూర్తిచేసుకున్న తమీమ్ అన్సారియాను ఏపీఎన్‌జీవో అసోసియేషన్ నాయకులు సత్కరించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో గురువారం ఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కే శరత్‌బాబు, ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో కలెక్టర్ అన్సారియాను శాలువతో సత్కరించారు. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రజలకు నత్యం సేవ చేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా సేవలను కొనియాడారు. బంగారు బాల్యం కార్యక్రమానికి స్కోచ్ అవార్డును సాధించడంతో పాటు జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న కలెక్టర్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీవో సంఘం నాయకులు కొత్తపట్నం మంజేష్, పి. రామాంజనేయులు, షేక్ మోమిన్, పి. మాధవి, కే కోటేశ్వరమ్మ, షేక్ కరీముల్లా, హరిబాబుతో పాటు పలువురు ఉద్యోగులు ఉన్నారు.

షట్టర్ పగులగొట్టి రూ.2లక్షల నగదు చోరీ

ఒంగోలు క్రైం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): దుకాణం షట్టర్ పగులగొట్టి అందులోని రూ.2లక్షలు నగదు అపహరించుకుని వెళ్లారు దుండగులు. ఈ సంఘటన ఒంగోలు నగరం కర్నూల్‌రోడ్‌లోని మహాలక్ష్మి ఎలక్ట్రికల్స్‌లో జరిగింది. గురువారం ఉదయం షాప్ యజమాని వచ్చి చూసే సరికి షట్టర్ తాళాలు పగులగొట్టి ఉండంతో హడావిడిగా లోపల ఉన్న క్యాష్ బాక్సును యజమాని పరిశీలించారు. దానిని పెకలించిన దొంగలు రూ.2లక్షలు నగదు అపహరించారని గుర్తించారు. దీంతో బాధితుడు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. అదే సమయంలో సమీపంలోని మరో దుకాణం షట్టర్ కూడా పగులగొట్టి రూ.2వేల నగదు అపహరించుకెళ్ళారు. తాలూకా పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు.

యువకుడు ఆత్మహత్య

ఒంగోలు క్రైం, జూన్26 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన ఒంగోలు నగరం వడ్డిపాలెంలో బుధవారం రాత్రి జరిగింది. బేల్దారి పనులు చేసుకునే కుంచాల శ్రీనివాసులు(24) రేకుల షెడ్‌కు ఉన్న ఇనుప రాడ్‌కు చీరతో ఉరివేసుకున్నాడు. వెంటనే ఆయన తండ్రి వెంకటేశ్వర్లు, కుమార్తె వెళ్ళి చీరను కోసి శ్రీనివాసులును కిందకు దించి రిమ్స్‌కు తరలించారు. అయితే అప్పటికే శ్రీనివాసులు మృతి చెందాడని డాక్టర్లు తెలిపారు. కాగా మృతుడు మద్యానికి బానిసై నిత్యం తండ్రితో గొడవ పడుతూ ఉండేవాడు. ఈక్రమంలో వారు మరోసారి గొడవ పడ్డారు. దీంతో మనస్థాపానికి గురై శ్రీనివాసులు ఆత్మహత్యకు పాల్పడినట్లు తండ్రి చెప్పారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దేవరంపాడులో కేంద్రం బృందం పరిశీలన


చెత్తబుట్టలను పరిశీలిస్తున్న బృంద సభ్యులు

ఒంగోలు(రూరల్), జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం దేవరంపాడు గ్రామంలో గురువారం కేంద్రం బృందం పర్యటించింది. ఈ సందర్భంగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలో గల తాగు నీటి వసతి, మరుగుదొడ్లను పరిశీలిచింది. అలాగే కొన్ని నివేశ గృహాలకు సందర్శించి గ్రామస్థులతో మాట్లాడారు. తాగునీరు సరఫరా, గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. తడి, పొడి చెత్తలను గురించి, డ్రైనేజ్ వ్యవస్థను, చెత్త సంపద కేంద్రాన్ని సభ్యులు పరిశీలించారు. కార్యక్రమంలో కేంద్ర పరిశీలక బృంద సభ్యులు జి.రవి, బి.పద్మిని, మధుమిత, ఎంపీడీవో రాజశేఖర్‌రావు, డిప్యూటీ ఎంపీడీవో ఎ.బాలచెన్నయ్య, ఏఈ వంశీకృష్ణారెడ్డి, ఎస్‌బీఎం ప్రతినిధులు రవీంద్ర, ఖాజావలి, సర్పంచ్ ఎన్.వెంకటేశ్వరరావు, పీఎస్.బేబి తదితరులు పాల్గొన్నారు

వైభవంగా సీతాలమ్మ తిరునాళ్ల


ఆలయానికి ఊరేగింపుగా వెళుతున్న భక్తులు

కొండపి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మిట్టపాలెంలో సీతాలమ్మ పొంగళ్ళు, తిరునాళ్ల భక్తులు, గ్రామస్థులు గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి గ్రామస్థులు మేళతాళాలతో పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

పీజీసెట్‌లో చీమకుర్తి విద్యార్థినికి స్టేట్ ఫస్ట్ ర్యాంకు

చీమకుర్తి, జూన్26(ఆంధ్రజ్యోతి): పీజీసెట్ ఫలితాల్లో చీమకుర్తికి చెందిన ఉమామహేశ్వరి రాష్ట్రస్థాయిలో ప్రథమర్యాంకు సాధించారు. పట్టణంలోని చేనేతకుటుంబానికి చెందిన ఆకురాతి రంగారావు కుమార్తె అయిన ఉమామహేశ్వరి గుంటూరులోని చలపతి ఫార్మసీ కళాశాలలో ఫార్మసీ విద్యను పూర్తిచేశారు. ఈక్రమంలో పీజీసెట్ రాయగా అందులో ప్రథమస్థానం రావడంతో కళాశాల అధినేత వైవీ.ఆంజనేయులు, అధ్యాపకులు అభినందించారు. ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. అలాగే పలువురు ఉమామహేశ్వరిని అభినందించారు.

పంచాయతీ కార్మికులకు జీతాలు అందజేత


కార్మికులకు జీతాలను అందిస్తున్న అధికారులు

నాగులుప్పలపాడు, జూన్26 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు పంచాయతీ కార్మికులకు గత మూడు నెలలుగా జీతాలు నిలిచిపోవడంతో ఇటీవల సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. దాంతో స్పందించిన పంచాయతీ అధికారులు కార్మికులకు మూడు నెలల జీతాలను గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయలో అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవరకొండ జయమ్మ, ఎంపీటీసీ-2 మున్నంగి వెంకట్రావు, సచివాలయం-2 కార్యదర్శి రమణారావు, జూనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాట్రగడ్డ చంద్రబాబు, తెలగతోటి జాన్సన్, గోగినేని శేషగిరి, సీపీఎం నాయకుడు తూబాటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సరుగుడు తోట దగ్ధం

కొండపి/టంగుటూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ఆలకూరపాడులోని ముసి ఒడ్డున ఉన్న వి.వెంకటేశ్వరరెడ్డికి చెందిన సరుగుడు తోట ప్రమాదవశాత్తు గురువారం దగ్ధమైంది. టంగుటూరు అగ్నిమాపక కేంద్రం అధికారి రమణారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

కష్టపడి పనిచేసే వారికే పార్టీ పదవులు

● ఎమ్మెల్యే దామచర్ల


కమిటీ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ కలిగిన తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసేవారికి పదవులు లభిస్తాయని, పార్టీ బలోపేతానికి కష్టపడిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ అనుబంధ సంఘాల కమిటీ నియామకంపై గురువారం ఒంగోలులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు ప్రతిపక్షంలో ఉన్నపుడు కన్నా అధికారంలోనే ఉన్నపుడే బాధ్యత మరింత పెరుగుతుందని తెలిపారు. పదవులు కేటాయింపుల్లో ఎవరు అసంతృప్తి చెందాల్సిన అవసరం లేదన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడం, ప్రజల సమస్యలు పరిష్కార దిశగా పనిచేయాలని కోరారు. పార్టీ బలోపేతమే ప్రతి ఒక్కరి బాధ్యతగా ముందుకు సాగాలని సూచించారు పదవులు కేటాయింపు పారదర్శకంగా సామాజిక వర్గాల ప్రాధాన్యత మేరకు ఉంటుందని చెప్పారు. పార్టీలో కార్యకర్తగా పనిచేస్తున్నందుకు ప్రతి ఒక్కరూ గౌరవంగా భావించాలని తెలిపారు. పరిశీలకుడు దాసరి రాజా మాస్టర్ మాట్లాడుతూ సమర్ధవంతమైన నాయకుడు దామచర్ల జనార్దన్ నాయకత్వంలో పనిచేయడం గొప్పగా భావించాలన్నారు. టీడీపీలో పనిచేయడం కూడా ప్రతిష్టను పెంచుతుందని పేర్కొన్నారు. సమావేశంలో పరిశీలకులు కంచర్ల కోటయ్య, మోది వెంకటేశ్వరరావు, నాయకులు కొటారి నాగేశ్వరరావు, మంత్రి శ్రీనివాసరావు, ఎద్దు శశికాంత్ భూషణ్, బండారు మదన్, డివిజన్ నాయకులు, బూత్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

టీడీపీ నగర అధ్యక్షుడిగా మదన్

● మహిళా అధ్యక్షురాలిగా వరలక్ష్మి

టీడీపీ ఒంగోలు నియోజకవర్గ అనుబంధ సంఘాల కమిటీలను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నియమించారు. గురువారం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే దామచర్ల నేతృత్వంలో నిర్వహించిన కమిటీ నియామకంలో పూర్తి స్థాయి పారదర్శకంగా, శ్రేణుల అభిప్రాయం మేరకు చేపట్టారు. కాగా నగర కమిటీ అధ్యక్షుడి పదవి కోసం భారీగా పోటీ జరగ్గా, పలువురు ఆశావాహులు ఆసక్తి చూపారు. కాగా అత్యధిక శాతం మంది బండారు మదన్‌ను ఆమోదించారు. ఇక నగర ప్రధాన కార్యదర్శిగా బోడపాటి వెంకట్, గుర్రాల రాజ్‌విమల్ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. అయితే వెంకట్‌ను నగర ప్రధాన కార్యదర్శిగా నియమించారు. కాగా నగర మహిళ అధ్యక్షురాలిగా పెద్దిశెట్టి వరలక్ష్మిని, ప్రధాన కార్యదర్శిగా ముంతాజ్ బేగంను, అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షురాలిగా నిడమనూరి పావని, ప్రధానకార్యదర్శిగా సుజాత, అంగన్‌వాడీ సాధికారత ఒంగోలు అధ్యక్షురాలిగా దుర్గామల్లేశ్వరి, ప్రధానకార్యదర్శిగా లక్ష్మి, అంగన్‌వాడీ నియోజకవర్గ అధ్యక్షురాలిగా రాజ్యలక్ష్మి, ప్రధానకార్యదర్శిగా శారదలను నియమించారు. దాంతోపాటు పలు అనుబంధ సంఘాల కమిటీలను ఎమ్మెల్యే దామచర్ల అధికారకంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు నూతన కమిటీలని అభినందించారు.

'వంకాయలపాటి' సాహిత్య సేవలు అనిర్వచనీయం

● సంస్మరణసభలో సాహితీవేత్తలు


రామకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

ఒంగోలు కల్చరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మంగి గేయ కావ్య సృష్టికర్త డాక్టర్ వంకాయలపాటి రామకృష్ణ మరణం తెలుగు సాహిత్యానికి, జిల్లా సాహిత్యరంగానికి తీరనిలోటని పలువురు సాహితీవేత్తలు పేర్కొన్నారు. డాక్టర్ వంకాయలపాటి రామకృష్ణ సంస్మరణ సభ గురువారం స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలోని మహిళాభ్యుదయ సమితి కార్యాలయం శక్తిసదన్‌లో జరిగింది. నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం(నరసం), కళామిత్ర మండలి సంస్థల ఆధ్వర్యంలో ముందుగా రామకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ అధ్యక్షతన జరిగిన సభలో డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ రామకృష్ణ ఉత్తమ ఉపాధ్యాయునిగా, రచయితగా, విశ్లేషకునిగా రాణించారన్నారు. గొప్ప వ్యక్తిత్వం డాక్టర్ రామకృష్ణదని తేళ్ల అరుణ పేర్కొన్నారు. తమ కళామిత్ర మండలి సంస్థ జాతీయ స్థాయి సంస్థగా ఎదగటంలో రామకృష్ణ పాత్ర ఎంతో కీలకమైనదని సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు అన్నారు. ఆయన పేరుమీద ప్రతి సంవత్సరం సాహిత్య పురస్కారం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నరసం ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, కుర్రా ప్రసాద్‌బాబు, ఓరుగంటి ప్రసాద్, ఎం.సూర్యకుమారి, మిడసల మల్లికార్జునరావు, బీరం అరుణ, నాళం నరసమ్మ, నాగ మనోహర లోహియా, కె.బాలకోటయ్య, రాయపాటి సీతమ్మ, డాక్టర్ రామకృష్ణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

● ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్‌నాగరాజు


మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ హేమంత్‌నాగరాజు

సింగరాయకొండ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు బారినపడకుండా దూరంగా ఉండాలని ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వలన కలిగే దుష్పరిణామాలపై ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం వలన శారీరకంగా, మానసికంగా, సామాజికంగా తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. ఎన్డీపీసీ చట్టం గురించి వివరించారు. మాదక ద్రవ్యాలను కలిగిఉండటం, వినియోగించడం, రవాణాచేయడం చట్టపరంగా నేరమని చెప్పారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వెంకట్, సీఐ మేడికొండ శివకుమారి, ఎస్సై రాజశేఖర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలకలు, నోట్ పుస్తకాల పంపిణీ

● దాతల చేయూత


ఒంగోలులో విద్యా సామగ్రిని అందజేస్తున్న ఉపాధ్యాయురాలు ఝాన్సీరాణి

ఒంగోలు విద్య, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కోర్టు సెంటర్‌లోని మునిసిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు నత్తల ఝాన్సీరాణి గురువారం పలకలు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్ళు పంపిణీ చేశారు. గత 25 సంవత్సరాలుగా ఆ పాఠశాలలో పనిచేసి ప్రస్తుతం ఉద్యోగోన్నతిపై వెళ్తున్న ఆమె విద్యార్థులకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఝాన్సీరాణిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో పి.సరస్వతి, హెచ్‌ఎం సుబ్బారావు, ఉపాధ్యాయులు నత్తల రాజేశ్వరి, వినీత్, నాగేంద్రం, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముప్పావారిపాలెంలో..

చీమకుర్తి: ముప్పావారిపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న మూడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు గురువారం విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. దాత అప్పనబోయిన శ్రీనివాసరావు చేతులమీదుగా బ్యాగులు, నోటు పుస్తకాలు, ఇతర విద్యా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా హాజరైన ఎంఈవోలు నరసింహారావు, శివాజీలు దాతలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పుట్టా శ్రీనివాసరావు, సర్పంచ్ బొడ్డు రవి, బొడ్డు కోటేశ్వరరావు, పూసపాటి వెంకట్రావు, బక్కా సుధీర్, కుంచాల రాంబాబు, భాస్కర్, రమణయ్య, శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్పు చేయడంతో పాటు 12 గంటల పని విధానాన్ని రద్దు చేయాలని, కార్మికులకు చట్టబద్ధత సౌకర్యాలు కల్పించకుండా కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ వచ్చేనెల 9వతేదీన జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని యూనియన్ గౌరవాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు కోరారు. ఒంగోలులోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ విస్తృత స్థాయి సమావేశానికి కె.సుబ్బారాయుడు అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సార్వత్రిక సమ్మెలో కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు, కె.పద్మ, విజయమ్మ, అనిత, పోకల కోటేశ్వరరావు, ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌పై అసత్య ఆరోపణలు దారుణం

● వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవిబాబు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డిపై రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అసత్య ఆరోపణలు చేయడాన్ని వైసీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు ఖండించారు. గురువారం ఒంగోలులోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డిని అణిచివేసేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. రాష్ట్రంలో గిట్టుబాటు ధరలు లేక రైతులు రోడ్డున పడుతుంటే పట్టించుకోకుండా ప్రతిపక్ష నేతలను అణిచివేసేలా వ్యవహరిస్తున్నారని, తగిన మూల్యం చెల్లించాల్సి వస్తోందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు లంకపోతు అంజిరెడ్డి, కటారి శంకర్, మన్నే శ్రీనివాసరావు, శ్రీమన్నారాయణ, ఇమ్రాన్, ఆళ్ళ రవీంద్రారెడ్డి, వైవీ.గౌతమ్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం

నేర నియంత్రణకు చర్యలు చేపట్టాలి ● ఎస్పీ దామోదర్ ఆదేశం

ఒంగోలు క్రైం, జూన్26 (ఆంధ్రజ్యోతి): అసాంఘీక కార్యక్రమాలపై నిరంతరం నిఘా ఉంచి కట్టడి చేయాలని ఎస్పీ ఏఆర్.దామోదర్ కోరారు. గురువారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో నెలవారీ నేర సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేయాలన్నారు. జిల్లాలో అసాంఘీక కార్యక్రమాలపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. పెండిగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. రానున్న లోక్‌అదలాత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు కృషి చేయాలని చెప్పారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో డీఎస్పీలు లక్ష్మీనారాయణ, నాగరాజు, రమణకుమార్, సీఐలు దేవప్రభాకర్, సూర్యనారాయణ, దుర్గాప్రసాద్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

రేపటి నుంచి భాగవత సప్తాహం

ఒంగోలు కల్చరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వికాస తరంగిణి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ నుంచి భాగవత సప్తాహం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తడికమళ్ల హరిప్రసాదరావు, రంగనాథం, తులసి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒంగోలు నగరం దక్షిణం బజారులోని శ్రీరామనుజ కూటములో నిర్వహించే ఈ సప్తాహ కార్యక్రమం జూలై 5వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ప్రతిరోజు ఉదయం 8 గంటలకు ఉపన్యాసం అనంతరం తీర్థగోష్టి ఉంటాయని, సాయంత్రం 6 గంటల నుంచి శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, 8 గంటలకు ఉపన్యాసం ఉంటుందన్నారు. అదేవిధంగా 5వ తేదీ సాయంత్రం 6 గంటలకు శ్రీరుక్మిణీ కళ్యాణం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం


పూజలో పాల్గొన్న నాగేశ్వరరావు

మద్దిపాడు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మద్దిపాడులో తెలుగుదేశం పార్టీ నూతన కార్యాలయాన్ని పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మండవల్లి శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉండేలా కార్యాలయం ఏర్పాటు చేశామని చెప్పారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నోబిడ్‌లు..

ఒంగోలు(రూరల్), జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-2లో గురువారం జరిగిన వేలంలో అధికశాతం బేళ్ల నోబిడ్‌లు అయ్యాయి. మొత్తం 890 బేళ్లు రాగా అందులో 368 బేళ్లు తిరస్కరకు గురయ్యాయి. దీంతో రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. లోగ్రేడ్ పొగాకును వ్యాపారులు కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదు. లోగ్రేడ్ పొగాకు కిలో రూ.160లకు వేలం ప్రారంభించినప్పటికీ బయ్యర్లు ఆసక్తి చూపలేదు. దీంతో రైతులు బేళ్లను తమ ఇళ్లకు తీసుకుని వెళ్లారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలి


మద్దిపాడులో చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

మద్దిపాడు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఐవీఆర్ఎస్ గ్రామ పంచాయతీలుగా ఎంపికైన మండలంలోని అన్నంగి, దొడ్డవరం, ఇనమనమెళ్లూరు, కీర్తిపాడు, రాచవారిపాలెం, మద్దిపాడు, మల్లవరం గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డిప్యూటీ ఎంపీడీవో కె.రఘుబాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ద్వారా గ్రామ పరిశుభ్రత, చెత్త సేకరణపై అభిప్రాయాలను సేకరించి ప్రతికూల అభిప్రాయం వచ్చిన గ్రామపంచాయతీ కార్యదర్శుల నుంచి వివరణ కోరుతూ సంతృప్తికర వివరణ సమర్పించని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు అయన తెలిపారు. ప్రతిరోజు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు జరిగే చెత్త సేకరణ కార్యక్రమాన్ని వ్యక్తిగత పర్యవేక్షణ చేయాలన్నారు. మద్దిపాడు గ్రామ పంచాయతీలో డిప్యూటీ ఎంపీడీవో రఘుబాబు గురువారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహిచారు. పంచాయతీ కార్యదర్శి ఆషాలక్ష్మి కార్మికులకు పలు సూచనలు చేశారు.

పంచాయతీల ఆదాయం పెంపుపై దృష్టి

ఇక గ్రామ పంచాయతీలలో ఆదాయం పెంపుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని డిప్యూటీ ఎంపీడీవో రఘుబాబు అన్నారు. మండలంలో 10 వేలు అంతకన్నా ఎక్కువ చదరపు అడుగులు భవనాలను సందర్శించి కొలతలు వేసి ఆస్తి పన్ను నిర్ధారణ చేస్తామని, ఇందుకోసం 57 భవనాలను అధికారులు గుర్తించారని తెలిపారు. గురువారం వెల్లంపల్లి పంచాయతీ పరిధిలోని హోటల్ ఆవాస్‌ను డిప్యూటీ ఎంపీడీవో ఆధ్వర్యంలో పరిశీలించి కొలతలు తీసుకున్నారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం పరిశీలన


కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈడీ వెంకటేశ్వరరావు

ఒంగోలు నగరం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో జరుగుతున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలను గురువారం బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు పరిశీలించారు. కేంద్రాలకు వస్తున్న వారికి శిక్షణ ఎలా జరుగుందనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక డాన్‌బాస్కోలో జరుగుతున్న కుట్టు శిక్షణా కేంద్రంలో వారు కుడుతున్న దుస్తులను పరిశీలించారు. శిక్షణకు పేర్లు నమోదు చేసుకున్న వారంతా వచ్చేలా చూడాలని నిర్వాహకులను కోరారు. సమయపాలన పాటించాలని చెప్పారు. శిక్షణ అనంతరం వారు కుట్టు కేంద్రాన్ని ఏర్పాటు చేసుకుని జీవనం సాగించేలా ఉండాలని ఈడీ పేర్కొన్నారు.

జీవితంలో ఉన్నతంగా ఎదగాలి


మాట్లాడుతున్న వెంకట్రావు

నాగులుప్పలపాడు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జీవితంలో ఉన్నతంగా ఎదిగాలంటే మన చుట్టూ ఉండే ఉన్నతమైన వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రిన్సిపాల్ ముద్రబోయిన రామచంద్రరావు అన్నారు. తిమ్మసముద్రం గోరంట్ల వెంకన్న ఓరియంటల్ కళాశాలలో గురువారం విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే కృషి, పట్టుదల అలవరచుకోవాలని సూచించారు. ఇష్టంతో కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. విద్యతోనే ఏదైనా సాధించగలరని, తద్వారా జీవితంలో ప్రతికూల పరిస్థితులు ఎదురైనపుడు స్వయంకృషితో ఎదిగి ఆదర్శంగా జీవించవచ్చని సాఫ్ట్‌వా సొల్యూషన్స్ డైరెక్టర్ తుళ్లూరి వెంకట్రావు తెలిపారు. కార్యక్రమంలో వెంకన్న ట్రస్ట్ ఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు నడుం బిగించాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

మద్దిపాడు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): గంజాయి నిర్మూలనకు అందరూ కృషి చేయాలని తహసీల్దార్ ఆదిలక్ష్మి అన్నారు. గురువారం మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయం నుంచి జరిగిన ర్యాలీలో ఆమె మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్‌ప్రసాద్ మాట్లాడుతూ గంజాయి నిర్మూలనలో యువత ముందుండాలన్నారు. కార్యక్రమంలో కె.సుబ్బారావు, ధనుంజయ్‌వర్మ, రమణయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో 16రోజుల పండుగ

పెద్దదోర్నాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : షిరిడీ సాయి బాబా దేవాలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ పదహారు రోజుల వేడుకలను గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారికి సామూహిక సచ్చరిత్ర పారాయణాలతో 108 రకాల ఫలాహారాల నైవేద్యాలను నివేదన చేశారు. అనంతరం సాయి మధ్యాహ్న హారతి ఇచ్చారు. ఈ వేడుకలకు గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి సాయినాథున్ని సేవించారు. స్వామి వారికి నివేదించిన నైవేద్యాన్ని భక్తులకు ప్రసాదంగా పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు బొగ్గరపు చంద్రశేఖర్, అన్నా వెంకటప్రసాద్, బొగ్గరపు రమేష్, రమణ, పెరుమాళ్ల రామారావు, నుసుళ్లపల్లి నారాయణ, సుబ్బారావు, సంకా ప్రసన్న, రవి, బాలిశెట్టి, నరసింహ పాల్గొన్నారు.


106 రకాల నైవేద్యాలు

మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దు


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



కొమరోలులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



దోర్నాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సావిత్రి

మార్కాపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, మత్తుకు బానిసలు కావొద్దని మార్కాపురం ట్రాఫిక్ ఎస్సై సీహెచ్ అహరోన్ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్య నిరోధిక దినాన్ని పట్టణ పోలీసులు గురువారం నిర్వహించారు. ముందుగా పోలీసు స్టేషన్ వద్ద నుంచి ప్రధాన వీధు ల్లో విద్యార్థులు, ఆటో డ్రైవర్లు, యువత నినాదాలు చేసుకుంటూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై అహరోన్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు యువత జీవితాలను చిత్తు చేస్తాయన్నారు. ప్రభు త్వం డీఎడిక్షన్ సెంటర్‌లను కూడా ఏర్పా టు చేసిందన్నారు. కార్యక్రమంలో పట్టణ పోలీసు సిబ్బంది, జడ్పీహెచ్ స్కూల్ పీడీలు శ్యామలాదేవి, ఓబులేసు, స్కౌట్ మాస్టర్ సమివుల్లా పాల్గొన్నారు.

ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో

అంతర్జాతీయ మాదక ద్రవ్య నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. గౌతం కాలేజీ విద్యార్థులతో కలిసి పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఈ ర్యాలీ సాగింది. ఎక్సైజ్ సీఐ ఎం.వెంకటరెడ్డి, ఎస్సై ఎంవీ గోపాలకృష్ణ, స్టేషన్, ఈఎస్‌టీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

కంభం : మాదక ద్రవ్యాల అమ్మకం, వినియోగించడం నేరమని, అలా పట్టుబడినవారికి శిక్షలు తప్పవని ఎక్సైజ్ సీఐ ఎస్.కొండారెడ్డి తెలిపారు. గురువారం గౌతమి డిగ్రీ కాలేజీలో అంతర్జాతీయ మాదక ద్రవ్యా ల వ్యతిరేక దినం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ కొండారెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ వాడకాన్ని నివారించడంలో కుటుం బం, విద్యా సంస్థలు, సమాజం కలిసికట్టుగా ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా విద్యార్థుల్లో అవగాహన కలిగించేందుకు పోస్టర్లు, బ్రోచ ర్లు, వీడియోల ద్వారా ప్రచారం నిర్వహించారు. డ్రగ్స్‌పై ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యా ర్థులు పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సావిత్రి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నషా ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రధానంగా విద్యార్థులు బంగారు భవిష్యత్ కోసం జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకొని క్రమ శిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. చెడు అలవాట్లను దరి చేరనీయ కూడదని, తద్వారా ఆస్తి నష్టం, ప్రాణ భయం, సమాజంలో గౌరవం కోల్పోతామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

కొమరోలు : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పోలీసులు గురువారం ఆంజనేయస్వామి గుడి ఆవరణలో ప్రజలకు అవగాహన కల్పించారు. స్టేషన్ ఇన్‌చార్జి నారాయణ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారన్నారు. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనిస్తుండాలన్నారు.

ఛత్రపతి సాహుకి నివాళి

గిద్దలూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల రిజర్వేషన్ల కోసం పాటుపడిన ఛత్రపతి సాహు మహరాజ్ 151వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సాయిటెక్నో ఒకేషనల్ పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సాహు మహరాజ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు కంచర్ల కోటయ్యగౌడ్, ఒకేషనల్ కళాశాల కరస్పాండెంట్ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.


← నివాళులర్పిస్తున్న నాయకులు


కంభంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

అభివృద్ధి పథకాలపై బీజేపీ ప్రచారం

గిద్దలూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి పథకాలపై బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, డాక్టర్ నారాయణ, కాసులు, చంద్రమోహన్, పుల్లయ్య పాల్గొన్నారు.

కంభం : కేంద్ర ప్రభుత్వ పథకాలపై గురువారం బీజేపీ నాయకులు కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని మెయిన్ బజారులో ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 11 ఏళ్లుగా మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నేషనల్ కౌన్సిల్ మెంబర్ ఎస్.సరోజిని, కిసాన్‌మోర్చ జిల్లా అధ్యక్షులు బి.క్రిష్ణ, జిల్లా కార్యదర్శి చిన్నయ్య, కంభం మండల అధ్యక్షులు బి.కిశోర్, మాజీ కోశాధికారి బి.మనోహర్, సీనియర్ నాయకులు భూపతిరెడ్డి, సాయికుమార్, ప్రవీన్ పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించుకోవాలి

పెద్దారవీడు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తల్లికి వందనంలో అర్హత పొందేందుకు రైతులు భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ పులి శైలేంద్రకుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. మండలంలో రీసర్వే పూర్తయిన రెవెన్యూ గ్రామాలైన దేవరాజుగట్టు, గొబ్బూరు, అంబాపురం, ఓబులక్కపల్లిలలో జాయింట్ లాండ్ పొజిషన్ మ్యాపింగ్ కలిగిన లబ్ధిదారుల భూములకు సంబంధించిన విస్తీర్ణం అధికంగా నమోదవడం వలన తల్లికి వందనం పథకానికి అనర్హులుగా గుర్తించినట్లు చెప్పారు. రైతులు తమ పేరు మీద ఉన్న భూమిని సింగిల్ పొజిషన్ మ్యాపింగ్‌గా మార్చుకోవాలన్నారు. తద్వారా తల్లికి వందనానికి అర్హత పొందవచ్చన్నారు. భూమి వివరాలు కచ్చితత్వం లేకపోతే ప్రభుత్వ పథకాలు అందడంలో జాప్యం జరుగుతుందన్నారు.

జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ

గిద్దలూరు టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన స్థానిక సాయి చైతన్య డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించనున్న జాబ్‌మేళా పోస్టర్‌ను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి గురువారం ఆవిష్కరించారు. 15 బహుళ జాతి కంపెనీల ప్రతినిధులు జాబ్‌మేళాకు హాజరుకానున్నారని, ఇంటర్వ్యూలో సెలక్ట్ అయిన అభ్యర్థులకు నెలకు రూ.12 నుంచి రూ.20వేల వేతనం ఇవ్వడం జరుగుతుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎ.రవితేజయాదవ్ ఈసందర్భంగా పేర్కొన్నారు. 18 నుంచి 30 ఏళ్ల వయస్సు గల, 10వ తరగతి నుంచి పిజి వరకు నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

నేడు సమావేశం

గిద్దలూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కడప లక్ష్మి అధ్యక్షతన ఈనెల 27వ తేదీ శుక్రవారం ఉదయం 11గంటలకు తమ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో రమణారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

పార్టీ పటిష్టతకు నిబద్ధతతో పనిచేయాలి

ఎమ్మెల్యే నారాయణరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పార్టీ పదవులు పొందిన నాయకులు నిబద్ధత, చిత్తశుద్ధితో పనిచేసి పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక ఎస్‌వీకేపీ కాలేజీకి సమీపంలోని వక్కలగడ్డ అపార్ట్‌మెంట్‌లో గురువారం మార్కాపురం నియోజకవర్గంలోని అన్ని మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు కనుమూరి బాజీచౌదరి, ఎమ్మెల్యే కందుల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ చిన్నపాటి ఒడిదొడుకులు ఉన్నా అందరూ కలిసికట్టుగా పార్టీ కోసం పనిచేయాలన్నారు. పార్టీ పదవులు రానివాళ్లు నిరాశ చెందవద్దని, ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందన్నారు. టీడీపీ కార్యకర్తలంటే క్రమశిక్షణకు మారుపేరన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తుంటే వైసీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు. ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకు వారు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నట్లు చెప్పారు. రైతులకు రూ.20వేల సాయం కూడా త్వరలోనే అమలవుతుందన్నారు. ఒక్క అవకాశం అంటూ జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని రూ.6లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. ప్రజా ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధిబాట పట్టించేందుకు తీవ్రంగా కష్టించాల్సి వస్తోందన్నారు. గ్రామాల్లో కూడా అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు. నియోజకవర్గం మొత్తం రూ.390 కోట్లతో ఇంటింటికీ పైప్‌లైన్ పనులు జరుగనున్నాయన్నారు. త్వరలోనే వెలుగొండ ప్రాజెక్టు పూర్తవుతుందన్నారు. అంతేకాక మార్కాపురం జిల్లాను కూడా ప్రభుత్వం ప్రకటిస్తుందన్నారు. జూలై 2 నుంచి గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వం చేసిన మంచిని వివరించడమేకాకుండా, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా పరిశీలకులు బాజీ చౌదరి పర్యవేక్షణలో నియోజకవర్గంలోని అన్ని మండల కమిటీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, మాలపాటి వెంకటరెడ్డి, నీటి సంఘం అధ్యక్షులు దగ్గుల శ్రీనివాసరెడ్డి, కాకర్ల శ్రీనివాసులు, షేక్ షెక్షావలి, పఠాన్ ఇబ్రహీంఖాన్, దూదేకుల మస్తానయ్య, కొప్పుల శ్రీనివాసులు, మట్టం వెంకటేశ్వర్లు, జవ్వాజి రామాంజులరెడ్డి, గొలమారి నాసర్‌రెడ్డి, ఉడుముల చిన్నపరెడ్డి, కాశయ్య పాల్గొన్నారు.

మార్కాపురం జిల్లాను తక్షణమే ప్రకటించాలి


సబ్ కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేస్తున్న జిల్లా సాధన వేదిక నాయకులు

మార్కాపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం కేంద్రంగా జిల్లాను ప్రభుత్వం తక్షణమే ప్రకటించాలని జిల్లా సాధన వేదిక నాయకులు గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మార్కాపురం, ఎర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి, దర్శి ప్రాంతాలతోపాటు పల్నాడు జిల్లాలోని వినుకొండ, నంద్యాల జిల్లాలోని శ్రీశైలం, సున్నిపెంట ప్రాంతాలను నూతన జిల్లాలో కలపాలన్నారు. వాస్తవానికి శ్రీశైలం మార్కాపురానికి దగ్గరగా ఉంటుందన్నారు. నంద్యాల జిల్లా కేంద్రానికి శ్రీశైలం 150 కిలోమీటర్లు ఉంటే మార్కాపురంకు కేవలం 80 కిలోమీటర్ల దూరంలో మాత్రమే ఉందన్నారు. అదే విధంగా వినుకొండ నియోజకవర్గం కూడా మార్కాపురంలో కలిసేందుకు భౌగోళికంగా చాలా సారుప్యతలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా సాధన వేదిక నాయకులు గోపాలుని హరిహరరావు, పీఎల్‌పీ యాదవ్, రంగస్వామి, కే అబ్రహం, మెట్ల చెంచయ్య, పిన్నిక చక్రపాణి పాల్గొన్నారు.

మార్కండేశ్వరునికి ఆరుద్ర నక్షత్ర పూజలు



మార్కాపురం వన్‌టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : జగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి ఆలయంలో స్వామికి ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేలూరి ఆంజనేయశర్మ స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు, విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వారాహి నవరాత్రులు ప్రారంభం

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): శివాలయంలో వారాహి నవరాత్రులు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకులు రెంటచింతల వరుణ్‌తేజశర్మ జగదాంబ మాతను ఉన్మత్త వారాహి అలంకారంలో ప్రత్యేకంగా అలంకరించారు. విశేష పూజలు, భజనలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

సాయి జీవిత చరిత్ర పారాయణం

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నెహ్రూబజార్‌లోని సాయి మందిరంలో గురుపౌర్ణమి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మందిరంలో భక్తులు సాయిబాబా జీవిత చరిత్ర పారాయణ మహాయజ్ఞంలో పాల్గొన్నారు. మందిర కార్యదర్శి గోపాలుని హరిహరరావు మాట్లాడుతూ నేటి నుంచి జూలై 2వ తేదీ వరకు వారం రోజులపాటు సాయి చరిత్ర పారాయణం చేస్తారని తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం

పెద్ద దోర్నాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామచంద్రకోట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న జడ్ సుబ్బారావు, ఉపాధ్యాయిని పద్మజను పాఠశాల సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి వారు చేసిన సేవలను గుర్తు చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మహంత్ నాయక్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, విద్యా కమిటీ చైర్మన్ లాలా, ఉపాధ్యాయ సిబ్బంది కోటేశ్వరరావు, ఖైరునిస బేగం పాల్గొన్నారు.

చెత్తపై అవగాహన

గిద్దలూరు టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కమిషనర్ రమణబాబు పట్టణంలోని కొంగళవీడు రోడ్డులో పర్యటించారు. ప్రజలకు తడి, పొడి చెత్తలను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించే విషయంపై అవగాహన కల్పించారు. తడి చెత్తను ప్రాసెసింగ్ ప్లాంట్‌లో ఎరువుగా మారుస్తున్నట్లు చెప్పారు. హోం కంపోస్టు విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాయి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీత పాల్గొన్నారు.

ఆటవస్తువుల అందజేత

గిద్దలూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరులోని గ్రంథాలయానికి యువ ప్రగతి పథం స్వచ్ఛంద సంస్థ సభ్యులు షేక్ నాయబ్‌రసూల్ ఆటవస్తువులు, క్యారమ్ బోర్డును అందచేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రామిరెడ్డి, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించాలి

గిద్దలూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ ఉద్యోగులతో డివిజనల్ లెవెల్ డెవలప్‌మెంట్ అధికారి డి.బాలూనాయక్ సమావేశమయ్యారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో జరిగిన ఈ సమావేశంలో బాలూనాయక్ మాట్లాడుతూ తల్లికి వందనం పథకం విషయంలో ఇకెవైసి లేని తల్లులకు వెంటనే ఈకేవైసీ చేయించాలని ఆదేశించారు. చిల్డ్రన్ ఆధార్ కార్డులను సర్వేలను వెంటనే పూర్తి చేయాలని కోరారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి అర్హులైన అందరికీ లబ్ధిచేకూరేలా బాధ్యత తీసుకోవాలని సచివాలయ ఉద్యోగులను కోరారు. సమావేశంలో ఎంపిడిఒ రమణరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

గిద్దలూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అనాథ శవానికి గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో 7 పదుల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందారు. వారం కిందట ఆప్రాంతానికి వచ్చిన వృద్ధుడికి స్థానికులు అల్పాహారం అందించారు. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ మృతి చెందగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో మృతదేహాన్ని ఉంచారు. రెండు రోజులు గడిచినా ఎవరూ రాకపోవడంతో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురూజీ నారాయణరెడ్డి స్పందించి ఆ వృద్ధుడికి హెడ్‌కానిస్టేబుల్ అవినాష్, మున్సిపల్ సిబ్బంది సమక్షంలో అంత్యక్రియలు జరిపించారు.

ప్రధాన కార్యదర్శిగా వంశీధర్‌రెడ్డి

గిద్దలూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీలలో గిద్దలూరుకు చెందిన ఇద్దరు నాయకులకు పదవులు లభించాయి. మాజీ ఎంపీపీ కడప వంశీధర్‌రెడ్డిని స్టేట్ ఆర్‌టీఐ వింగ్ ప్రధాన కార్యదర్శిగా, జి.వెంకటలక్ష్మీరెడ్డిని స్టేట్ ఐటీ వింగ్ ఉప కార్యదర్శిగా నియమిస్తూ వైసీపీ రాష్ట్ర కమిటీ ఉత్తర్వులు జారీ చేశారు.

194 మద్యం బాటిళ్లు స్వాధీనం


పట్టుబడిన బాటిళ్లు

కంభం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలం తురిమెళ్ల గ్రామంలో ఓ గృహంలో అక్రమంగా నిలువ ఉంచిన 194 మద్యం అక్రమ బాటిళ్లను కలిగి ఉన్న టి.రాజేంద్ర అనే వ్యక్తిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు రాచర్ల, అనుమలవీడు షాపుల నందు ఎమ్మార్పీ ధరకు కొనుగోలు చేసి అధిక ధరలకు తురిమెళ్ల గ్రామంలో అమ్ముకుంటున్నట్లు తెలిసింది. గురువారం దాడి చేసి 177 క్వార్టర్ బాటిళ్లను, 17 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకుని రాజేంద్రపై కేసు నమోదు చేసి గిద్దలూరు కోర్టులో హాజరు పరచినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మినా, బెల్టుషాపులు నిర్వహించినా కఠినంగా శిక్షిస్తామని తెలిపారు. ఈ దాడిలో సిబ్బంది రంగనాయకులు, మహబూబ్‌భాషా పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ తండ్రి మృతి

అర్ధవీడు (కంభం), జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : అర్ధవీడు మండలం పాపినేనిపల్లి గ్రామంలో కొడుకు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన తండ్రి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. అర్ధవీడు ఎస్సై శ్రీనునాయక్ కథనం ప్రకారం.. పాపినేనిపల్లె గ్రామానికి చెందిన లక్ష్మీరంగయ్య (55) మద్యానికి బానిసై తరచూ భార్యను కొట్టేవాడు. రెండు రోజుల కిందట మద్యం తాగి వచ్చి తల్లిని వేధించడంతో కొడుకు ప్లాస్టిక్ పైపుతో తండ్రి తలపై బలంగా కొట్టాడు. తీవ్రంగా గాయమైన తండ్రి లక్ష్మీరంగయ్యను ఒంగోలు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కౌలు కార్డులపై అవగాహన కల్పించాలి

ఎర్రగొండపాలెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : వీఆర్వోలు, గ్రామ వ్యవసాయసహాయకులు, ఉద్యాన శాఖ సహాయకులు గ్రామాల్లో పర్యటించి కౌలు రైతుల వివరాలను సేకరించి, అర్హులకు కార్డులు అందించేందుకు కృషి చేయాలని తహసీల్దార్ మంజునాథరెడ్డి తెలిపారు. మండలంలోని వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులతో గురువారం కౌలు రైతుల సమస్యలపై తహసీల్దార్ పలు సూచనలు చేశారు. కౌలు కార్డుల ప్రాధాన్యతను తెలియజేసి రైతులు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏవో నీరజ, ఏఈవోలు పొట్టయ్య, ధనేశ్వర్‌నాయక్ పాల్గొన్నారు.

త్రిపురాంతకం : కౌలు రైతులు గుర్తింపు కార్డు కోసం భూ యజమానికి చెందిన పట్టాదారు పాస్‌పుస్తకం కావాలని దీనిపై రైతులకు అపోహ ఉందని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. కౌలు రైతులకు సంబంధించిన పలు అంశాలపై గ్రామ రెవెన్యూ అధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏవో బి.సంగమేశ్వరరెడ్డి అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో కౌలు రైతులకు భూమి ఇవ్వడం ద్వారా యజమానికి ఇబ్బందులు ఏమి రావని, పంటపై మాత్రమే కౌలుదారుకు హక్కు ఉంటుందని తెలిపారు.

రైతు ఉద్యమాలకు ప్రేరణ స్వామి సహజానంద

త్రిపురాంతకం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : రైతు ఉద్యమాకు స్వామి సహజానంద సరస్వతి ప్రేరణ అని రాష్ట్ర రైతు సంఘ ప్రధానకార్యదర్శి కేవీవీ ప్రసాద్ అన్నారు. సీపీఐ కార్యాలయంలో స్వామి సహజానంద సరస్వతి వర్ధంతి సందర్భంగా రైతు నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజానంద సరస్వతి అఖిల భారత కిసాన్ సభ వ్యవస్థాపక అధ్యక్షుడు అని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు డి.శ్రీనివాస్, రామయ్య, మల్లికార్జున, సాంబశివరావు, ఖాశిం, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

సొంత నిధులతో అభివృద్ధి పనులు

రాచర్ల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనుములపల్లి ప్రజలు సొంత నిధులతో చెరువు అభివృద్ధి పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. స్థానిక నాయకులు సిరిగిరి వెంకటపతి, సిరిగిరి శ్రీహరి, ఆయకట్టు చైర్మన్ సిరిగిరి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో గ్రామ పెద్దల సహకారంతో చెరువులో పెరిగిన చెట్లను తొలగించారు. చెరువులో పూడికతీత పనులను చేపట్టి వాన నీరు నిల్వ ఉండేలా చర్యలు చేపట్టారు.

హామీలను అమలు చేయాలి

గిద్దలూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రా ష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు వై.శ్రీనివాసులు, జిల్లా అదనపు కార్యదర్శి కదీర్, సంఘం నాయకులు పాండురంగస్వామి, వెం కటేశ్వర్లు, దేవసహాయం, పిచ్చయ్య సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

పెద్ద దోర్నాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈవో మస్తాన్ నాయక్ అన్నారు. ఎంఈవో కార్యాలయంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలని, 5వ తరగతి పూర్తయిన వారిని ఉన్నత పాఠశాలలో చేర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 కొండలరావు, ప్రధానోపాధ్యాయులు జే ఝాన్సీలక్ష్మీబాయి, మహంత్ నాయక్, ప్రసన్నతాంజలి పాల్గొన్నారు.

చెన్నుపల్లిలో ప్రత్యేక ఆధార్ క్యాంప్

ఎర్రగొండపాలెం రూరల్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అటవీ ప్రాంతంలో నివసించే చెంచు కుటుంబాల కోసం అసిస్ట్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తహసీల్దారు డీ ధనుంజయరెడ్డి ఆదేశాలు, సహకారంతో ఆ సంస్థ ద్వారా ఆధార్ లేని వారికి నమోదు చేయించారు. కార్యక్రమంలో ఆ సంస్థ కార్యకర్తలు కామ్లానాయక్, ఎం.వెంకటేశం, గంజివారిపల్లి డిజిటల్ అసిస్టెంట్ జే బాలకృష్ణా నాయక్, వీటీడీఏ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్‌ల ఏర్పాటుకు స్థల పరిశీలన

సీఎస్‌పురం(పామూరు), జూన్ 26(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని పెదరాజుపాలెం, వెంకటాయచెరువు గ్రామాల్లో ఆర్వో ప్లాంట్ ఏర్పాట్లకోసం అనువైనస్థలాలను టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంకటేశ్వర్లుతో కలిసి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జి.మోహన్‌రావుతో కలిసి పరిశీలించారు. ఎంపీ నిధులతో రెండు ఆర్వో ప్లాంట్లు మంజూరైనట్లు ఏఈ తెలిపారు. ఒక్కో ఆర్వో ప్లాంట్‌కు రూ.9 లక్షలు మంజూరైనట్టు చెప్పారు. అనువైన స్థలాలను ఎంపిక చేసి పనులు ప్రారంభిస్తామన్నారు.

శాకాహారం అమృతాహారంతో సమానం

పామూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): శాకాహారం అమృతాహారంతో సమానమని పిరమిడ్ ధ్యానకేంద్ర అధ్యక్షుడు పందిటి అల్లూరయ్య తెలిపారు. మానవులు మూగజీవుల పట్ల జాలి, కరుణ చూపాలన్నారు. శాకాహారంపై గురువారం పామూరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శాకాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని చెప్పారు. సకల ప్రాణకోటిలో భగవంతుడు ఉన్నారన్నారు. భక్తికి, ముక్తికి శాకాహారమే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఎం.తిరుపతిరెడ్డి, జి.రమణయ్య, కె.ప్రభాకర్, పి.సౌభాగ్యం, అనసూయ, వాణి, దుర్గ, మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్కీం వర్కర్‌లకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి

కనిగిరి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్కీం వర్కర్‌లకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు పీసీ కేశవరావు డిమాండ్ చేశారు. జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం ఐసీడీఎస్, మున్సిపల్ కార్యాలయాల అధికారులకు సమ్మె నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కీమ్ వర్కర్‌లలోని అంగన్‌వాడీ సిబ్బందికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిలిపివేయాలని చూడటం దుర్మార్గమన్నారు. అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సీత, శారద, రామసుబ్బులు, లక్ష్మయ్య, చార్లెస్, నరేంద్ర, కొండలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతను పరామర్శించిన లక్ష్మి

తాళ్లూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కాలు జారిపడి గాయాలపాలై చికిత్స పొందుతున్న శివరాంపురం మాజీ ఎంపీటీసీ గాడిపర్తి లక్ష్మి నారాయణ తండ్రి, టీడీపీ సీనియర్ నాయకుడు గాడిపర్తి శేషయ్యను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్ సాగర్ దంపతులు గురువారం పరామర్శించారు. శేషయ్యను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకునేందుకు వైద్యులుగా తగు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, మాజీ అధ్యక్షులు ఓబుల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్వామి వార్లకు ప్రత్యేక పూజలు

పామూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీమదనవేణుగోపాలస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు ముగిసిన తరువాత 16 రోజులకు నిర్వహించే పండుగను గురువారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలలను అర్చకులు నారాయణం సత్యబాబు నిర్వహించారు. స్వామివార్లకు పల్లకిసేవ, తదితర కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవో నరసింహబాబు, తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

కనిగిరి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకు డు గుజ్జుల బాలిరెడ్డి అన్నారు. స్థానిక దర్శి చంచయ్య భవనంలో గురువారం జరిగిన ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాల్టీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు, ఇంజనీరింగ్ విభాగం, కొవిడ్ కార్మికుల సమస్యలపై దీర్ఘకాలంగా ఎన్నో ఉద్యమాలు చేసినా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొనాలన్నారు.

కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు అల్లూరి కోటయ్య, అశోక్, కిరణ్, ఇమాంహుస్సేన్, గులాం, పవన్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే రేషన్

- ఐదు రోజులముందే వృద్ధులు, దివ్యాంగులకు పంపిణీ
- దొనకొండ మండలంలో 1694 మంది కార్డుదారులు


రామాపురంలో దివ్యాంగుడికి రేషన్ అందజేస్తున్న డీలర్ చెంచయ్య

దొనకొండ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన సేవలందించటమే లక్ష్యంగా టీడీపీ కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు ముందుకు వేస్తుంది. ఈనేపథ్యంలో గ్రామాల్లో దివ్యాంగులు, వృద్ధులైన కార్డుదారులకు జూలై నెలకు చెందిన బియ్యం, నిత్యావసర సరుకులు ఐదు రోజుల ముందే వారి ఇళ్ల వద్దకు రేషన్ అందించే బృహత్తర కార్యక్రమానికి గురువారం నుంచి శ్రీకారం చుట్టింది.

గత వైసీపీ ప్రభుత్వం రేషన్ బియ్యం డోర్ డెలివరీ అని చెప్పి కోట్ల రూపాయలు ఖర్చుచేసి ఎండీయూ వాహనాలను ఏర్పాటుచేసింది. గ్రామాల్లో ఒక ప్రాంతంలో వాహనం ఆపితే లబ్ధిదారులు పడిగాపులు పడి నిత్యావసర వస్తువులు తీసుకునేవారు. కూటమి ప్రభుత్వం జూన్ 1 నుంచి ఎండీయూ వాహనాలను రద్దుచేసి కార్డుదారులకు ప్రతినెలా 1 నుంచి 15వ తేది వరకు రేషన్‌షాపుల వద్దే సరుకులు అందించే కార్యక్రమాన్ని చేపట్టింది. వృద్ధులు, దివ్యాంగులైన కార్డుదారుల ఇళ్లవద్దకే సరుకులు పంపిణీ చేపట్టారు. గ్రామాల్లో వృద్ధులు, దివ్యాంగులైన కార్డుదారులకు జూలై నుంచి రేషన్‌డీలర్ ఐదు రోజులు ముందే నేరుగా వారి ఇళ్లకు వెళ్లి సరుకులు అందించే కార్యక్రమం చేపట్టింది.

మండలంలోని 28 రేషన్‌షాపుల్లో ఉన్న సుమారు 1694 మంది కార్డుదారులకు డీలర్లు వారి ఇళ్ల వద్దకు వెళ్లి నిత్యావసర సరుకులను అందజేస్తున్నారు. ఇంటికే రేషన్ పంపిణీ అంటే ఇదేనంటూ గ్రామాల్లో పలువురు కార్డుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పామూరు: మండలంలో వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ సరుకులను డీలర్ల ద్వారా ఇళ్ల వద్దనే పంపిణీ చేస్తున్నట్టు తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు తెలిపారు. గురువారం నుంచి ఈనెల 30 వరకు వీఆర్వోల పర్యవేక్షణలో డీలర్లు బయోమెట్రిక్ తీసుకొని రేషన్ సరుకులు అందజేస్తున్నట్టు చెప్పారు. సరుకులు చేయలేదని ఆరోపణలు వస్తే అట్టివారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి


రైతు బజార్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పట్టణంలోని తీగెలగొందిలో రూ.కోటి పది లక్షలతో నిర్మించిన కూరగాయల మార్కెట్‌ను (రైతుబజార్) గురువారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలకాలంగా కూరగాయల మార్కెట్ ఏర్పాటు కనిగిరివాసులకు కలగా మారిందన్నారు. తాను 2009 నుంచి 2014వరకు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలని సంకల్పించినట్టు చెప్పారు. ఆసమయంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు. కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయలేకపోయానని తరచూ మదనపడే వాడినన్నారు. కూటమి ప్రభుత్వంలో కూరగాయల మార్కెట్ (రైతుబజార్) అన్ని విధాల అందరికీ ఆమోదమైన ప్రదేశంలో ఏర్పాటుచేశామన్నారు. రైతుబజార్ ఏర్పాటుతో రైతులు తాము పండించిన పంటను దళారీలు లేకుండా నేరుగా అమ్ముకునే వీలుంటుందన్నారు. అదేసమయంలో మంచి నాణ్యమైన తాజా కూరగాయలను కొనుక్కునేందుకు ప్రజలకు అవకాశం ఉంటుందన్నారు. పట్టణంలో ప్రధాన సెంటరైన బొడ్డుచావిడి వద్ద రోడ్డు పక్కన కూరగాయల అమ్మకాలు సాగించటంవల్ల ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఇకనుంచి అలాంటి సమస్యలకు తావు లేకుండా ఉంటుందన్నారు. జూలై మెదటి వారంలో రైతు బజార్ ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. పజలందరూ రైతుబజార్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు షేప్యార్డ్ చైర్మన్ తోడేటి గోపి, బాలు ఓబులురెడ్డి, జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ ఆఫీసర్ ఎం.వరలక్ష్మి, ఎస్ఎంఏ ప్రతాప్, కార్యదర్శి రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి


మొగిలిగుండాల రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న డాక్టర్ లక్ష్మి తదితరులు

తాళ్లూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. మండలంలోని శివరాంపురం గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న మొగిలిగుండాల రిజర్వాయర్, 132/33 కెవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను డాక్టర్ లక్ష్మి, లలిత్‌సాగర్, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా రిజర్వాయర్ వద్ద జరిగిన సభలో డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ గత వైసీపీ అరాచక పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందన్నారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు పాలన వికాసం వైపు పయనిస్తున్నదని చెప్పారు. తాళ్లూరు, పరిసర గ్రామాలకు సాగు నీరిచ్చే మొగిలిగుండాల రిజర్వాయర్ నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు చేపట్టేందుకు శంకుస్థాపన చేసినట్టు చెప్పారు. తదుపరి వైసీపీ పాలనలో కొంతమేర పనులు చేసి బిల్లులు చెల్లించని కారణంగా కాంట్రాక్టర్ పనులు నిలిపి వేశారన్నారు. యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ మొగిలిగుండాల రిజర్వాయర్ నిర్మాణం పూర్తిచేసి తాళ్లూరు ప్రాంత ప్రజల నీటి కష్టాలు పరిష్కరిస్తామని ఇచ్చిన మాట తీరనుందన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే సీఎం చంద్రబాబు నేతృత్వంలో ప్రజాప్రభుత్వం బిల్లులు విడుదల చేసిందన్నారు. బిల్లులు జమకావటంతో ప్రభుత్వంపై నమ్మకంతో కాంట్రాక్టర్ తిరిగి వేగవంతంగా పనులు చేపడుతున్నారన్నారు. ప్రజలకు మేలు చేయాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని చెప్పారు. రిజర్వాయర్ పూర్తయ్యేందుకు మరో రూ.2 కోట్లు అవసమవుతాయన్నారు. అధికారులు, మంత్రుల దృష్టికి తీసు కెళ్లి నిధులు మంజూరుచేయించి అసంపూర్తి పనులు పూర్తి చేయిస్తామన్నారు. ఈప్రాజెక్ట్‌తో భూగర్భ జలా లు పెరిగి తాళ్లూరు, పరిసర 20 గ్రామాల ప్రజలకు సాగునీటి సమస్య తీ రుతుందన్నారు. కట్టల నిర్మాణాలు, కాంక్రీట్ పనులను ఆమె పరిశీలించారు.

గత టీడీపీ ప్రభుత్వంలో తాళ్లూరు పరిసర పలు గ్రామాల ప్రజలు, రైతాంగం ఎదుర్కొంటున్న లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి 132/33 కేవీ విద్యుత్తు సబ్ స్టేషన్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని డాక్టర్ లక్ష్మి పేర్కొన్నారు. ఆతర్వాత నిర్మాణ పనులు ఒక్క అడుగుకూడా ముందుకు పడలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఉన్నతాధికారులను సంప్రదించి పనులు పూర్తయ్యేలా చూడాలని కోరినట్టు చెప్పారు. మంత్రి ఆదేశాలతో సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. రెండునెలల్లో పూర్తవుతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, రమణారెడ్డి, కాంట్రాక్టర్ గురివిరెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణ, తిరుపతి స్వామి, కల్యాణ్‌చక్రవర్తి, రామయ్య, శాగం కొండారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఆర్.వెంకట్రావు, ఇరిగేషన్ ఏఈ సుబ్బారావు, విద్యుత్ ఈఈ శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి, ఏడీఈ ఆంజనేయులు, ఏఈ ఎం.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నట్టల నివారణ మందుల పంపిణీ


నట్టల నివారణ మందును తాపిస్తున్న సంయుక్త సంచాలకులు డాక్టర్ రవి

సీఎస్‌పురం(పామూరు), జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గొర్రెలు, మేకలకు గురువారం నుంచి జూలై 10 వరకు ఉచితంగా నట్టల నివారణ మందులను పంపిణీ చేస్తున్నట్టు జిల్లా పశుసంవర్థశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ బి.రవి అన్నారు. సీఎస్‌పురం మండలంలోని చెన్నంనాయినిపల్లె గ్రామంలో గొర్రెలు, మేకలకు సామాజిక నట్టల నివారణ కార్యక్ర మాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాలన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండలంలోని చెన్నపునాయినిపల్లె, వి.బైలు, మారుమూల గ్రామాలకు వారంలో ఒకరోజు సంచార పశువైద్యశాల అందుబాటులో ఉంటుందని చెప్పారు.

కార్యక్రమంలో సీఎస్ పురం పశుసంవర్ధకశాఖ సంచాలకులు డాక్టర్ ఆర్.రమేష్, జిల్లా షీఫ్ సొసైటీ చైర్మన్ తోడేటి గోపి, జిల్లా సొసైటీ కార్యదర్శి ఎం.రామకృష్ణ, మండల పశువైద్యాధికారి డాక్టర్ మునీర్, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ పట్టణంగా దర్శిని తీర్చిదిద్దుతాం

దర్శి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): దర్శి మున్సిపాలిటీని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి మోడల్ టౌన్‌గా చేస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. దర్శి మున్సిపాలిటీలోని ఎస్సీ కాలనీలో రూ.16.5 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను, మురుగు కాల్వలను గురువారం సాయంత్రం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో దర్శి నియోజకవర్గంలో నిలచిన అనేక అభివృద్ధి కార్యక్రమాలను పునఃప్రారంభించినట్టు చెప్పారు. దర్శి నగర పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసి అభివృద్ధికి బాటలు వేశామన్నారు. గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో శంకుస్థాపనకే పరిమితమైన టీటీడీ కల్యాణ మండపాన్ని నిర్మిస్తున్నట్టు చెప్పారు. నిర్మిస్తున్నట్లు తెలి పారు. దర్శి నియోజకవర్గంను అన్నీ రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఆమె వివరించారు.

కాగా, కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న 40 మంది యువతీ, యువకులకు గురువారం ఆమె సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకొని అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. అంతకుముందు మండలంలోని తూర్పువీరాయపాలెం ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, వైస్‌చైర్మన్ జి.స్టీవెన్, ఏఎంసీ చైర్‌పర్సన్ దారం నాగవేణి, సుబ్బారావు, టీడీపీ మండల అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు చేరిక

దర్శి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలోని ఎస్సీ కాలనీలో 9 కుటుంబాలకు చెందిన 50 మంది వైసీపీ కార్యకర్తలు గురువారం సాయంత్రం టీడీపీలో చేరారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరడం ఆనందదాయకమన్నారు. ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఇత్తడి కోటయ్య, విజయ్, ఎలీషా, సుధాకర్ నరేష్, మనోజ్, అబ్రహం, సుకన్య, వారి కుటుంబాలు టీడీపీలో చేరాయి.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, వైస్‌చైర్మన్ స్టీవెన్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పక పాటించాలి


మాట్లాడుతున్న డీఎస్పీ సాయి ఈశ్వర్‌యశ్వంత్

కనిగిరి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పండుగ వేడుకల్లో పోలీసు నిబంధనలు తప్పక పాటించాలని డీఎస్పీ సాయి ఈశ్వర్‌యశ్వంత్ అన్నారు. రాబోయే మొహర్రం, తొలి ఏకాదశి పండుగ సందర్భంగా పోలీసులు ఆంక్షలపై ఇరువర్గాలతో గురువారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో జరిగిన శాంతి సమావేశంలో ఆయన మాట్లాడారు. పండుగలను ప్రశాంత వాతావరణం మధ్య జరుపుకోవాలని సూచించారు. పండుగ సందర్భంగా నిర్వహించే ఊరేగింపులో ఎలాంటి వ్యతిరేక చర్యలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అనంతరం సీఐ ఖాజావలి, ఎస్ శ్రీరాం కనిగిరి పీఎస్, సర్కిల్ పరిధిలోని పోలీసు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, వీవీఆర్ మనోహరరావు (చిరంజీవి), ఫిరోజ్, కొలిపర్తి మారుతీ, చెన్నా సుబ్రమణ్యం, దేవకి శ్రీనివాసులు, రోషన్ సంధాని, గుడిపాటి ఖాదర్, తంగుటూరి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

బడిబయట పిల్లలను గుర్తించాలి

పీసీపల్లి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించాలని ఎంపీడీవో హనుమంతరావు అన్నారు. బంగారు బాల్యం సర్వేలో భాగంగా గురువారం పీసీపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ బంగారుబాల్యం మిషన్ సర్వే అనేది పిల్లల సంక్షేమానికి సంబంధించిన ముఖ్యమైన కార్యక్రమమని చెప్పారు. ఈ సర్వేలో గుర్తించిన సమస్యలకు తగిన పరిష్కారం కనుగొని మెరుగైన భవిష్యత్తును అందించాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. బడి మానేసి పనులకు వెళ్తున్న బాలకార్మికులను గుర్తించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. పాఠశాలలో చేర్పించిన పిల్లలతో మాట్లాడి వారి ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలను గుర్తించి వారికి అవసరమైన వైద్య సేవలను అందించాలన్నారు. బడిలో చేరిన పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

కురిచేడు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కురిచేడు దర్గా కూడలిలో ఓ ఇంటిలో అక్రమంగా దాచి ఉంచిన 32 టిక్కీల రేషన్ బియ్యాన్ని గురువారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డీటీ రాధాక్రిష్ణ గృహంలో దాచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని 6ఎ కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో వీఆర్వో నాగరాజు పాల్గొన్నారు.

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు అందజేయాలి

ముండ్లమూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : కౌలు రైతులందరికీ సీసీఆర్‌సీ కార్డులు అందజేయాలని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారి, వీఆర్వోలు, వీఏఏలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ సీజన్ మొదలైనందున వెంటనే కార్డులు మంజూరు చేయాలన్నారు. గతంలో మంజూరుచేసిన సీసీఆర్‌సీ కార్డులు తిరిగి తనిఖీ చేసి అర్హులైన వారందరికీ అందజేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ మూర్తి, మండల వ్యవసాయ అధికారి ఏ.హనుమంతరావు, విస్తీర్ణాధికారి శ్రీకీర్తి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పంచాయతీ అధికారి ఆకస్మిక తనిఖీ


చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో

కురిచేడు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కురిచేడు పంచాయతీ కేంద్రాన్ని, చెత్త నుంచి సంపద కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయడు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాకాలం వస్తున్నందున క్లోరినేషన్ పనులు, మురుగు కాలువల్లో పూడికతీత వెంటనే చేపట్టాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో రాజు, పంచాయతీ కార్యదర్శి చాంద్‌బీలు ఉన్నారు.

ఏఈగా రామకృష్ణారెడ్డి బాధ్యతల స్వీకరణ

తాళ్లూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): తాళ్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈగా ఎం.రామకృష్ణారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గత కొంత కాలంగా ఏఈ లేకపోవటంతో చీమకుర్తి ఏఈ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. పొదిలి ఏఈ ఎం.రామకృష్ణారెడ్డిని తాళ్లూరుకు బదిలీ చేయగా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించి మెరుగైన సేవలు అందిస్తామన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దు!

ముండ్లమూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఏఎస్ఐ హనుమంతరావు అన్నారు. గురువారం పోలీసులు, ఉద్యోగులు, గ్రామస్థులు బస్టాండ్ సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకొనే వయస్సులో చాలామంది విద్యార్థులకు అలవాటుపడి కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నారన్నారు. వారి తల్లిదండ్రులు ఎంతో మనోవేదనకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేదరమెట్ల వెంకటరావు, స్టేషన్ సిబ్బంది మహేష్, సూరిబాబు, రసూల్, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరెడ్డి, దేవతి వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పామూరు: యువత డ్రగ్స్ బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఏఎస్ఐ షేక్ జిలానిబాషా అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం కార్యక్రమంలో భాగంగా పామూరు పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో స్థానిక హైస్కూల్ విద్యార్థులతో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోటిరెడ్డి, ఉపాధ్యాయుడు బసవయ్య, హోంగార్డు రమణయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

30న మండల సర్వసభ్య సమావేశం

సీఎస్‌పురం(పామూరు), జూన్ 26(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 30న ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరుగుతుందని ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి పాల్గొంటారని తెలిపారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లతో పాటు మండలస్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

దర్శి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మలేరియా మాసోత్సవాల్లో భాగంగా గురువారం దర్శి పట్టణంలో వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా చందలూరు వైద్యాధికారి డాక్టర్ నాయక్, మలేరియా అధికారి బసవారెడ్డి మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగు నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు పెరిగి ప్రజలు మలేరియా వ్యాధిన పడుతున్నారన్నారు. మలేరియా రహిత సమాజం ఏర్పాటుకు అందరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

బాపట్ల జిల్లా వార్తలు

శుక్రవారం 27 జూన్ 2025



ఉష్ణోగ్రత (అంచనా) 27-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	36	26
తెనాలి	36	27
నరసరావుపేట	36	26
బాపట్ల	36	27
రెంటచింతల	35	27
చీరాల	36	28



మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న సీఎం చంద్రబాబు



సభలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు

ప్రజా చైతన్యంతోనే..
డ్రగ్స్ కట్టడి

- శాటిలైట్, డ్రోన్ల నిఘాతో గంజాయి నియంత్రణ
- ముఠా కక్షలను అణచివేసినట్లుగా మాదకద్రవ్యాలపై దృష్టి
- మాదక ద్రవ్యాల దుర్వినియోగం... అక్రమ రవాణా దినోత్సవ సభలో సీఎం చంద్రబాబు
- ప్రజాప్రతినిధులు, విద్యార్థులతో కలసి గుంటూరులో వాక్‌థాన్

గుంటూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా చైతన్యంతోనే డ్రగ్స్, గంజాయి కట్టడి చేయగలమని ముఖ్యమంత్రి చంద్ర బాబు తెలిపారు. అంతర్జాతీయ మాదకద్ర వ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరులోని శ్రీ కన్వెన్షన్‌లో గురువారం జరిగిన అవగాహన సభలో సీఎం ప్రసంగించారు. గతంలో ఉమ్మడి, ఆ తర్వాత విభజన ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నానని, అయితే



మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా జరిగిన ర్యాలీలో పాల్గొన్న ప్రజానీకం

ఈసారి యువతను నిర్వీర్యం చేస్తున్న డ్రగ్స్, గంజాయి అత్యంత ప్రమాదకరంగా తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గంజాయి, డ్రగ్స్‌పై ప్రత్యేక దృష్టి సారించి ఈగల్ విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. గూగుల్, శాటిలైట్, డ్రోన్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి గంజాయి సాగును పూర్తిగా తుడిచి వేశామన్నారు. గతంలో రౌడీయిజం, ముఠా కక్షలు, మత విద్వేషాలను పూర్తిగా అరికట్టామన్నారు. గత వైసీపీ పాలకులు గంజాయి సాగులో దేశంలోనే ఏపీని నెంబర్ వన్ స్థానంలో నిలపగా తాము అధికారంలోకి వచ్చిన వెంటనే గంజాయి, డ్రగ్స్ నివారణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో అత్యంత ప్రమాదకరమైన డ్రగ్స్, గంజాయి కట్టడి చేయాలంటూ తాము పోరాడితే జగన్ ఒక్కరోజు కూడా స్పందించలేదన్నారు. డ్రగ్స్, గంజాయి పండించే వ్యక్తులు, అక్రమ రవాణా చేసేవారు, వాటికి బానిసలైన అందరి పైనా యుద్ధం ప్రకటిస్తున్నానన్నారు. అటువంటి వారు ఇకనైనా మారాలని, లేదంటే రాష్ట్రం వదిలి వెళ్ళాలన్నారు.



ఎన్‌సీసీ క్యాడెట్లు విద్యార్థులతో ర్యాలీలో పాల్గొన్న సీఎం చంద్రబాబు



జ్యోతి వెలిగించి సభను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, హోం మంత్రి అనిత, చిత్రంలో సీఎం చంద్రబాబు, మంత్రి సంధ్యారాణి

గిరిజనులకు సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు

- డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ ఆదేశాలు

బాపట్ల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెల్త్‌మిషన్ ఆదేశాల మేరకు 40 ఏళ్లలోపు ఉన్న గిరిజనులందరికీ సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ తెలిపారు. సీహెచ్‌వోలు, ఏఎన్‌ఎంలు, వైద్యాధికారులతో గురువారం జరిగిన



సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు గురించి వివరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ

సమావేశంలో పరీక్షలకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఇప్పటి వరకు 18,822 మంది గిరిజనులకు పరీక్షలు నిర్వహించగా ఎవరికి నిర్ధారణ కాలేదన్నారు. పట్టణంలోని ఎస్టీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి వారికి వ్యాధిపై అవగాహన కల్పించారు. వారసత్వంగా వచ్చే రుగ్మతలలో ఈ వ్యాధి ఒకటి అని తెలిపారు. ఈ వ్యాధి వల్ల రక్తకణాలు తగ్గడం, శరీరం, కళ్లు పసుపురంగులోకి మారడం, తీవ్రమైన నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఉంటాయన్నారు. పరీక్షలు చేయించుకుని తగిన ఉపశమనం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ మనోజ్, ప్రద్యోత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిషా ముక్త్ భారత్‌లో ఎంపీ తెన్నేటి

బాపట్లలో భారీ ర్యాలీ.. విద్యార్థుల మానవహారం



బాపట్ల అంబేడ్కర్ సర్కిల్‌లో మానవహారం

మత్తు వదిలితే ఉజ్వల భవిత

బాపట్ల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించినప్పుడే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంపీ, లోక్‌సభ ప్యానల్ స్పీకర్, హోమ్ వ్యవహారాల స్టాండింగ్ కమిటీ సభ్యుడు తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం బాపట్లలో నిషాముక్త్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై పోలీసులు, వివిధశాఖల అధికారులు బాపట్లలో చేపట్టిన భారీ ర్యాలీని ఎంపీ కృష్ణప్రసాద్, కలెక్టర్ జె.వెంకటమురళి ప్రారంభించారు. అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారం నిర్వహించి మాదకద్రవ్యాల వినియోగాన్ని నిరోధించడం, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కట్టుబడి ఉండాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గంజాయి ఉత్పత్తి, వాడకం, విక్రయం, రవాణా నేరమన్నారు. సంఘవిద్రోహ శక్తులు అక్రమార్జన కోసం పిల్లలకు బలవంతంగా అలవాటు చేస్తున్నారని ఇలాంటి దుశ్చర్యలను ప్రజలంతా ముక్తకంఠంతో ఖండించాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను ఛిద్రం చేసుకోవద్దని కలెక్టర్ జె.వెంకటమురళి విద్యార్థులు, యువతకు సూచించారు. మాదకద్రవ్యాల తయారీ, వినియోగం, రవాణాపై 1972 టోల్‌ఫ్రీ నెంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. చెడును విడిచి పెట్టటం, మంచి విషయాలపై పిల్లలకు మార్గనిర్దేశం చేయాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుతం 80 శాతం మేర గంజాయి కేసులు తగ్గాయని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, బావుడా ఛైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, ఆర్డీవో పి.గ్లోరియా, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, డీఈవో ఎస్.పురుషోత్తం, తహసీల్దార్ షేక్.సలీమా తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడీ తదితరులు

- ఊపందుకోనున్న భవన నిర్మాణాలు
- క్రిమినల్ కేసుల నుంచి ఎల్‌టీపీలకు మినహాయింపు
- సెట్ బ్యాక్ స్థలం తగ్గింపు.. నిర్మాణదారులకు ఊరట
- భవనాల ప్లాన్‌లు దాఖలు చేస్తున్న లైసెన్సుడ్ ఇంజనీర్లు



నిబంధనలు సడలింపు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పట్టణ భవన నిర్మాణాల్లో కొత్త నిబంధనలను ప్రభుత్వం సడలించింది. ట్రాఫిక్, డ్రెయినేజీ సమస్యలు తీర్చే దిశగా ప్రభుత్వం నిర్మాణాలకు కొత్త నిబంధనలు విధించిన విషయం తెలిసిందే. ఇవి నిర్మాణ రంగానికి గుదిబండగా మారడంతో ప్రభుత్వంపై వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో నిబంధనలను సమీక్షించి కొన్నింటిని సవరిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. ప్రధానంగా భవన నిర్మాణంలో వదలాల్సిన స్థలానికి (సెట్ బ్యాక్) మినహాయింపు ఇచ్చింది. భవన నిర్మాణంలో నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ టౌన్ ప్లానర్స్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేసే విధానాన్ని విరమించుకుంది. కొత్త నిబంధనలతో భవన నిర్మాణాలకు ప్లాన్ దరఖాస్తులు కొన్ని నెలలుగా నిలిచిపోయాయి. నిబంధనలు సడలింపు చేయడంతో ప్లాన్‌ల కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు. దీంతో తిరిగి భవన నిర్మాణాలు ఊపందుకునే పరిస్థితులు నెలకొనున్నాయి.

నిలిచిన నిర్మాణాలు

కొత్త నిర్మాణాలకు ప్లాన్ ఆన్‌లైన్‌లో దాఖలు చేసేందుకు లైసెన్స్ టౌన్ ప్లానర్స్ (ఎల్‌టీపీ)కు పూర్తి అధికారాలను ప్రభుత్వం ఇచ్చింది. ప్లాన్‌ను అతిక్రమించి భవనం నిర్మిస్తే అందుకు ఎల్‌టీపీలను బాధ్యులను చేసింది. దీంతో యజమానులు ప్లాన్‌లు మంజూరు కాక కొత్త ఇళ్ల నిర్మాణాలు

(మిగతా 6లో)

ఆడుదాం ఆంధ్రా..
అవినీతిమయం

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో కోట్లలో అక్రమాలు
- ఇప్పటికే 28 మండలాల్లో విజిలెన్స్ విచారణ పూర్తి
- 10 రోజుల్లో విచారణ కొలిక్కి.. ప్రభుత్వానికి నివేదిక?
- భోజనాల్లో రూ.50 లక్షలు హాంఫట్.. క్రికెట్ కిట్లు మాయం



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

గుంటూరు సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆడుదాం.. ఆంధ్రా అంటూ రూ.కోట్లు కొట్టేశారు. ఆటలకు ప్రాధాన్యం అంటూ ప్రభుత్వ సొమ్ములను బొక్కేశారు. ఆడుదాం ఆంధ్రాపై అప్పట్లోనే అనేక ఆరోపణలు రాగా కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. దీంతో ఆడుదాం ఆంధ్రాలో చోటుచేసుకున్న అవినీతి వ్యవహారాలు వెలుగుచూస్తున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా వేదికగా రూ.కోట్లలో అక్రమాలు జరిగినట్లు తేలింది. స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జరిగిన ఆడుదాం ఆంధ్రాలో నేతలు, అధికారులు అందిన కాడికి దండుకున్నారన్న ఆరోపణలు విజిలెన్స్ విచారణలో వెలుగుచూస్తున్నాయి. కాగా ఇప్పటికే 28 మండలాల్లో



అప్పట్లో పంపిణీ చేసిన నాసిరకం క్రికెట్ బ్యాట్‌లను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

(మిగతా 6లో)

మరమ్మతులు.. పగుళ్లు

రోడ్లపైకి మురుగు.. దుర్వాసన

చీరాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు పట్టణంలో డ్రెయినేజ్ పైపులకు అధికారులు మరమ్మతులు చేస్తుండగా.. మరోవైపు అవి ఎక్కడికక్కడ పగిలి పోతున్నాయి. వర్షాలతో అంతర్భాగంలో దెబ్బతిన్న పైపులు వాటి స్థితిని కోల్పోయాయి. దీంతో అధికారులు వాటిని గాడి లోకి తెచ్చేందుకు మల్లగు ల్లాలు పడుతు న్నారు. ఈ నెల రెండో వారంలో కురిసిన వర్షాల సమయంలో డ్రెయినేజీలు నుంచి, మురుగునీరు వెనక్కు చేరి లూథరన్ చర్చి, మసీదు పరిసరాల్లో, పలు వీధుల్లో నిలుస్తోంది. దీంతో రహదారులు దుర్వాసనతో నిండి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 10, 11 తేదీల్లో ఏరియా వైద్యశాల రోడ్డులో పగిలిన ప్రధాన డ్రెయినేజ్ పైపులను గుర్తించి అధికారులు మళ్లీ మరమ్మతులు చేపట్టారు.

రూ.3 కోట్లతో అంచనాలు

పట్టణ పరిధిలో 40 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన పైపులు మెత్తబడడంతో గత వైసీపీ హయాంలో 120 మీటర్లు ఆధునికీకరించారు. ఆ సమయంలో పనులు నత్తనడకనసాగాయి. ఎన్నికలు సమీపించడంతో అత్యవసరమైన 120 మీటర్లకే పనులు చేసి చేతులు దులుపుకున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం మిగిలిన 480 మీటర్ల పైపుల ఆధునికీకరణకు రూ.3 కోట్ల నిధులు అవసరం అని అధికారులు అంచనాలు వేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అధ్వానంగా మారిన 234 మీటర్లకి సంబంధించి రూ.95 ల క్షలకు అంచనాలు సిద్ధం చేశారు. తక్షణ పరిష్కారం కోసం సాధారణ నిధులు రూ.15 లక్షలతో 60 మీటర్లలో పగిలిన పైపులను మార్చే పనులు చేపట్టారు. ఈ క్రమంలో పై పులు విరిగి డ్రెయిన్‌లో ఎక్స్‌కవేటర్ ఇరుక్కుంది.



పట్టణంలో జరుగుతున్న ప్రధాన డ్రెయినేజి పనులు

తీరనున్న మంచినీటి కష్టాలు

- వేగంగా జలజీవన్ మిషన్ పనులు
- నియోజకవర్గానికి రూ.57.47 కోట్లు మంజూరు



చినకొత్తపల్లి లో వేస్తున్న మంచినీటి పైప్‌లైన్లు

అద్దంకి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జలజీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామాలలో మంచినీటి కష్టాలు తీరనున్నాయి. ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు మంచినీటి పైప్‌లైన్ల నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. అద్దంకి నియోజకవర్గంలో మొత్తం రూ.57.47 కోట్లు జలజీవన్ మిషన్ నిధులతో పనులు జరుగుతున్నాయి. మండలాల వారిగా పరిశీలిస్తే అద్దంకి మండలంలో 40 పనులకు సంబంధించి రూ.18.70 కోట్ల రూపాయలు, బల్లికురవ మండలంలో 21 రూ. 8.57 కోట్లు, పంగులూరు మండలంలో 8 పనులకు సంబంధించి రూ.4.51 కోట్లు, కొరిశపాడు మండలంలో 15 పనులకు రూ.11.16 కోట్లు, సంతమాగులూరు మండలంలో 26 పనులకు రూ.14.52 కోట్లు నిధులు మంజూరు కాగా ఇప్పటికే అత్యధికశాతం గ్రామాలలో పనులు ప్రారంభమయ్యాయి. గ్రామంలో ఉన్న వాటర్‌ట్యాంక్ వినియోగంలోకి తీసుకు రావడం, అందుబాటులోకి నీటి వనరులు ఏర్పాటు చేయడంతో పాటు గ్రామంలోని అన్ని ఇళ్లను కలుపుతూ మంచినీటి పైప్‌లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో నీటి కోసం దూరం వెళ్లే పనిలేకుండా ఇంటి వద్దనే కుళాయి ఏర్పాటు చేస్తారు. దీంతో గ్రామాలలో నీటికోసం దూరం వెళ్ళాల్సిన శ్రమ పూర్తిగా తగ్గిపోనుంది. మరో రెండు, మూడు నెలలలో అన్ని గ్రామాలలో ఇంటింటికి కుళాయి కనెక్షర్ ఇచ్చే విధంగా పనులు వేగంగా జరుగుతున్నాయి.

ముక్తి భవనాసికి విముక్తి కలిగేనా.!

గత టీడీపీ హయాంలో రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు

ఆ తర్వాత వైసీపీ రావడంతో పట్టించుకోని పాలకులు

పాతసింగరాయకొండ దేవస్థానంలో కోనేరు దుస్థితి ఇది

వాడుకలోకి తీసుకురావాలని కోరుతున్న భక్తులు



అభివృద్ధి చేయాల్సిన స్వామి పుష్కరిణి భవనాసి

సింగరాయకొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో ఉన్న ముక్తి భవనాసి(కోనేరు)కు విముక్తి కలిగించాలని భక్తులు కోరుతున్నారు. ఎంతో ప్రాశస్త్యం కలిగిన కోనేరు వినియోగంలో లేకపోవడంతో వారిని కలిచివేస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తుదిదశకు వరకు చేపట్టిన అభివృద్ధిని ఆ తర్వాత వచ్చిన వైసీపీ పాలకులు కొనసాగించకపోవడంతో చేసినదంతా బూడిదలోపోసిన పన్నీరు అయ్యింది. దీంతో క్రమంగా కోనేరు రూపురేఖలు కోల్పోయింది. ప్రస్తుత కోనేటి దుస్థితిని చూసి భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఘనమైన చరిత్ర

దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన శ్రీవరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఉన్న రెండు కోనేర్లకు ఎంతో ప్రాశస్త్యం ఉంది. ఒకటి పశ్చిమ వాయువ్య దిశలో ఉన్న భవనాసికాగా, మరొకటి తూర్పు ఆగ్నేయ దిశలో ఉన్న ముక్తి భవనాసి. ఇందులో ముక్తి భవనాసికి ఘనమైన చరిత్ర ఉంది. ఇంద్రుడు ఆకాశమార్గంలో పయనించే సమయంలో యోగానంద లక్ష్మీనరసింహస్వామి తీక్షణమైన రూపాన్ని చూసి తన చేతిలో ఉన్న వజ్రాయుధాన్ని నేల జారవిడుస్తాడు. వజ్రాయుధం కిందపడిన చోట ఘాతం ఏర్పడుతుంది. అదే ముక్తి భవనాసిగా ప్రసిద్ధికెక్కింది.

గతంలో అప్పటి ఎమ్మెల్యే స్వామి చొరవతో..

దేవస్థానంలో రెండు కోనేర్లలో భవనాసి వాడుకలో ఉండగా దాదాపు 60 ఏళ్ల నుంచి ముక్తి భవనాసిని పట్టించుకోకపోవడంతో అది మట్టితో పూడుకుపోయింది. చిల్లచెట్లు పెరిగిపోయి కాలుపెట్టలేని విధంగా తయారైంది. 2014-19 టీడీపీ ప్రభుత్వం హయాంలో ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆ కోనేరు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. రూ. 20 లక్షల నిధులు కేటాయించి అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. చిల్లచెట్లను, పిచ్చిమొక్కలను తొలగించారు. పూడుకుపోయినన కోనేరును తవ్వ మట్టిని కట్టగా పోసి దీర్ఘచతురస్రాకారంలో తీర్చిదిద్దారు. కట్టచుట్టూ గ్రానైట్ రాళ్లతో రివిట్‌మెంట్ చేశారు. కోనేరు మధ్య తాండవ కృష్ణుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు కూర్చోవడానికి వీలుగా గ్రానైట్‌తో పెద్ద అరుగును నిర్మించారు. భక్తుల రాకపోకలకు వీలుగా రెండు ముఖద్వారాలను ఏర్పాటుచేశారు. ముక్తి భవనాసిలో కొంతభాగం స్వామికి నిత్యం పుష్పాలు తులసీదళాలు పంపించేందుకు కేటాయించారు. కట్టచుట్టూ సెంట్రల్ లైటింగ్‌కు కూడా ప్రతిపాదనలు చేశారు. అంతలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సెంట్రల్ లైటింగ్, పూలు, తులసీమొక్కల పెంపకాన్ని పట్టించుకున్న దిక్కులేదు.

వాడుకలోకి తీసుకురావాలని కోరుకుంటున్న భక్తులు

వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో అధ్వానస్థితికి చేరుకున్న ముక్తి భవనాసిని ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో వాడుకలోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు. మిగిలిన సెంట్రల్ లైటింగ్, మొక్కల పెంపకం, కోనేరు మరమ్మతులను పూర్తి చేసి కోనేరుకు ప్రారంభించి విముక్తి కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అంతేగాక స్వామివారికి తెప్పోత్సవం నిర్వహించే ప్రధాన పుష్కరిణి అయిన భవనాసిని కూడా అభివృద్ధి చేయాలని భక్తులు కోరుకుంటున్నారు.

బాలికను గర్భవతిని చేసిన క్లాస్‌మేట్

ఒంగోలు క్రైం, జూన్26 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికను క్లాస్‌మేట్ గర్భవతిని చేశాడు. ఈమేరకు గురువారం రిమ్స్‌వైద్యశాలలో డాక్టర్లు నిర్ధారించారు. ప్రస్తుతం బాపట్ల బధిరుల ఆశ్రమ కాలేజీలో జూనియర్ ఇంటర్ చదువుతున్న మూగ బాలికకు కాళ్లకు నీరు రావడంతో అక్కడ ఉపాధ్యాయులు గుర్తించి ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు చేయగా బాలిక 8 నెలల గర్భవతిగా నిర్ధారించారు. బాలిక ఒంగోలులోని బధిరుల పాఠశాలలో 10 వతరగతి వరకు చదువుకుంది. ఆసమయంలో కావలి చెన్నాయిపాలెంనకు చెందిన మూగ విద్యార్థి ఆదే పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. అక్కడ వారి మధ్య పరిచయం ఏర్పడిందని బాలిక చెబుతున్నట్లు పోలీసులు తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం మైనర్ బాలికను సఖీ సెంటర్‌కు చేర్చారు. పోలీసులు విచారణ చేపట్టారు.

ఎంఈవో-2 సుధాకరరావుకు సన్మానం



సుధాకరరావును సన్మానిస్తున్న సీఆర్‌పీలు, సిబ్బంది

అద్దంకిటౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అద్దంకి మండల ఎంఈవో -2 పనిచేస్తున్న బూదాటి సుధాకరరావు ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాల యంలో సుధాకరరావును సీఆర్‌పీలు కార్యాలయం సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు రమేష్, శంకరరావు, రామకృష్ణ, గురవయ్య, పుణ్యవతి, ఎంఆర్‌సీ కార్యాలయ సిబ్బంది స్వాములు, సుబ్బయ్య, కృపారావు, ఏఈఆర్‌టీలు శ్రీనివాస్, యోనా తదితరులు పాల్గొన్నారు.

సబ్ ఇంజనీర్‌గా శ్రీనివాసరావు బాధ్యతలు

అద్దంకి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణ విద్యుత్ కార్యాలయం సబ్‌ఇంజనీర్‌గా నాతాని శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ నుంచి బదిలీపై వచ్చిన శ్రీనివాసరావు డీఈఈ దామోదరంను కలిసి విధులలో చేరారు.



డీఈకి జాయినింగ్ రిపోర్ట్ ఇస్తున్న శ్రీనివాసరావు

గ్రిల్స్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్

అద్దంకి,జూన్26(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో శ్రీనగర్ వద్ద నామ్ రోడ్డు వెంబడి ఉన్న గ్రిల్స్‌ను ఆర్టీసీ బస్ ఢీ కొని సర్వీస్ రోడ్డులో నిలిచింది. స్థానికుల కథనం మేరకు నెల్లూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న డీలక్స్ బస్ బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత 2 గంటల సమయంలో అద్దంకి పట్టణంలోని శ్రీనగర్ వద్ద గ్రిల్స్‌ను ఢీ కొట్టుకుంటూ సర్వీస్ రోడ్డులో నుంచి ముందుకు పోయి సమీపంలోని పాఠశాల ప్రహరీ గోడ వద్ద నిలిచిపోయింది. అర్ధరాత్రి సమయం కావడం జనసంచారం లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రమాదం జరగడంతో బస్ లో ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపాటుకు గురయ్యారు. డ్రైవర్ కరిముల్లాకు స్వల్ప గాయాలు అయ్యాయి.

ఆడుదాం ఆంధ్రా.. అవినీతిమయం

(5వ పేజీ తరువాయి)

విచారణ జరిపిన విజిలెన్స్ అధికారులు అవినీతికి సంబంధించిన ఆధారాలు సేకరిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లి అప్పట్లో ప్రభుత్వం ద్వారా పంపిణీ అయిన క్రికెట్ కిట్లు ఉన్నాయా లేదా.. కార్యక్రమ నిర్వహణకు ప్రభుత్వం కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించారా లేదా అని అధికారులు పరిశీలిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అటవీశాఖాధికారి సైదులు ఆధ్వర్యంలో విచారణ జరుగుతున్నట్లు తెలుస్తుంది. రెండు నెలలుగా జరుగుతున్న విచారణ మరో 10 రోజుల్లో పూర్తి చేసి నివేదికను ప్రభుత్వానికి అందజేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని తెలుస్తుంది.

క్రికెట్ ఆడకుండానే..

గుంటూరు జిల్లాలో 568 సచివాలయాల పరిధిలో 1,29,504 మందికి, 64,752 టీమ్‌లు, పల్నాడు జిల్లాలో 538 సచివాలయాలకు 1,22,664 మందికి 61,332 టీమ్‌లు, బాపట్ల జిల్లాలో 477 సచివాలయాలకు 1,08,756 మందికి 54,378 టీమ్‌లు క్రికెట్ ఆటలో పాలుపంచుకున్నట్లు రికార్డుల్లో చూపారు. ఆ జాబితాల్లోని పలువుర్ని అధికారులు పిలిచి విచారించగా అసలు తమకు ఆడుదాం ఆంధ్రా.. క్రికెట్ ఆట గురించే తెలియదని చెప్పినట్లు తెలుస్తోంది. తాము ఆడకుండానే పేర్లు రాసుకున్నారని చాలామంది చెప్పినట్లు సమాచారం. ఈ మేరకు వారి వాంగ్మూలాలను అధికారులు రికార్డు చేశారు. ఇక రూ.20 వేలు వెచ్చించి క్రికెట్ కిట్లను కొనుగోలు చేశారు. అయితే ఆటల అనంతరం క్రికెట్ కిట్లను మండల విద్యాశాఖాధికారికి అప్పగించాలని ప్రభుత్వం సూచించింది. అయితే ఎక్కువ సచివాలయాల్లో వైసీపీ నాయకులు, వారి అనుచరులకు కిట్లను పందారం చేసినట్లు తెలుస్తుంది. ఈ కార్యక్రమం సందర్భంగా భోజన ఏర్పాట్లకు ఒక్కో వార్డు సచివాలయానికి రూ.లక్ష, గ్రామ సచివాలయానికి రూ.10 వేలు, మండల స్థాయిలో ఎంపీడీవోకు రూ.50 వేల వరకు కేటాయించారు. అయితే ఆ బిల్లులను పరిశీలించిన అధికారులు భోజనాలు పెట్టకపోయినా పెట్టినట్లు చూపించి రూ.50 లక్షలు స్వాహా చేశారని అధికారులు గుర్తించారని సమాచారం. జగన్ బొమ్మతో ఉన్న వేల టీ షర్టులు సచివాలయాల్లో దుమ్ముతో నిండిపోగా వాటి విలువను అధికారులు లెక్కిస్తున్నారు.

ట్రాఫిక్ చక్రబంధంలో పర్చూరు

అవస్థలు పడుతున్న వాహన దారులు ప్రయాణికులు



ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్

పర్చూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రమైన పర్చూరులో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు జఠిలంగా మారుతోంది. వాహనాల రద్దీ పెరగడంతో పాటు, ఉదయం - సాయంత్రం సమయాల్లో గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. పర్చూరులో బాధ్యతలు స్వీకరించే పోలీసు అధికారులు, స్టేషన్‌కు వచ్చిన ఉన్నత అధికారులు విలేకర్ల సమావేశంలో 'ట్రాఫిక్ సమస్య ఉంది అని గుర్తించాం. సమస్యను పరిష్కరిస్తాం' అని చెప్పడం సర్వసాదారణం. పర్చూరు స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టే అధికారులు సమస్యను పరిష్కరిస్తాం అని చెప్పడం మినహా చర్యలు మచ్చుకు కూడా కానరాని దుస్థితి. గతంలో ఎస్సై, సీఐ స్థాయి అధికారులు బొమ్మల కూడలిలో నిలబడి ట్రాఫిక్‌ను నియంత్రించిన ఘటనలు అనేకం ఉన్నాయి. కొన్నేళ్లుగా ట్రాఫిక్ సమస్య పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. సిబ్బంది కొరత సాకుతో సమస్యను ప్రయాణికుల కష్టానికి వదిలేస్తున్నాని వారు వాపోతున్నారు. వాహనాలు స్తంభించిన సమయాల్లో పోలీసుకు సమాచారం ఇచ్చినా స్పందించిన దాఖలాలు లేవని ప్రజలు అంటున్నారు. ఉదయం సాయంత్రం సమయాల్లో 2 గంటల చొప్పున కనీసం ఇద్దరు పోలీసు సిబ్బందిని ఏర్పాట్లు చేస్తే ఇలాంటి దుస్థితి ఉండదని ప్రజలు అంటున్నారు. ఆదిశగా పోలీసు అధికారులు పర్చూరులో ట్రాఫిక్ సమస్యపై స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంకొల్లులో తక్షణమే పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలి



మాట్లాడుతున్న రైతుసంఘం నేత కృష్ణయ్య

ఇంకొల్లు,జూన్ 26,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు మార్కెట్ యార్డులో తక్షణమే పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి పొగాకు కొనుగోలు చేయాలని రాష్ట్ర రైతుసంఘం అధ్యక్షులు వలేటి కృష్ణయ్య డిమాండు చేశారు. ఇంకొల్లులో గురువారం రైతుసంఘం ఆధ్వర్యంలో పొగాకు రైతులతో సమావేశం నిర్వహించారు.నాలుగు నెలలుగా పొగాకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాలయాపన చేయకుండా ఇంకొల్లులో వెంటనే పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలన్నారు. పర్చూరు మార్కెట్ యార్డులో కేవలం రోజుకు 150 నుండి 200 బేళ్లు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, కనీసం ప్రతి 1000 బేళ్లు కొనుగోలు చేయాలన్నారు. ఇప్పటికే పొగాకు రంగుమారి రైతులు ఇబ్బంది పడతారన్నారు. మూడు గ్రేడుల ప్రకారం క్వింటా రూ.12వేలు, రూ.9వేలు, రూ.6 వేలకు కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతుసంఘం నాయకులు తల్లపనేని రామారావు, కందిమళ్ల రావు,కోటేశ్వరరావు, సీహెచ్.గంగయ్య, సీటీయూ నాయకులు నాగండ్ల వెంకట్రావు, ఆన్నం ఆదెయ్యబంగారుబాబు, భానుప్రసాద్ పొగాకు రైతులు పాల్గొన్నారు.రోజుకు 1000 చెక్కులు కొనుగోలు మూడు గ్రేడుల ప్రకారం పొగాకు కొనుగోలు చేయాలనే డిమాండ్లతో ఈ నెల 30 తేదిన ఇంకొల్లులో రైతులతో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు కృష్ణయ్య తెలిపారు.

రెండురోజుల్లో కొనుగోలు

ఇంకొల్లు : ఇంకొల్లులో రెండు రోజులలో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించను న్నట్లు పర్చూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుంజి వెంకట్రావు తెలిపారు. పర్చూరు ఎమ్మె ల్యే ఏలూరి సాంబశివరావు కృషితో పర్చూరు యార్డులో పొగాకు కొనుగోళ్లు జరుగుతున్నా యని కొంతమంది రైతులకు నగదు పడ్డాయ న్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మార్కెట్ యార్డు గిడ్డంగులు అధ్వానంగా తయారైయ్యాయన్నారు. ఇంకొల్లులో గత వారంగా గిడ్డంగుల మరమత్తులు చేపట్టి పొగాకు నిల్వ చేసేందుకు అధికారులను ఎమ్మెల్యే ఏలూరి ఆదేశించగా ఆ ప్రక్రియ శుక్రవారం నాటికి పూర్తవుతుందన్నారు. రైతులు ఆందోళన చెందనవసరం లేదని రెండురోజుల్లో పొగాకు కొనుగోలు చేసేందుకు అన్నీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ ఇంకొల్లులో గిడ్డంగులను పరిశీలించారన్నారు. గురువారం కరి శ్రీనివాసరావు, వలేరు మార్క్, చిలుకూరి శ్రీనివాసరావు, గుది సీతారామయ్య, వెంకట్రావు తదితరులు గురువారం యార్డులో ఏర్పాట్లను పరిశీలించారు.



గోడౌన్ పరిశీలిస్తున్న వెంకట్రావు

అగ్నిమాపక కేంద్రం నిర్మాణం వేగవంతం చేయాలి

అగ్నిమాపకశాఖ అధికారి వినయ్‌కుమార్



పనులను పరిశీలిస్తున్న వినయ్‌కుమార్

అద్దంకి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక కేంద్రం నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి వినయ్‌కుమార్ అన్నారు. అద్దంకి పట్టణం లోని శింగరకొండ రోడ్డులో రూ.2.25 కోట్లతో నిర్మిస్తు న్న అగ్నిమాపక కేంద్రం పనులను గురువారం సాయంత్రం ఆయన పరిశీలించారు. అనంతరం మార్కెట్ యార్డు ఆవరణలో తాత్కాలికంగా నిర్వహిస్తున్న అగ్నిమాపక కేంద్రాన్ని పరిశీలించారు. అగ్నిమాపక యంత్రం ట్రయల్ రన్‌ను పరిశీలించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. అద్దంకి అగ్నిమాపక కేంద్ర ం అధికారి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు సడలింపు

(5వ పేజీ తరువాయి)

నిలిపివేసుకుంటున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాలిటీల్లో దాదాపు మూడున్నర నెలలుగా ప్లాన్‌లు మంజూరు కాక నిర్మాణాలు నిలిచిపోయాయి.

క్రిమినల్ కేసు నిబంధన ఉపసంహరణ

పట్టణాల్లో ఇళ్ల నిర్మాణానికి సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీమ్ ద్వారా ప్లాన్‌లను పురపాలక సంఘం మంజూరు చేస్తోంది. ఇది భవన నిర్మాణదారులకు ఎంతో మేలు చేస్తుందని ప్రభుత్వం భావించింది. దీంతో అనుమతుల కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన పని ఉండదని ప్రకటించింది. కానీ, నిర్మాణదారుడు మంజూరైన ప్లాన్ ఉల్లంఘించి భవనం నిర్మిస్తే.. లైసెన్స్ రద్దు చేసి, కేసులు నమోదు చేసే విధంగా చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ క్రిమినల్ కేసు నిబంధనను ప్రభుత్వం ఉపసంహరించుకుంది. మరో పెద్ద సమస్యగా ఉన్న సెట్ బ్యాక్ విషయంలో కూడా మార్పులు తీసుకొచ్చింది. కొత్త నిబంధన ప్రకారం భవన నిర్మాణానికి రోడ్డు వైపు మూడు మీటర్లు స్థలం వదలాలి. అయితే ఒక మీటరు స్థలం వదిలితే సరిపోతుందని సడలించిన నిబంధనల్లో పేర్కొంది. పట్టణాల్లో లైసెన్స్‌డు సర్వేయర్లు ఇళ్ల నిర్మాణాల ప్లాన్‌లకు దరఖాస్తు చేస్తున్నారు.

మీరితే.. ఎల్‌టీపీలపై వేటు..!

భవన నిర్మాణం కోసం ఆన్‌లైన్‌లో ప్లాన్ నమోదు చేసి, మున్సిపాలిటీకి ఫీజు చెల్లిస్తే అప్రూవల్ వచ్చేస్తుంది. దీంతో నిర్మాణదారుడు వెంటనే ప్లాన్ ప్రకారం పనులు ప్రారంభించవచ్చు. అయితే ఏ కొద్ది పాటి అతిక్రమణ జరిగినా ఎల్‌టీపీలపై వేటు పడుతుంది. ఆరు నెలల పాటు వారిని బ్లాక్ లిస్టులో పెడతారు. ఇటువంటివి పునరావృతమైతే వారి లైసెన్స్ రద్దు చేస్తారు. ఈ నిబంధనను మాత్రం ప్రభుత్వం సడలించలేదని ఎల్‌టీపీలు చెబుతున్నారు.

టౌన్ ప్లానింగ్ చేతిలో నుంచి..

కొత్త విధానం వల్ల పట్టణంలో ప్రతి భవనం నిర్మాణానికి నిబంధనలు పాటించాలి. ఉదాహరణకు 300 చదరపు మీటర్లలో భవన నిర్మాణం చేస్తే.. గతంలో కొంత సడలింపు ఉండేది. మార్టుగేజ్ ఉండడంతో చిన్న చిన్న తేడాలు ఉన్నా పెద్దగా పట్టించుకునేవారు కాదు. ఇప్పుడా పరిస్థితి లేదు. గతంలో టౌన్ ప్లానింగ్ అధికారులు ప్లాన్ ఇచ్చేవారు. కొత్త నిబంధనల ప్రకారం ఎల్‌టీపీ ప్లాన్‌లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే సదరు అధికారులతో పని లేకుండా ప్లాన్ మంజూరవుతుంది. అపార్ట్‌మెంట్ల విషయంలోనూ ఇదే పరిస్థితి. జీ ప్లస్-5కు గతంలో టౌన్ ప్లానింగ్ ఆర్డీ పరిశీలించి ఆమోదం తెలిపేవారు. ఏమైనా అభ్యంతరాలుంటే మార్పులు చేసి, ప్లాన్ ఇచ్చేవారు. ఇప్పుడది ఉండదు. మొత్తంమ్మీద కొత్త నిబంధనలు సడలించడంతో యజమానులు భవనాల నిర్మాణాలను ప్రారంభించేందుకు సమాయత్తమవుతున్నారు.

బీజేపీ బలోపేతానికి ప్రతిఒక్కరూ శ్రమించాలి



మాట్లాడుతున్న బీజేపీ నేతలు

వాడరేవు(చీరాల), జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : నియోజక వర్గంలో బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు శ్ర మించాలని జిల్లా పార్టీ అధ్య క్షులు కొండముది బంగారు బాబు, ఇన్‌చార్జ్ పులి వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురు వారం మండల పరిధిలోని వాడరేవు గ్రామంలోని ఆంజనేయుని విగ్రహం సమీపంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీకి సంబంధించిన కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ కన్వీనర్ బండారుపల్లి హేమంత్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మువ్వల వెంకటరమణ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు నోటిఫికేషన్

సంతమాగులూరు జూన్ 26 (ఆంధ్రజ్యోతి) సంతమాగులూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు నందు మూడు అంగన్‌వాడీ ఆయా పోస్టులకు నోటిఫికేషన్ ప్రకటించారు. సంతమాగులూరు ప్రాజెక్ట్ నందు బల్లికురవ మండలంలో కొండాయపాలెం (జనరల్), కొడిదిన తూర్పు బజారు (బీసీ), సంతమాగులూరు మండలంలోని అడవిపాలెం మెయిన్ (జనరల్), పోస్టులకు నోటిఫికేషన్‌ను గురువారం ప్రాజెక్టు అధికారి సుధా జారీ చేశారు.

యువత మత్తు పదార్థాలకు బానిసలు అవ్వద్దు

చినగంజాం, జూన్ 26(ఆంధ్రజ్యోతి) : యువత మత్తు పదార్థలకు దూరంగా ఉండాలని, వాటికి బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని ఇంకొల్లు సీ.ఐ వై.వీ.రమణయ్య అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా చినగంజాంలో ఇంకొల్లు సీ.ఐ ఆధ్వర్యంలో గురువారం పోలీసు సిబ్బంది, సత్యం హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని సీఐ అన్నారు. స్థానిక సత్యం హైస్కూల్ వద్ద నుండి సోపిరాల రైల్వే గేటు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారం చేశారు. మానవహారంలో సీ.ఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలు కావడం వలన కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని అన్నారు. వాటి వలనే నష్టాలను ప్రజలకు, విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎస్.ఐ శీలం రమేష్, పోలీసు సిబ్బంది, సత్యం హైస్కూల్ హెచ్.ఎం. ఆర్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మా భూములకు హద్దులు చూపించండి

- అటవీ అధికారులు బోర్లు వేయనీయడం లేదు
- జేసీకి నరజాముల తాండా గిరిజనుల ఫిర్యాదు



భూముల మ్యాపును పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

పుల్లలచెరువు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : గత కొన్ని సంవత్సరాలుగా నరజాముల తాండాలో ఫారెస్టు భూముల విషయాల్లో సమస్యలు ఏదుర్కొంటున్న గిరిజన తాండాలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, అధికారులు పర్యటించారు. గురువారం మండలంలో నరజాముల తాండాలో అధికారులతో కలిసి జేసీ రెవెన్యూ, ఫారెస్టు భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ ఏన్నో ఏళ్లుగా భూములు సాగు చేసుకుంటున్నా ఫారెస్టు అధికారులు ఆ భూముల్లో బోర్లు వేయనీయడం లేదని, విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేయనీయడం లేదని జేసీకి ఫిర్యాదు చేశారు. సాగులో ఉన్న భూములకు హద్దులు చూపించాలని కోరారు. అనంతరం జేసీ నివేశన స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టరు వెంకట త్రివినాగ్, డీపీవోసందీప్ కృపాకర్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

షట్టర్ పగులగొట్టి రూ.2లక్షల నగదు చోరీ

ఒంగోలు క్రైం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): దుకాణం షట్టర్ పగులగొట్టి అందులోని రూ.2లక్షలు నగదు అపహరించుకుని వెళ్లారు దుండగులు. ఈ సంఘటన ఒంగోలు నగరం కర్నూల్‌రోడ్‌లోని మహాలక్ష్మి ఎలక్ట్రికల్స్‌లో జరిగింది. గురువారం ఉదయం షాప్ యజమాని వచ్చి చూసే సరికి షట్టర్ తాళాలు ప గులగొట్టి ఉండంతో హడావిడిగా లోపల ఉన్న క్యాష్ బాక్సును యజమాని ప రిశీలించారు. దానిని పెకలించిన దొంగలు రూ.2లక్షలు నగదు అపహరించారని గుర్తించారు. దీంతో బాధితుడు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మే రకు ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. అదే సమయంలో సమీపంలో ని మరో దుకాణం షట్టర్ కూడా పగులగొట్టి రూ.2వేల నగదు అపహరించుకె ళ్లారు. తాలూకా పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు.

అవీ..ఇవీ..

సేవా దృక్పథం అభినందనీయం



నోటుబుక్స్‌ను అందజేస్తున్న ఎంఈవో, రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు, విద్యార్థులకు అవసరమైన సామగ్రి అందించే రోటరీక్లబ్, దాతల సేవా దృక్పదం అభినందనీయం అని ఎంఈవో బూదాటి సుధాకరరావు అన్నారు. గురువారం మండలంలోని తిమ్మాయపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి సౌజన్యంతో నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ, దాతల పాఠశాలకు చేస్తున్న సేవలను, అందిస్తున్న సహకారాలు విద్యార్థులు సద్వినియోగ పర్చుకోని చక్కగా చదువుకోవాలన్నారు. అనంతరం దాత శ్రీరామచంద్ర మూర్తిని, ఎంఈవో సుధాకరరావును క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.లక్ష్మికుమారి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి మురళి సుధాకరరావు, కోశాధికారి మలాది శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తహసీల్దార్ సింగారావుకు కలెక్టర్ ప్రశంసలు



ప్రశంసపత్రం అందజేస్తున్న కలెక్టర్

పంగులూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్ సింగారావు కలెక్టర్ ద్వారా ప్రశంసాపత్రం అందుకున్నారు. రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదులో ఉత్తమ పనితీరుకు గుర్తుగా కలెక్టర్ వెంకటమురళి గురువారం ఈ ప్రశంసాపత్రం అందజేశారు. మండలంలోని 64 మందిని రెడ్‌క్రాస్ సభ్యులుగా చేర్పించి సంస్థకు రూ.70400 నగదు జమచేశారు. రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదులో సహకరించిన అందరికీ తహసీల్దార్ సింగారావు కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీ ప్రభుత్వంలో ఇష్టానుసారం పింఛన్లు

- కలెక్టర్‌కు గ్రామస్థుల ఫిర్యాదు
- విచారించిన ఎంపీడీవో



విచారిస్తున్న ఎంపీడీవో కుసుమకుమారి

బల్లికురవ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో ఇష్టానుసారంగా కొందరికి నకిలీ సర్టిఫికెట్లు పెట్టి డప్పు కళాకారుల, చర్మ కళాకారుల, వృద్ధాప్య పింఛన్లను మంజూరు చేశారని వెంటనే విచారించాలని, ఉప్పుమాగులూరు గ్రామానికి చెందిన అమరనేని వినోద్ ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఎంపీడీవో కుసుమకుమారి గ్రామంలో పింఛన్లు తీసుకుంటున్న వారిని విచారించేందుకు వెళ్లారు. వీరిలో 30 మందికి గాను కేవలం ఇద్దరు మాత్రమే విచారణకు వచ్చారు. మిగిలిన వారు తమ వద్ద సర్టిఫికెట్లను తీసుకుని విచారణకు రెండు రోజుల్లో రావాలని లేకుంటే పింఛన్ల తొలగింపునకు నివేదిక పంపుతామని ఎంపీడీవో ఈసందర్భంగా తెలిపారు. ఫిర్యాదుదారులు మాట్లాడుతు గత 2019 నుండి 2024 మధ్య కాలంలో వయస్సు మార్చడంతో పాటు ఎలాంటి సర్టిఫికెట్లు లేకుండానే డప్పు కళాకారులు, చర్మ కళాకారులు అంటు పింఛన్లు మంజూరు చేసి ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారన్నారు. గతంలో పనిచేసిన అధికార్ల పాత్ర ఇందులో పెద్దఎత్తున ఉందని వెంటనే విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విచారణలో పంచాయతీ కార్యదర్శి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ముగ్గురు విద్యార్థుల ఎంపిక

చినగంజాం, జూన్ 26(ఆంధ్రజ్యోతి) : చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం. కె.శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో జరిగిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కపబరచి ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు తెలిపారు. బాల జ్ఞానేశ్వరి, మచవరపు సాహితి నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌కు, బోనాసి సమీరా కడప ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో సీట్లు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ట్రిపుల్ ఐటికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.







చీరాలలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌డీవో చంద్రశేఖర్, పంగులూరులో మాట్లాడుతున్న అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, మార్టూరులో విద్యార్థుల మానవహారం

యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

చీరాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో డ్రగ్స్‌బారిన పడి యువత భవిత చిత్తవతుందని, వాటికి ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని ఆర్‌డీవో చంద్రశేఖర్‌నాయుడు పిలుపునిచ్చారు. చీరాల పట్టణంలో తహసీల్దార్ గోపీకృష్ణ, ఎంపీడీవో శివన్నారాయణలతో కలిసి నిషాముక్త్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల చిన్నారులతో కలిసి ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు డ్రగ్స్ వినియోగంతో మానసిక స్థితిగతులను కోల్పతారని వివరించారు. వీటిని దూరంగా ఉంటామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంఈవో సుబ్రహ్మణ్యం, ఆయా పాఠశాలల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో..

కొత్తపట్నం మెరైన్ సీఐ సాంబశివరావు, ఎస్సైలు రాజేష్, సుబ్బారావు ఆధ్వర్యంలో వాడరేవు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తుపదార్థాల అనర్థాలను వివరించారు. తీరంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పందిళ్లపల్లి హైస్కూల్ ఆధ్వర్యంలో..

వేటపాలెం మండల పరిధిలోని పందిళ్లపల్లి ఉన్నత పాఠశాలలో 'డ్రగ్స్ వద్దు - ఆరోగ్యం ముద్దు' అంటూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరు ఏకతాటిపై నిలిచి మత్తుపదార్థాల వినియోగాని నివారించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శేషమ్మ, ప్రధానోపాధ్యాయురాలు దీప్తి, వేణు, విద్యార్థులు పాల్గొన్నారు.

- పంగులూరు :పాఠశాల విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు పిలుపునిచ్చారు. గురువారం అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ముప్పవరం పీఎస్ఎన్‌సీసీ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఐ మల్లికార్జునరావు మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు చదువు, క్రీడల పట్ల దృష్టిసారించాలన్నారు. అనంతరం రెవెన్యూ, ఆరోగ్య సిబ్బంది, పాఠశాల విద్యార్థులు, గ్రామస్థులతో ముప్పవరంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ. వినోద్‌బాబు, టీడీపీ నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, పలువురు గ్రామస్థులు, పాఠశాల విద్యార్థులు, రెవెన్యూ, వైద్య, పోలీస్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.
- మార్టూరు: యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాల వ్యసనాన్ని తరిమికొట్టాలని ఎస్ఐ సైదా అన్నారు. 'నిషా ముక్త్ బారత్ ప్రోగ్రాం' ద్వారా గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా మండలంలోని జడ్పీ హైస్కూల్స్‌లో, మాదకద్రవ్యాల నియంత్రణ అవగాహనా ర్యాలీ నిర్వహించారు. దీనిలో భాగంగా మార్టూరు కూడలిలో ఎస్ఐ సైదా ఆధ్వర్యంలో పోలీసులు, ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మార్టూరు పోలీస్‌స్టేషన్ నుండి ప్రారంభించిన ర్యాలీ ప్రధాన కూడలి నుంచి పెద్ద అండరు పాస్ వరకు నిర్వహించారు. అనంతరం పెద్ద అండరు పాస్ వద్ద మానవహారం ఏర్పాటుచేశారు. అదేవిధంగా కోనంకి జడ్‌పి హైస్కూల్ లో విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ పర్చూరు సీడీపీవో సుభద్ర, సూపర్ వైజరు పద్మ తదితరులు మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంకా యద్దనపూడి మండలంలో పోలూరు,పూనూరు, యద్దనపూడి హైస్కూల్స్ లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. యద్దనపూడి జడ్పీ హైస్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు సహకారంతో ఎంపీడీవో కృష్ణ ఆధ్వర్యంలో మానవహారం ఏర్పాటు చేశారు.
- బల్లికురవ : ఎంపీడీవో కుసుమకుమారి ఆధ్వర్యంలో గురువారం బల్లికురవలో మాదకద్రవ్యాల నిర్మూలన పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఎంఈవో రమేష్, హెచ్‌ఎం హనుమంతురావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- అద్దంకిటౌన్: కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ గల్ క్లబ్ ఆధ్వర్యంలో నడవడం కార్యక్రమం నిర్వహిం చారు. విద్యార్థులు ప్రగతిశీల సమాజంలో మద్యపానం, హానికరమైన ప్రభావాల గురించి అవగాహన కల్పించే నడక నిర్వహించారు. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- సంతమాగులూరు : డ్రగ్స్‌రహిత సమాజం కోసం యువత కృషి చేయాలని ఎస్ఐ పట్టాభిరామయ్య తెలిపారు. గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యం దినోత్సవం సందర్భంగా సంతమాగులూరులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, మండల పరిషత్ అధికారులు, రెవెన్యూ అధికారులతో కలసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్ లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వై.ఎలమంద, జిల్లా పరిషత్ ఉపకార్యనిర్వాహక అధికారి పి బాలమ్మ, సీఐ వెంకటరావు, ఎంపీడీవో జ్యోతిర్మయి, డిప్యూటీ తహసిల్దార్ రాఘవరావు, బల్లికురవ ఎస్ఐ నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.
- మేదరమెట్ల : మత్తు పదార్థాలకు యువత బానిసలు కావద్దని అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు అన్నారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మేదరమెట్లలో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు ఎవరైనా వినియోగిస్తున్నట్లు గమినిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించి బస్టాండ్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మేదరమెట్ల ఎస్ఐ మహమ్మద్ రఫీ, ఏఎస్ఐ అహ్మద్, వైద్యులు చిట్టిబాబు, హెల్ప్ సంస్థ డైరెక్టర్ బీవీ సాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.
- పర్చూరు : మాదక ద్రవ్యాల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తహసీల్దార్ పి.బ్రహ్మయ్య అన్నారు. జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సం సందర్భంగా గురువారం విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్లాకార్డులతో మాదకద్రవ్యాలను నిర్మూలిద్దాం అంటూ నినాదాలు చేశారు. అనంతరం స్థానిక బొమ్మల కూడలిలో మానవహారం చేపట్టారు. ఈసందర్భంగా ఎస్సై మాల్యాద్రి మాట్లాడుతూ యువత డ్రగ్ బారినపడి జీవితాలను వృధాచేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకట రామయ్య, ఈవోఆర్‌డీ కొసనా సత్యన్నారాయణ, పంచాయితీ కార్యదర్శి మస్తాన్‌రావు, నాగేశ్వరావు, హెచ్ఎంలు మోదుగుల నాగిరెడ్డి, బొప్పూడి భానుప్రసాద్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

అద్దంకి :యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సీఐ సుబ్బరాజు అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం సాయంత్రం అద్దంకి పట్టణంలోని పోలీస్‌స్టేషన్ నుంచి ఆర్‌టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో మానవహారం గా ఏర్పడ్డారు. ర్యాలీలో పోలీసులు, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.







బల్లికురవలో అధికారుల మానవహారం, అద్దంకిలో అధికారుల ర్యాలీ, పర్చూరు బొమ్మల కూడలిలో విద్యార్థులు, అధికారుల మానవహారం

ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందిస్తాం

జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈవో

బల్లికురవ. జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థికి ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తామని డీఈవో పురుషోత్తం పేర్కొన్నారు. గురువారం మండలంలోని అంబడిపూడి ఉన్నత పాఠశాలను గ్రామంలోని మోడల్ స్కూల్‌ను, ఫౌండేషన్ స్కూల్‌ను, కొణిదెన ఉన్నత పాఠశాలను, మోడల్ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. అంబడిపూడి బీసీ కాలనీ వాసులు, కొణిదెన ఎస్సీ కాలనీ వాసులు తమ పిల్లలకు తమ పరిధిలోనే ప్రాథమిక విద్యను అందించాలని బుధవారం జిల్లా కలెక్టర్ వెంకటమురళిని కలిసి పిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో పాఠశాలలను తనిఖీ చేశారు. చినఅంబడిపూడి బీసీ కాలనీకి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు తమ పాఠశాలను మోడల్ స్కూల్‌గా ఎంపిక చేయాలన్నారు. తమ పిల్లలు ఎస్సీ కాలనీలో ఉన్న స్కూల్‌కు వెళ్లాలంటే నడిచి వెళ్లడం ఇబ్బందిగా ఉందని తెలిపారు. కొణిదెన ఎస్సీ కాలనీకి చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలు మెడల్‌స్కూల్‌కు రావాలంటే చాలా ఇబ్బంది ఉందని గతంలో కూడా ఒక విద్యార్థి ప్రమాదంలో మృతి చెందాడని తమ కాలనీలో 5వ తరగతి వరకు ప్రాథమిక విద్యను అందించాలని డీఈవో దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్బగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన మేరకు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా తాము పనిచేస్తామన్నారు. తల్లిదండ్రులు కూడా అర్థం చేసుకొని తమకు సహకరించాలన్నారు. విద్యార్థులకు సమస్యలు ఉంటే తాము ఉన్నతాధికార్ల దృష్టికి సమస్యను తీసుకు వెళ్లి పరిష్కారం చేస్తామన్నారు. అనంతరం బల్లికురవ ఎంఈవో చర్చించారు. తనిఖీలో డిప్యూటీ డీఈవో గంగాధర్‌రావు, ఏఎస్‌వో సంజయ్‌కుమార్, ఎంఈవోలు వస్త్రంనాయక్, రమేష్, గోపీ, హెచ్‌ఎం లింగారావు, హనుమంతురావు, కేబీ వెంకటేశ్వరరావు, సీఆర్‌పీలు నాగేశ్వరరావు, రంగనాథ్, ఆశోక్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సత్కారం



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానిస్తున్న హెచ్.ఎం, ఉపాధ్యాయులు

చినగంజాం, జూన్ 26(ఆంధ్రజ్యోతి) : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిన పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులను గురువారం ఘనంగా సత్కరించారు. పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం కె.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఇక్కడి నుండి బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం.డి.రత్నకుమారి, మాథ్స్ అసిస్టెంట్లు కె.శ్రీనివాసరావు, శ్రీనివాస దీక్షితులు, సూర్యనారాయణ తెలుగు ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, పీఎస్ ఉపాధ్యాయులు షణ్ముఖి, ఇంగ్లీషు ఉపాధ్యాయులు నాజర్‌వలికు ఉపాధ్యాయులు పూలమాలలు, శాలువాతో సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. బదిలీపై ఇతర పాఠశాలల నుంచి ఇక్కడకు వచ్చిన ఉపాధ్యాయులను ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన చోట అంకితభావంతో పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ కార్యదర్శి కుమార్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు ఎస్.నరసింహారావు, సుబ్బారావు, కోటిరెడ్డి, సుధాకర్, శ్రీలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్ బ్రహ్మయ్యకు రెడ్‌క్రాస్ అవార్డు



అవార్డు అందుకుంటున్న బ్రహ్మయ్య

పర్చూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) :పర్చూరు తహసీల్దార్ పి.బ్రహ్మయ్యకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అవార్డు లభించింది. ఇండియన్ రెడ్ క్రాస్‌లో అత్యధికంగా (108) మందిని సభ్యులుగా చేర్చినందుకు ఆయనకు ఈ ఆవార్డు దక్కింది. గురువారం బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పా టు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ వెంకటమురళి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. జిల్లాస్థాయిలో అవార్డు అందుకున్న తహసీల్దార్‌ను సిబ్బంది, ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, ఆర్‌డీవో గ్లోరియా, సిబ్బంది ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి, జూన్26(ఆంధ్రజ్యోతి):పట్టణంలో కొత్తగా విద్యుత్ టవర్ లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నందున శుక్రవారం భాగ్యనగర్, బెరకానగర్, పోతురాజుగండి, భవానిసెంటర్ నుంచి పాత పెట్రోల్‌బంకు నామ్ రోడ్డు వెంబడి, పోతురాజుగండి నుంచి కాకానిపాలెం మండపం వరకు భవానిసెంటర్ పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో తోపుడు బండ్ల పంపిణీ



తోపుడు బండ్లు బహుకరిస్తున్న నిర్వాహకులు

పర్చూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చార్టర్ డే సందర్భంగా గురు వారం ముగ్గురు చిరు వ్యాపారులకు తోడుపు బండ్లు ఉచితంగా అందజేశా రు. పర్చూరు క్లబ్‌తోపాటు, పండరీపురం, జూబ్లీహీల్స్ రోటరీ సంయుక్త ఆర్థిక సహకారం అందజేసినట్లు క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ తెలిపారు. రోటరీ సేవా కార్యక్రమంలో భాగంగా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కోమటి ఆంజనేయులు, పాబోలు ఉదయభాస్కర్, నాగభైరు శ్రీనివాసరావు, పాబోలు వెంకటేశ్వ ర్లు, గడ్డిపాటి శ్రీనివాసరావు, కోడూరి శేషబ్రహ్మాచారి, కాసా అశోక్‌కుమార్, పోలి శెట్టి చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ద్విచక్రవాహనదారునికి గాయాలు

మార్టూరు, జూన్26(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ద్విచక్రవాహనదారుడికి గాయాలైన ఘటన మండలంలోని నాగరాజుపల్లి వెళ్లే దారిలో ఐర్ ఫ్యాక్టరీ సమీపంలో గురువారం సాయంత్రం చోటుచేసుకొంది. గ్రానైట్ ముడిరాయిని రవాణా చేస్తున్న లారీ ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న తంగిరాల అబ్రహం తలకు బలమైన గాయాలుకాగా, మరో వ్యక్తి రాజేష్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. బల్లికురవ మండలం చెన్నుపల్లి గ్రామానికి చెందిన వారిద్దరూ వ్యక్తిగత పనులు నిమిత్తం ద్విచక్రవాహనంపై మార్టూరు వచ్చి వెళుతున్నారు. అదేవిధంగా బల్లికురవ మండలంలోని గ్రానైట్ క్వారీ నుంచి మార్టూరులోని గ్రానైట్ పరిశ్రమకు ముడిరాయిని తరలిస్తున్న గ్రానైట్ లారీ రోడ్డు మలుపువద్ద ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాద సమాచారం అందుకున్న 108 వాహనం ఘటనా స్థలానికి రాగానే అబ్రహంను చిలకలూరిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు విచారిస్తున్నారు.





ధ్వజావరోహణ ఘట్టం నిర్వహిస్తున్న పూజారులు

రామతీర్థంలో ముగిసిన ఉత్సవాలు

విడవలూరు, జూన్ 26 : రామతీర్థంలో జరుగుతున్న శ్రీ కామాక్షీదేవి సమేత రామ లింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ధ్వజావరోహణంతో ముగిశాయి. ఉత్సవాల కోసం వచ్చిన సకల దేవతలను సాగనంపుతూ వచ్చే ఏడాది జరరగనున్న ఉత్సవాలకు తిరిగి రావాలని కోరుతూ వేదాలు పటిస్తూ ధ్వజస్తంభంపై ఉన్న కొడి గుడ్డను కిందకు దింపారు. అనంతరం సంతానం లేని మహిళలకు కొడిముద్దలను పంచారు. స్వామివారికి పూలంగి సేవ జరిగింది. రాత్రి స్వామి, అమ్మవారి ఏకాంత సేవను సర్వలాంచనాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు.

● హుండీ ఆదాయం..

స్వామివారి ఉత్సవాలకు వచ్చిన భక్తులు హుండీల ద్వారా రూ.19,81,322 నగదును సమర్పించారు. ఆలయ ఆవరణలో ఈవో బోగ్గల మల్లికార్జునరెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ సురేష్ ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు జరిగింది. 2024లో జరిగిన బ్రహ్మోత్సవాల్లో రూ.19,85,173 ఆదాయం సమకూరింది. గత ఏడాది కన్నా ఈ ఏడాది దేవదాయ శాఖకి రూ.3,851 రాబడి తగ్గింది.

సోమశిల గేట్లకు రోప్‌ల ఏర్పాటు



మొదటి క్రస్ట్ గేటుకు ఏర్పాటు చేసిన స్టాప్‌లాక్ గేటు

అనంతసాగరం జూన్ 26 (ఆంధ్ర జ్యోతి) : సోమశిల జలాశయం క్రస్ట్‌గేట్ల పనుల్లో కదలిక వచ్చింది. గత వైసీపీ హయాంలో గేట్ల అభివృద్ధికి, జలాశయం పటిష్టతకు ఒక్క రూపాయికి కూడా వెచ్చించలేదు. కానీ కుటమి ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా సోమశిల మనుగడను కాపాడేలా చర్యలు చేపట్టింది. రూ2.5 కోట్లతో పనులు చేసేలా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా తొలుత రోప్‌లు మార్చేందుకు చర్యలు చేపట్టారు. నెల రోజుల క్రితమే జలాశయం వద్దకు రోప్‌లు చేరగా, ప్రస్తుతం వీటిని అమర్చు తున్నారు. డ్యాంలో ప్రస్తుత నీటినిల్వ 33 టీఎంసీలు ఉండగా పనులు చేయడం అసాధ్యం కావడంతో డ్యాం వద్ద అందు బాటులో ఉన్నా గ్యాంటీక్రేన్‌తో స్టాప్‌లాక్ గేట్లు ఏర్పాటు చేసి పనులు పూర్తిచేసేలా కార్యాచరణ చేశారు. ట్రయల్ రన్‌గా ఒక టవ నెంబరు గేటుకు స్టాప్‌లాక్ గేటు బిగించి నీటి నియంత్రణ చేశారు. వాటి కొలతల ఆధారంగా త్వరలో మిగిలిన పనులు పూర్తిచేస్తామని నిపుణులు చెబు తున్నారు. కాగా, గురువారం డ్యాంకు 204 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. ఉత్తర కాలువకు 425, దక్షిణ కాలువకు 700, పెన్నాడెల్టాకు 3,300 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

వీఆర్ హైస్కూల్లో 30 నుంచి తరగతులు

వివరాలు 8

- 6వ తేదీ పాఠశాల ప్రారంభం
- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ వెల్లడి

మెప్మాలో డిజిటల్ సేవలు

● ఆర్పీలకు ట్యాబ్‌ల పంపిణీ

నెల్లూరు (హరనాథపురం), జూన్ 26(ఆంధ్రజ్యోతి) : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో (మెప్మా) డిజిటల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. జిల్లాలోని నెల్లూరు నగరపాలక సంస్థతోపాటు అన్ని మున్సిపాలిటీల పరిధిలోని పొదుపు మహిళలకు ఈ సేవలు అందనున్నాయి. పొదుపు సంఘాల సభ్యులకు త్వరితగతిన సేవలు అందించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మెప్మా రిసోర్సు పర్సన్లకు ట్యాబ్‌లు అందిస్తోంది. జిల్లాకు 400లకుపైగా ట్యాబ్‌లు రాగా, కొన్నింటిని రాష్ట్ర మంత్రి నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆర్పీలకు అందజేశారు. మిగిలిన మున్సిపాలిటీల్లో ఆయా ఎమ్మెల్యేలు అందజేయనున్నారు. ఈ ట్యాబ్‌లు తీసుకున్న ఆర్పీలు, మెప్మా సిబ్బంది ఎప్పటికప్పుడు పొదుపు సంఘాల సభ్యుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. గతంలో ఆర్పీలు తమ సొంత సెల్‌ఫోన్ ద్వారా వివరాలు ఆన్‌లైన్‌లో అనుసంధానం చేసేవారు. అయితే, యాప్‌నకు ఫోన్ సహకరించక పోవడంతో ప్రభుత్వం ట్యాబ్‌లు అందజేస్తోంది. మెప్మా పీడీ బాల లీలారాణి మాట్లాడుతూ ప్రతి ఆర్పీకి రూ.24వేల విలువైన ట్యాబ్ అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ డిజిటల్ సేవలను పారదర్శకంగా అందిస్తామని, అక్రమాలకు అవకాశం ఉండదని అన్నారు.



పొదుపు మహిళల వివరాలను ట్యాబ్‌లో నమోదు చేస్తున్న రిసోర్స్ పర్సన్



కనుల పండువగా చప్పర ఉత్సవం

నెల్లూరు (సాంస్కృతికం) : మూలాపేట శ్రీకృష్ణధర్మ రాజులస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో గురువారం రాత్రి చప్పర ఉత్సవం కనుల పండువగా జరిగింది. ఉదయం ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించి కొడిముద్దలు పంచారు. ఉత్సవ మూర్తులకు విశేష పుష్పాలంకారం జరిగింది. భగవద్గీత పారాయణం, మహాభారత ప్రవచనం జరిగాయి. ఆలయ ఈవో జానకి, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



డ్రగ్స్ ఫ్రీ జిల్లాగా మార్చుదాం!

జిల్లాను డ్రగ్స్ ఫ్రీ జిల్లాగా మార్చడానికి అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని ఎస్పీ జి కృష్ణకాంత్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాలు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం ఆర్టీసీ నుంచి కస్తూర్బా కళాక్షేత్రం వరకు జేసీ కార్తీక్‌తోపాటు అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. కేవీఆర్ పెట్రోల్ బంకు వద్ద మానవహారంగా ఏర్పడి ప్లకార్డులు, నినాదాలతో మాదక ద్రవ్యాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగిన సభలో విద్యార్థులు, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు.

- వివరాలు 8లో..



'ఇంజనీరింగ్'కు పూర్వ వైభవం

గతేడాది 81 శాతం సీట్ల భర్తీ ● ఈ ఏడాది 5,993 మంది ఉత్తీర్ణత

కూటమి హయాంలో సానుకూల దృక్పథాలు ● కళాశాలల యాజమాన్యంలోనూ ఆనందం

ఇంజనీరింగ్ విద్య పూర్వ వైభవం సంతరించుకుంటోంది. ఇందుకు గతేడాది సీట్ల భర్తీయే నిదర్శనం. అదేస్థాయిలో ఈసారి కూడా సీట్ల భర్తీ ఉంటుందని ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా అనుకూల పవనాలు వీస్తుండటంతో కౌన్సెలింగ్ ఎప్పుడు జరుగుతుందా అని విద్యార్థులు ఎదురు చూస్తున్నారు.

నెల్లూరు(విద్య), జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇంజనీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు 2025-26 విద్యాసంవత్సరానికి 11,560 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇంజనీరింగ్‌కు 8,913 మంది, వ్యవసాయ, ఫార్మసీ కోర్సులకు 2,647 మంది పరీక్ష రాశారు. ఇంజనీరింగ్‌లో 5,993 మంది, వ్యవసాయ, ఫార్మసీ విభాగంలో 2,263 మంది ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలోని 14 ఇంజనీరింగ్ కళాశాలల్లో మేనేజ్‌మెంట్ సీట్లు, కన్వీనర్ కోటా సీట్లు కలిపి 9వేల వరకు అందుబాటులో ఉన్నాయి. గత ఏడాది సీట్ల భర్తీ సంతృప్తినివ్వగా ఈ ఏడాది కూడా పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ అవుతాయని యాజమాన్యాలు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నీ సానుకూలంగానే జరుగుతున్నాయని తెలిపారు. ప్రవేశ పరీక్షలు సకాలంలో నిర్వహించడం, ఫలితాలను వెంటనే విడుదల చేయడంతోపాటు మరికొన్ని రోజుల్లో ప్రవేశాల నోటిఫికేషన్ కూడా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో కౌన్సెలింగ్ వేగవంతంగా పూర్తి చేసుకుని నెలరోజుల్లోనే తరగతులు కూడా ప్రారంభం అవుతాయని యాజమాన్యాలు చెబుతున్నాయి. అన్నీ సక్రమంగా జరుగుతుండడంతో విద్యార్థులు కూడా ఇంజనీరింగ్ చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

● గతేడాది 6,788 సీట్ల భర్తీ

గత విద్యాసంవత్సరంలో జిల్లాలోని 14 ఇంజనీరింగ్ కళాశాలల్లో 8,722 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్ సీట్లపై విద్యార్థులు ఆసక్తి చూపారు. కళాశాల స్థితిగతులు, సౌకర్యాలు, ఫ్యాకల్టీలు, క్యాంపస్ ఇంటర్వ్యూలు తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని కళాశాలలను ఎంపిక చేసుకున్నారు. 8,722 సీట్లకుగాను 6,788 సీట్లు భర్తీ (81.03 శాతం) అయ్యాయి.

● క్యాంపస్ ఎంపికలతో ఆసక్తి

ఏడాది కాలంలో అత్యధిక ఇంజనీరింగ్ కళాశాలల్లో క్యాంపస్ ఎంపికలు నిర్వహిస్తుండటం, పలు కంపెనీలు ఉద్యోగాలకు ఎంపిక చేస్తుండటంతో విద్యార్థులు జిల్లాలోని కళాశాలలపై మక్కువ చూపుతున్నారు. గత వైసీపీ హయాంలో క్యాంపస్ ఎంపికలు లేకపోవడం, ఫీజు రీఎంబర్స్‌మెంట్‌లు విడుదల కాకపోవడం తదితర కారణాలతో ఇంజనీరింగ్ విద్య ప్రశ్నార్థకంగా ఉండేది. కానీ ప్రస్తుతం పరిస్థితుల్లో మార్పులు వచ్చి తిరిగి కళాశాలలకు పూర్వ వైభవం వస్తుండటంతో యాజమాన్యాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. విద్యార్థులు కూడా సీఎస్ఈ, ఈసీఈ, ఐటీ వంటి గ్రూపులతోపాటు మెకానికల్, ఈఈఈ, సివిల్ గ్రూపులపైనా ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఈ ఏడాది సీట్ల భర్తీ ఆశాజనకంగానే ఉంటుందని అందరూ భావిస్తున్నారు.

అక్షరం.. సంపూర్ణమయ్యేనా!?

సత్ఫలితాలనిచ్చిన అక్షర చైతన్యం కార్యక్రమం

రెండు విడతల్లో 1.60 లక్షల మంది ఉత్తీర్ణత

మూడో విడతలో మరో 2 లక్షల మంది గుర్తింపు

ఒక మనిషి ఉన్నత స్థితికి చేరుకోవడంలో ప్రధాన భూమిక పోషించేది విద్య మాత్రమే. అందుకే ప్రతి ఒక్కరూ చదువుకు ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ చదువుకునేందుకు ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాయి. ఎన్ని చేసినా ఇంకా లక్షల మంది ప్రజలు నిరక్షరాస్యులుగానే ఉన్నారు. కనీసం చదవడం, రాయడం తెలిసి ఉంటే మరొకరి చేతుల్లో మోసపోకుండా ఉంటారు. ఈ నేపథ్యంలోనే జిల్లాలో పురుడుపోసుకున్న ఉన్నత కార్యక్రమం 'అక్షర చైతన్యం'. ఇప్పటికి రెండు దశల్లో విజయవంతమవగా, మూడో దశ కోసం ఎదురుచూస్తోంది. ఈ దశలో దాదాపుగా జిల్లాలో మిగిలిన నిరక్షరాస్యులందరినీ అక్షరాస్యులుగా మార్చేందుకు అవకాశాలున్నాయి. అయితే ఆ ప్రక్రియ అమలుకు కలెక్టర్ ఆనంద్ నిర్ణయం ఒక్కటే మిగిలి ఉంది.

8

కిసాన్ క్రెడిట్ కార్డులను అందించండి



వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఇతర అధికారులు

నెల్లూరు (హరనాథపురం) : జిల్లాలోని మత్స్యకారులు, పాడిరైతుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కిసాన్ క్రెడిట్ కార్డులను అందించాలని కలెక్టర్ ఆనంద్ బ్యాంకర్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన బ్యాంకర్ల సమితి సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పశుసంవర్ధక, మత్స్య శాఖల ఆధ్వర్యంలో కిసాన్ క్రెడిట్ కార్డులను అందించి మత్స్యకారులు, పాడిరైతులు సులభంగా బ్యాంకు రుణాలు పొందేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. వారంలోగా ఐదువేల కిసాన్ క్రెడిట్ కార్డులు అందచేయాలని ఆదేశించారు. ప్రభుత్వ రంగ బ్యాంకులతోపాటు ప్రైవేటు బ్యాంకులు కూడా ప్రభుత్వ కార్యక్రమాల అమలుకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు విరివిగా రుణాలు అందించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వార్షిక రుణప్రణాళిక పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం మణిశేఖర్, నాబార్డు డీడీఎం బాబు, పశుసంవర్ధక, మత్స్యశాఖ జేడీలు రమేష్ నాయక్, నాగేశ్వరరావు, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఖాళీ జాగా.. వేస్తాం పాగా!

కందుకూరులో ప్రభుత్వ స్థలాలపై కబ్జాదారుల కన్ను

నకిలీ పట్టాలతో హస్తగతానికి విశ్వప్రయత్నం

కందుకూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : కందుకూరులో ప్రభుత్వ స్థలాలపై కబ్జాదారులు కన్నేశారు. రూ.కోట్లు విలువజేసే స్థలాలను ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆ స్థలాలకు పట్టాలు సృష్టించేందుకు కొందరు యత్నిస్తుండగా మరికొందరు గతంలోనే సృష్టించిన నకిలీ పట్టాల ఆధారంగా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఓవీ రోడ్డులో బీసీ హాస్టల్ పక్కనున్న స్థలంలో ఓ వ్యక్తి చిల్లపొదలు, ఇతర పిచ్చిమొక్కలను తొలగించి ఆక్రమించేందుకు సిద్ధమయ్యాడు. అయితే, స్థానికుల ఫిర్యాదులతో అప్రమత్తమైన రెవెన్యూ అధికారులు వెంటనే అక్కడకు చేరుకుని సదరు స్థలంలో బోర్డు పెట్టి వచ్చారు. అయితే ఆ వ్యక్తి తనవద్ద ఉన్న నకిలీ పట్టాను ఆధారం చేసుకుని ఆ స్థలాన్ని కైవసం చేసుకోవాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. మార్కెట్ విలువను బట్టి ఆ స్థలం విలువ రమారమి కోటిన్నర రూపాయలు ఉంటుందని చెబుతున్నారు.

● పామూరు రోడ్డులోనూ..

అదేవిధంగా పామూరు రోడ్డులో ప్రశాంతికాలనీ సమీపంలో కోట్ల విలువైన ప్రభుత్వస్థలంపైనా కబ్జాదారులు కన్నేశారు. కాలనీ సమీపంలో సర్వే నెం. 122-1లో 1.75 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. ప్రధాన రహదారి పక్కనే ఉన్న స్థలం కావటంతో గత దశాబ్ద కాలంగా ఈ స్థలంపై కబ్జాదారులు కన్నేసి ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారు. కొందర నకిలీపట్టాలు సృష్టించినట్లు సమాచారం. గత ప్రభుత్వంలో ఈ స్థలాన్ని జగనన్న కాలనీల కోసం లే అవుట్‌గా అభివృద్ధి చేయాలని లక్షలాది రూపాయల మున్సిపాలిటీ నిధులతో మట్టి తోలి లెవలింగ్ చేశారు. అయితే కారణం ఏమిటో తెలియదు కానీ ఆ ప్రాంతాన్ని లే అవుట్‌గా మార్చకుండా వదిలేశారు. ఈ స్థలం విలువ కనీసం రూ.5 కోట్లు ఉంటుందని అంచనా. ప్రస్తుతం ఈ స్థలంపై కూడా కబ్జాదారులు కన్నేశారు. 3 రోజులక్రితం 1.75 ఎకరాల్లోని చిల్లచెట్లు, పిచ్చిమొక్కలను పూర్తిగా తొలగించి చదును చేశారు. ఈ వ్యవహారంపై గురువారం 'ఆంధ్రజ్యోతి' మున్సిపల్ కమిషనర్ అనూషను ప్రశ్నించగా, తనకు ఎలాంటి సమాచారం తెలియదని విచారిస్తానని చెప్పగా రెవెన్యూ సిబ్బంది మాత్రం అక్కడికెళ్లి చూసి వచ్చారు. ఈ స్థలం పక్కనే లే అవుట్ వేసిన వ్యక్తులు గతంలో నకిలీపట్టాలు సృష్టించిన వారితో కలిసి దీనిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ స్థలాన్ని ఆర్టీఓ కార్యాలయానికి ఇవ్వాలని, పలు ప్రభుత్వ కార్యాలయాల కోసం కేటాయించాలని కూడా గతంలో ప్రయత్నం జరిగింది. పట్టణంలోని మరికొన్ని ప్రాంతాలలో కూడా విలువైన ప్రభుత్వస్థలాలను కైవసం చేసుకునేందుకు కబ్జాదారులు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.



పామూరురోడ్డు ప్రశాంతికాలనీ వద్ద ప్రభుత్వ స్థలాన్ని చదును చేసిన కబ్జాదారులు



ఓవీ రోడ్డులో బీసీ హాస్టల్ పక్కన...

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	120
స్కిన్ చికెన్	216
స్కిన్‌లెస్	240
కోడిగుడ్ల ధర (100):	575

మహమ్మద్ రఫీ మృతి టీడీపీకి తీరనిలోటు

దగదర్తి (బిట్రగుంట), జూన్ 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడిగా పార్టీకోసం కష్టపడి పని చేసే మహమ్మద్ రఫీ (45) అకాల మృతి బాధాకరమని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. దగదర్తి మండలం యలమంచిపాడుకి చెందిన మస్లిం మైనార్టీ మండల అధ్యక్షుడు రఫీ భౌతికకాయాన్ని ఎమ్మెల్యే గురువారం దర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఆయన తల్లి, కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పమిడి రవికుమార్ చౌదరి, కేమదుబాబునాయుడు, జలదంకి శ్రీహరి, హనుమంతరావు, హరిరెడ్డి, పులిసేనయ్య తదితరులు పాల్గొన్నారు.


బాధితురాలికి ఎమ్మెల్యే పరామర్శ

మృతుల కుటుంబాలకు బీద పరామర్శ


టీడీపీ నేత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ బీద

కావలి,జూన్26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇద్దరు మృతుల కుటుంబాలను గురువారం ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పరామర్శించారు. టీడీపీ మైనార్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ బాబర్‌బాషా ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, ఇస్లాంపేటలో ఉన్న ఆయన నివాసానికి బీద వెళ్లి కుటుంబ సభ్యులను బీద పరామర్శించారు. అలాగే సీనియర్ జర్నలిస్ట్ ఓలేటి నాగేశ్వరరావు ఇటీవల మృతి చెందగా, కొత్తబజారులోని ఆయన నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే నాగేశ్వరరావు ఉత్తరక్రియలకు గురువారం స్థానిక నారాయణ కల్యాణ మండపంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, బీజేపీ, జనసేన. కమ్యూనిస్టు పార్టీల నేతలు పాల్గొన్నారు.

నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రాలు

● భారమైన నిర్వహణ ● చెత్త సేకరణ మరచిన పంచాయతీ పాలకులు
● అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా కేంద్రాలు ● నెరవేరని ప్రభుత్వ లక్ష్యం

కొండాపురం, జూన్26(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు గత టీడీపీ ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ సహకారంతో ప్రతి పంచాయతీలోనూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నిర్మాణం చేసింది. పారిశుధ్య నిర్వహణలో చెత్తనుంచి సంపద తయారీకేంద్రాల పాత్ర ఎంతో కీలకం. గతంలో వీటి నిర్వహణ పూర్తిస్థాయిలో జరుగుతూ గ్రామాలు శుభ్రంగా ఉండేవి. వైసీపీ ప్రభుత్వంలో నిర్వహణను గాలికొదిలేశారు. దీంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల లక్ష్యం నెరవేరకుండాపోయింది. మండలంలో 19 పంచాయతీలుండగా 17 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నిర్మించారు. తూర్పుఎర్రబల్లి, నేకునాంపేట పంచాయతీలలో స్థానిక సమస్యలతో నిర్మాణం జరగలేదు. ఈకేంద్రాలకు పారిశుధ్య కార్మికులద్వారా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించి చేర్చడం జరుగుతుంది. కేంద్రానికి చేరిన తడి, పొడి చెత్తను వేర్వేరుగా కుళ్లబెడతారు. ఇందులోని ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను యంత్రాల సాయంతో విందిచేస్తారు. ఈ విందిని సీసీ రోడ్లు, తారు రోడ్ల నిర్మాణాల్లో వినియోగిస్తారు. చెత్తను సేంద్రియ ఎరువుగా తయారుచేసి ఆయా గ్రామాల రైతులకు కేజీల చొప్పున విక్రయిస్తారు. చెత్తను సేంద్రియ ఎరువుగా మార్చేందుకు అయ్యేందుకు ఖర్చు అధి కంగా అవుతుందని పం చాయతీ పాలకులు ఆరోపిస్తున్నారు.


భీమవరప్పాడులో నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

● అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా..

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ప్రభుత్వాలు ఏర్పాటుచేసిన లక్ష్యం పూర్తిగా నెరవేరలేదని పలువురు విమర్శిస్తున్నారు. వీటి నిర్వహణను పట్టించుకోక పోవడంతో అవి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగామారాయి. గ్రామాలలో చెత్తను సేకరించడం జరగకపోవడంతో ఎక్కడచూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు పాలకులు స్పందించి చెత్తనుంచి సంపద తయారీకేంద్రాలను పూర్తిస్థాయిలో వాడుకలోకి తీసుకురావాలి.

నిర్వహణ బాధ్యత పంచాయతీలదే..

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ పంచాయతీలదే. ప్రభుత్వ నిబంధనల మేరకు పలు పంచాయతీలలో పాక్షికంగా చెత్త సేకరణ జరుగుతున్నది. అన్నిపంచాయతీలలోనూ చెత్త సేకరణ జరిగేందుకు తగిన చర్యలు తీసుకుంటాం.

- ఆదినారాయణరావు, ఎంపీడీవో



విద్యుత్ సరఫరాలో అంతరాయం లేదు

● విద్యుత్ డీఈఈ రవికుమార్

కావలిటౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వేసవిలో కరెంట్ కోతలు లేకుండా నిరాటంకంగా విద్యుత్ సరఫరా జరిగింది. ట్రంకురోడ్డు విస్తరణ పనుల వల్ల పాత లైన్లు తొలగించడం, నూతన లైన్లు అమర్చడం తదితర పనుల వల్ల ఇటీవల కొన్ని రోజులు రోడ్డుకిరువైపుల ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని విద్యుత్ డీఈఈ రవికుమార్ తెలిపారు.

? : విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఎటువంటి చర్యలు తీసుకున్నారు.

! : అవసరమైన చోట్ల కాలం చెల్లిన పాత లైన్ల స్థానంలో కొత్త లైన్లు ఏర్పాటు చేయడం, లోడ్ కనుగుణంగా అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడం వంటి అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో సమస్య అధిగమించాం

? : లోవోల్టేజ్ సమస్య ఎలా ఉంది.

! : గతంలో పోలిస్తే లోవోల్టేజ్ సమస్య లేదనే చెప్పాలి అవసరమైన చోట్ల నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో విద్యుత్ సరఫరా సమస్య, లోవోల్టేజ్ సమస్య పరిష్కారమైనట్లే.

? : పట్టణంలో ఎన్ని ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు.

! : ఇటీవల 20నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశాం. మరో 10 ట్రాన్స్‌ఫార్మర్లు బిగించేందుకు సిద్ధంగా ఉన్నాయి. మరో 10 ట్రాన్స్‌ఫార్మర్లకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

మరోసారి టీడీపీ మండల అధ్యక్షుడిగా మాదాల


టీడీపీ మండల అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన లక్ష్మీనరసింహంను సన్మానిస్తున్న నాయకులు

వలేటివారిపాలెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ అధ్యక్షుడిగా మాదాల లక్ష్మీనరసింహం (చిన్న) రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ను గురువారం పలువురు టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. అలాగే మండల టీడీపీ ప్రధాన కార్యదర్శిగా గుడిపాటి బెంజిమెన్ మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మాలకొండ ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ చెరువుపల్లి మాల్యాద్రి, సీనియర్ న్యాయవాది ప్రగడ శ్రీనివాసులు, నాయకులు ప్రగడ మోహన్‌కుమార్, చెరువుపల్లి సాంబయ్య, ప్రగడ చినరాయణ, దేగా వెంకటేశ్వర్లు, నల్లమోతు అంకయ్య, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల రహిత కావలిగా తీర్చిదిద్దుదాం : ఎమ్మెల్యే దగుమాటి




కావలి : మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి, అధికారులు, విద్యార్థులు, కందుకూరు : నిషా ముక్తభారత్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, పోలీసు అధికారులు, కలిగిరి : పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మానవహారం

కావలి, జూన్26(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో గంజాయి వ్యాపారాన్ని పెంచి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆయన అనుచరులు సొమ్ముచేసుకున్నారని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే గంజాయిని నిర్మూలించిందన్నారు. కావలిని మాదకద్రవ్యాల రహితంగా చేసేందుకు యువత నడుము బిగించాలని ఆయన తెలిపారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం సాయంత్రం ట్రిడ్జిసెంటర్ నుంచి పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్ వరకు అధికారులు, విద్యార్థులు అవగాహనర్యాలీ నిర్వహించారు. అనంతరం పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్ వద్ద ప్రతిజ్ఞ చేయించారు.ర్యాలీలో ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, ఆర్డీవో ఎం. వంశీకృష్ణ, డీఎస్పీ పి. శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కావలిలో మాదకద్రవ్యాల వినియోగాన్ని పోలీసులు ఉక్కుపాదం మోపి మాదకద్రవ్యాల రహిత కావలిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. కార్యక్రమంలో కలిగిరి, వింజమూరు, జలదంకి ఎస్ఐలు ఉమాశంకర్, వీరప్రతాప్, లతీఫున్నీసా, ఎమ్మెల్యే పీఏ మహమ్మద్ అబ్దుల్ ఖలీల్, పోలీసు సిబ్బంది, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

● కలిగిరి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కలిగిరి సీఐ వెంకటరమణ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాలు, అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పట్టణంలో విద్యార్థులతో కలిసి పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, మానవహారం ఏర్పాటు చేశారు.


ఉలవపాడు : ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, మెరైన్ పోలీసులు

● ఉలవపాడు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మత్తు పదార్థాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రామాయపట్నం మెరైన్ పోలీసులు విద్యార్థులతో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. రామాయపట్నం, పెదపట్టపుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే దుష్పరిణామాల గురించి మెరైన్ ఎస్ఐ ఎస్‌కే మస్తాన్ వలీ, ఈశ్వరయ్య వివరించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి, ప్లకార్డుల ప్రదర్శనల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రామాయపట్నం జడ్పీ హైస్కూల్ హెచ్ఎం సుదాకర్, పీడీ జీవన్ కుమార్, పెదపట్టపుపాలెం హెచ్ఎం ఎస్‌కే నలీంబాషా, పంచాయతీ సెక్రటరీ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

● కందుకూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలల్లో గురువారం మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన నషా విముక్త అవగాహన కార్యక్రమం జరిగింది. అనంతరం మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కే.నరేష్‌రాజా, పీడీ కే. కరుణరత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు. టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ నాగూర్‌వలీ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. కాగా గురువారం సాయంత్రం పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, సిబ్బంది, విద్యార్థులతో పాటు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులుగా ర్యాలీలో పాల్గొన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాల నుంచి పామూరురోడ్డులోని వెంగమాంబ పంక్షన్‌హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ యువతను మాదకద్రవ్యాల వ్యసనపు ముప్పు నుంచి కాపాడటమే లక్ష్యంగా ప్రభుత్వం కృషిచేస్తున్నదని ఆయన వివరించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


గొర్రెలకు నట్టల నివారణ మందు తాపిస్తున్న టీడీపీ నేత వలేటి మధుసూదనరావు

వలేటివారిపాలెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పశుపోషకులు, సన్నజీవాల పెంపకందారులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వెటర్నరీ ఏడీ ఎంకేటి చెన్నకేశవులు తెలిపారు. వలేటివారిపాలెంలో టీడీపీ నాయకులతో కలిసి గురువారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదాల లక్ష్మీనరసింహం, వలేటి మధుసూదనరావు, వలేటి నరసింహం, కాకుమాను అంజనేయులు, కాకుమాను మాల్యాద్రి పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ : బొల్లినేని


యశోదమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లినేని

కలిగిరి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు ఎల్లవేళలా టీడీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు పేర్కొన్నారు. గురువారం కలిగిరిలోని తన కార్యాలయంలో పలువురు నేతలతో ముచ్చటించారు. కలిగిరి గుండ్రా నాలుగులైన్ల రహదారి నిర్మాణం, మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు తదితర సాగర్యాల కల్పనకు కృషి చేయాలని స్థానికులు ఆయన్ను కోరారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకుడు ఉసా మాల్యాద్రి సతీమణి ఆనారోగ్యానికి గురైన విషయం తెలుసుకొని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే టీడీపీ మండలాధ్యక్షుడు బిజ్జం వెంకటక్రిష్ణారెడ్డి అత్త మునగాల యశోదమ్మ ఉత్తరక్రియల్లో బొల్లినేని పాల్గొన్నారు. కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, బీవీ రామారావు, చీమల తాతయ్య, తదితరులు పాల్గొన్నారు.

● బొల్లినేని విరాళం

ఈనెల 29 నుంచి జరుగనున్న కలిగిరమ్మ ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు రూ20వేల విరాళాన్ని గురువారం నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా బొల్లినేని మాట్లాడుతూ కలిగిరి పట్టణం, జిర్రావారిపాలెం, పావనమునిరెడ్డిపాలెం గ్రామాల ప్రజలు కలిసికట్టుగా చేసుకునే ఈ ఉత్సవాలు గ్రామాలమధ్య స్నేహభావాన్ని పెంపొందించడానికి దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.

పక్కాగృహాల నిర్మాణం వేగవంతం చేయాలి


పక్కాగృహాల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ వేణుగోపాల్

దగదర్తి (బిట్రగుంట), జూన్ 26(ఆంధ్రజ్యోతి): బోగోలు మండల పరిధిలోని జగనన్న కాలనీల, పక్కాగృహ నిర్మాణాలను జిల్లా హౌసింగ్ పీడీ వేణుగోపాల్ గురువారం సందర్శించారు. విశ్వనాథరావుపేట పంచాయతీ పరిధిలో నిర్మాణంలో ఉన్న పక్కాగృహాలను పరిశీలించి లబ్ధిదారులకి సకాలంలో బిల్లులు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. లబ్దిదారులకు ఆర్థిక ఆదనపుభారం కలుగ కుండా ఇళ్లనిర్మాణం పూర్తి అయ్యేలా చూడాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం 1లో లక్షా 40 వేల ఇళ్ల మంజూరు అయినట్లు తెలిపారు. అందులో 30 వేల ఇళ్ల పూర్తి కాగా 22 వేలు ఇంకా మొదలు పెట్టలేదన్నారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని అన్నారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ హేమంత్‌కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, స్థానికులు ఉన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ


సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న బీద గిరిధర్

అల్లూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : వివిధ అనారోగ్య సమస్యలతో చికిత్స చేయించుకున్న పేదలకు ఆర్థిక సాయాన్ని అందించేందుకు సీఎం సహాయ నిధి దోహదపడుతుందని నెల్లూరు జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. గురువారం ఐదుగురు లబ్దిదారులకు రూ.3,78,186 విలువ గల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తోట శ్రీహరి, బుచ్చిరెడ్డి బాబు, కీర్తి బాబూరావు, మల్లి గోపాలరావు, పిట్టి సుబ్రహ్మణ్యం, కొండారు సాయి కిరణ్, ఖలీఫా శ్రీనయ్య తదితరులు పాల్గొన్నారు.

లేఅవుట్లు, భవనాలకు అనుమతులు తప్పనిసరి

నెల్లూరు(సిటీ), జూన్26(ఆంధ్రజ్యోతి) : నగరంలో భవన నిర్మాణాలకు, కొత్త లేఅవుట్ల ఏర్పాటుకు కార్పొరేషన్ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ నందన్ తెలిపారు. గురువారం మూలాపేట, బుజ్జమ్మనగర్, సవరాలవీధి, మినీ బైపాస్‌రోడ్డు పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అనుమతులులేకుండా నిర్మించిన భవనాలు, నిబంధనలు అతిక్రమించిన కట్టడాలను గుర్తించాలని, వాటి యజమానులకు నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

వాకర్స్‌కు బల్లల ఏర్పాటు


బల్లలు ఏర్పాటు చేయిస్తున్న వాకర్స్ సభ్యులు

బిట్రగుంట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కోవూరుపల్లికి చెందిన టీడీపీ నేత ఐంధుపూరు ధనుంజయరెడ్డి జ్ఞాపకార్థం ఆయన తమ్ముడు రామ్మోహన్‌రెడ్డి వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు రెండు సిమెంట్ బల్లలను గురువారం వితరణ చేశారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీ.బర్నాడ్, మాజీ గౌరవ అధ్యక్షుడు ఎన్ఏ‌ఎస్ యాదవ్ మాట్లాడుతూ వాకర్ల కోసం అన్నదే వాకర్స్ నినాదమన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మస్తాన్ శ్రీనివాసులు, సత్యనారాయణాచార్యులు, నర్సరాజ్, జీవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న ఎస్‌బీఐ సిబ్బంది

కావలి,జూన్26(ఆంధ్రజ్యోతి) : ఎస్‌బీఐ స్థాపించి 70 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు 45 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్‌మేనేజరు సీహెచ్ లోకనాథం, స్టాఫ్ యూనియన్ సెక్రటరీ కే. శ్రీనివాసులు రెడ్‌క్రాస్ డిఆర్ సీహెచ్ ప్రసాద్, సభ్యులు జీవన్, సెక్రటరీ అధికారి రహీంబాష, కావలి రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్ కే. హరినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

145 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు మొత్తం 566పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకువచ్చారు. వేలంలో 10 కంపెనీ ప్రతినిధులు పాల్గొని 421బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-122, ఆర్‌ఆర్-12, సీఈఓ-4, జంపింగ్‌లర్స్-7 కారణంతో 145బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.221.94గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

కోవూరుపల్లి పీహెచ్‌సీ వైద్యులుగా రామకృష్ణ

బిట్రగుంట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కోవూరుపల్లి పీహెచ్‌సీ వైద్యులుగా ఎన్.రామకృష్ణ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ ప్రదీప్‌కుమార్ విజయవాడకు బదిలీ కాగా, ఆ స్థానంలో వాకాడు పీహెచ్‌సీలో పనిచేస్తున్న డాక్టర్ రామకృష్ణ ఇక్కడికి వచ్చారు. ఈటీ వైద్యులు, సిబ్బంది పరిచయ అనంతరం ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

బెల్టు షాపులను నిర్మూలించాలి

కందుకూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో మద్యం బెల్టుషాపులతో నిరుపేద కూలీలు, గ్రామీణ ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని, వీటి నిర్మూలనకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ నేతి మహేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మద్యం బెల్టుషాపులవల్ల ప్రధాన సమస్యగా మారిందన్నారు. లైసెన్స్‌డ్ మద్యం దుకాణాల నిర్వాహకులే బెల్టుషాపులను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. వారు విచ్చలవిడిగా ఆడిటోట్లకు విక్రయిస్తున్నారని, కూలీపనులకు వెళ్లే ప్రజలు సాయంత్రానికి అందుబాటులో మద్యం ఉంటుండటంతో ధర ఎంతైనా ఆలోచించకుండా ప్రతిరోజు మద్యం సేవిస్తూ జేబులు చిల్లు పెట్టుకుంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం షాపులు, బెల్టుషాపుల వ్యవహారం ఓ మాఫియాగా మారుతున్నందున ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి బెల్టుషాపులను నిర్మూలించాలని ఆయన డిమాండ్ చేశారు.

నాలుగు మండలాలకు టీడీపీ నూతన అధ్యక్షులు

● కందుకూరు పట్టణం, లింగసముద్రం కమిటీల ఎంపిక వాయిదా

కందుకూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా కందుకూరు రూరల్, వలేటివారిపాలెం, గుడ్లూరు, ఉలవపాడు మండలాలకు నూతన అధ్యక్షుల ఎంపిక గురువారం జరిగింది. స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కందుకూరు రూరల్ మండలానికి నార్నె రోశయ్య స్థానంలో దొంతిరెడ్డిపాలెం చెందిన బుస్సారెడ్డి కృష్ణారెడ్డిని ఎన్నుకున్నారు. వలేటివారిపాలెం, గుడ్లూరు, ఉలవపాడు మండలాలకు పాత అధ్యక్షులైన మాదాల లక్ష్మీనరసింహం, జనిగిర నాగరాజు, రాచగర్ల సుబ్బారావులను తిరిగి ఎన్నుకున్నారు. కందుకూరు పట్టణ అధ్యక్షుడిగా కొనసాగుతున్న నామినేటెడ్ పదవి ఆశిస్తున్న దామా మల్లేశ్వరరావు విముఖత చూపడంతో వాయిదా వేశారు. లింగసముద్రం అధ్యక్షుడిగా ఉన్న వేముల గోపాల్ స్థానంలో ఎస్సీకి అవకాశం కల్పించాలని ఆ మండల అధ్యక్షుడి ఎంపిక కూడా వాయిదావేశారు. ఎంపికల కార్యక్రమానికి కె కుసుమకుమారి, రాచమల్ల శ్రీనివాసరెడ్డి, మంచు కొండయ్యలు పరిశీలకులుగా హాజరవగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే వారికే పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతోందన్నారు.

● ఎంపికలపై అసంతృప్తి

పార్టీ మండల కమిటీల ఎంపిక తీరుపై గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. గతంలో మండల కమిటీల ఎంపిక మండలకేంద్రంలో అన్ని గ్రామాల ముఖ్య కార్యకర్తల సమక్షంలో వారి అభిప్రాయం మేరకు జరిగేదని అందుకు విరుద్ధంగా ఈసారి ఎమ్మెల్యే కార్యాలయంలో అధికారికంగా మాత్రమే సమాచారం ఇచ్చి ఏకపక్షంగా అధ్యక్షులను ప్రకటించడం జరిగిందన్నారు.

తెలుగు భాషా ఉత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : తెలుగు వ్యావహారిక భాష పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా ఆగస్టు 29 నుంచి నెల్లూరు టౌన్‌హాల్‌లో తెలుగు భాషా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. తెలుగు భాష, సాహితీ, సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో జిల్లా రచయితలు, రచయిత సంఘాల కూటమి సహకారంతో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వీటికి సంబంధించిన గోడపత్రికలను ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో గురువారం ఆవిష్కరించారు. అధ్యయన కేంద్రం సంచాలకుడు మాడభూషి సంపత్ కుమార్, ప్రముఖ రచయితలు డాక్టర్ పెరుగు రామకృష్ణ, టేకుమళ్ల వెంకటప్పయ్య, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతలు జిల్లేళ్ల బాలాజీ, గంగిశెట్టి శివకుమార్, సేవ అధ్యక్షుడు కంచర్ల సుబ్బానాయుడు, తదితరులు పాల్గొన్నారు.




ర్యాలీకి వచ్చిన వారంతా పరుగో పరుగు



ఫ్లెక్సీయే మాకు రక్ష

అమ్మో.. తేనెటీగలు!

అంతర్జాతీయ మాదక ద్రవ్యాలు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం ర్యాలీ చేపట్టేందుకు అధికారులు, పోలీసులు, విద్యార్థులు నగరంలోని సర్వోదయా కళాశాల ప్రాంగణానికి చేరుకున్నారు. ఇక ర్యాలీ ప్రారంభం అవుతుందన్న దశలో తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేయడంతో వచ్చిన వారంతా పరుగులు తీశారు. కొందరు ప్లకార్డులు, ఫ్లెక్సీలను అడ్డుపెట్టుకోగా మరికొందరు మైదానం నుంచి ప్రధాన రోడ్డులోకి పరుగులు తీశారు. అయితే, ఎవరికీ ఎలాంటి హానీ జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, (ఆంధ్రజ్యోతి, నెల్లూరు)

వీఆర్ హైస్కూల్లో 30 నుంచి తరగతులు



మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు(విద్య), జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఆధునీకరించిన వీఆర్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 30వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. ఆ రోజున 6 నుంచి 9 తరగతుల వరకు బోధన ప్రారంభిస్తారని, జూలై 2వ తేదీ 1 నుంచి 5 తరగతులకు, 3వతేదీ నర్సరీ తరగతులు ప్రారంభమవుతాయని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. జూలై 6వ తేదీన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా పాఠశాలను ప్రారంభించేలా సన్నహాలు చేస్తున్నామని తెలిపారు. ఆ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం మంత్రి పరిశీలించారు. వీఆర్ హైస్కూల్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునీకరిస్తున్నామని, పనులను శరవేగంగా పూర్తి చేసేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారని చెప్పారు. పాఠశాలలో అడ్మిషన్ కోసం ఇప్పటి వరకు ఐదు వేల మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో 1500 మంది నిరుపేద విద్యార్థులకే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ఈ పాఠశాల తరహాలోనే నగరంలోని మరో 11 హైస్కూల్స్‌ను ఏడాదిలోపు సిద్ధం చేస్తామని, నాలుగేళ్లలో అన్నీ స్కూల్స్‌ను ఆధునీకరిస్తామని మంత్రి ప్రకటించారు. దేశంలోనే నెల్లూరు స్కూల్స్‌ను మోడల్‌గా నిలబెట్టడమే తన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, వీఆర్ విద్యా సంస్థల ప్రత్యేక అధికారి కే కార్తీక్, మునిసిపల్ కమిషనర్ నందన్, పాఠశాల ప్రిన్సిపాల్ వెంకట్రావు, అధికారులు పాల్గొన్నారు.



ఈవీఎం గోదాము వద్ద కలెక్టర్ ఆనంద్, ఆర్డీవో అనూష, అధికారులు, నాయకులు

ఈవీఎం గోదాముల వద్ద పటిష్ట భద్రత ఉండాలి

● కలెక్టర్ ఆనంద్ ఆదేశం

నెల్లూరు(వెంకటేశ్వరపురం), జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ఈవీఎం గోదాముల వద్ద నిరంతరం పటిష్ట భద్రత ఉండాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. నెల్లూరు ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎం గోదాములను గురువారం ఆయన పరిశీలించారు. గోదాముల వద్ద పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అనూష, ఏవో నిర్మలానందబాబా, తహసీల్దారు షఫీ మాలిక్, పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఇగ్నోలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం(ఇగ్నో)లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నెల్లూరులోని ఇగ్నో స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ వీ తనూజ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జూలై - 2025 నుంచి ప్రారంభం కానున్న విద్యాసంవత్సరానికి ఆన్‌లైన్ ద్వారా పీజీ, డిగ్రీ, డిగ్రీ ఆనర్స్, పీజీ డిప్లొమో, డిప్లొమో, సర్టిఫికెట్ కోర్సులకు జూలై 15లోపు www.igno.ac.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు నెల్లూరులోని వీఆర్ పీజీ స్టడీ ప్రాంగణంలో ఉన్న ఇగ్నో స్టడీ సెంటర్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

3న ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

నెల్లూరు(విద్య), జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా జట్టు ఎంపిక జూలై 3న నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి బీ చంద్రశేఖర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగే ఈ ఎంపికలకు సంబంధిత తేదీలో సాయంత్రం 3 గంటలకు క్రీడాకారులు హాజరు కావాలని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వయసు ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్, పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలని, మరిన్ని వివరాలకు స్టేడియంలో సంప్రదించాలని కోరారు.

రామతీర్థంలో ఇరువర్గాల ఘర్షణ

విడవలూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రామతీర్థంలో గురువారం శ్రీకామాక్షీదేవి సమేత రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో యువకుల మధ్య జరిగిన చిన్నపాటి వివాదం చినికిచినికి గాలివానగా మారి, రెండు గ్రామాల మధ్య ఘర్షణకి దారి తీసింది. సేకరించిన సమాచారం మేర కు రామతీర్థం బ్రహ్మోత్సవాల్లో బా గంగా బుధవారం తీర్థవాది జరిగింది. ఈ క్రమంలో పాతూరుకి చెందిన యువకులకు, రామలింగాపురం యువకులకు మధ్య కొన్ని కారణాల వల్ల వివాదం నెలకొంది. ఈ వివాదం కాస్త పెద్దదిగా మారటంతో రామలింగాపురానికి చెందిన గ్రామకాపులు పాతూరుకి చెందిన కాపులతో వివాదానికి జరిగిన కారణాలపై మాట్లాడటం జరిగింది. కాపుల మధ్య సయోధ్య జరిగిన తరువాత రామలింగాపురానికి చెందిన కొందరు వ్యక్తులు పాతూరుకి వచ్చి ఇండ్లలో ఉన్న ముగ్గురు యువకులను దౌర్జన్యంగా తీసుకుని పోయారు. ఈ విషయం తెలుసుకున్న పాతూరు కాపులు, గ్రామస్థులు రామలింగాపురానికి వెళ్లి అక్కడ ఉన్న కాపులతో మీ గ్రామస్థులు చేయటం తప్పని వారించే ప్రయత్నం చేశారు. దీంతో ఆగ్రహించిన రామలింగాపురానికి చెందిన కొందరు పాతూరు గ్రామస్థులపై దాడి చేశారు. దీంతో పలువురికి స్వల్ప గాయాలు కాగా నెల్లూరుకి చెందిన శివరామ్‌కి తీవ్రగాయాలు అయ్యాయి. దీంతో అతడిని నెల్లూరులోని ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నరేష్ కుమార్ యాదవ్ కేసు విచారణ చేపట్టారు.

ఆత్మకూరు ఆర్టీసీ డీఎంగా శివకేష్ యాదవ్

ఆత్మకూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ఆర్టీసీ నూతన డీఎంగా శివకేష్ యాదవ్ నియమితుయ్యారు. ఆయన గురువారం ఆత్మకూరుకు విచ్చేసి బాధ్య తలు స్వీకరించారు. అసిస్టెంట్ మేనేజర్ రాజ్‌కుమార్, పలువురు ఆర్టీసీ ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్ప గుచ్ఛాలు అందజేసి అభినందించారు.



పడమటిపాళెంలో పనిచేయని సోలార్ నీటి పథకం

గ్రామాల్లో ఎంతో ఉపయోగం

సోలార్ నీటి పథకం..

పునరుద్ధరిస్తే బెటర్!

● 2017లో టీడీపీ హయాంలో ఏర్పాటు ● వైసీపీ ప్రభుత్వంలో నిర్వహణ కరువు

● రూ.లక్షల ప్రజాధనం వృథా ● వినియోగంలోకి తెస్తే పల్లెజనానికి తీరనున్న దాహం

సంగం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : సోలార్ వినియోగం ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోంది. ఇంటింటా సౌర వ్యవస్థను తీసుకురావాలన్న లక్ష్యంతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు ఎప్పటినుంచో ఉన్న వ్యవస్థను నీరుగార్చుతుండటం విమర్శలకు తావిస్తోంది. 2017లో నాటి తెలుగుదేశం ప్రభుత్వం తీసుకొచ్చిన సోలార్ నీటి పథకాన్ని అమలులోకి తెచ్చింది. నాడు ఉమ్మడి జిల్లాలో 2,622 హ్యాబిటేషన్లు ఉండగా అందులో మొదటిగా నీటి సమస్య ఉన్న 107 చోట్ల మంచినీటి సమస్య తీర్చేందుకు ప్రయోగాత్మకంగా సోలార్ నీటి పథకాన్ని తీసుకొచ్చారు. సంగం, బోగోలు, కొండాపురం, వింజమూరు, నాయుడుపేట, విడవలూరు, కోవూరు, సర్వేపల్లి, వెంకటగిరి, చిట్టమూరు తదితర 37 మండలాల పరిధిలో సోలార్ నీటి పథకాలు ఏర్పాటుకు ఒక్కోదానికి రూ.7.5 లక్షల చొప్పున తొలి విడతగా సుమారు రూ.5.24కోట్లు మంజూరు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో ఓ ప్రైవేట్ కంపెనీకి ఏర్పాటు బాధ్యతలను అప్పగించి, పూర్తి చేశారు.

● వైసీపీ హయాంలో నిర్లక్ష్యం

2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం సోలార్ పథకంపై నిర్లక్ష్యం వహించింది. చిన్న చిన్న మరమ్మతులను కూడా అప్పటి అధికారులు, పాలకులు పట్టించుకోలేదు. దీంతో సోలార్ నీటి పథకాలు చాలా చోట్ల మూలకు చేరాయి. సంగం మండలంలోని పడమటిపాళెం, వీర్లగుడిపాడులోని సోలార్ నీటి పథకాలు కూడా మరమ్మతులకు గురై ఈ కోవలోకే చేరాయి. దీంతో రూ.లక్షలు వెచ్చించి చేపట్టిన సోలార్ నీటి పథకాలను నిరుపయోగంగా వదిలేశారు. వాటి స్థానంలో కొన్నిచోట్ల జలజీవన ధార పథకంలో ఇంటింటికి కొళాయిలు వేశారు. మరికొన్ని చోట్ల చేతి పంపుల మీదనే ప్రజలు ఆధారపడి నీటి అవసరాలు తీర్చుకొంటున్నారు.

● ప్రభుత్వం దృష్టి సారించేనా..?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. నాడు తెలుగుదేశం హయాంలో చేపట్టి విజయవంతంగా సాగిన సోలార్ నీటి పథకాలు నేడు మూలకు చేరాయి. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం సూర్యఘర్ పథకంలో ఇంటింటికి సౌర విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నాయి. దరఖాస్తుదారులకు రాయితీలు, బ్యాంకు రుణాలు అందజేస్తూ విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో నాడు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో విజయవంతమైన సోలార్ నీటి పథకాల వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రగ్స్ ఫ్రీ జిల్లాగా మారుద్దాం!

● ఎస్పీ కృష్ణకాంత్ పిలుపు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు (క్రైం), జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను డ్రగ్స్ ఫ్రీ జిల్లాగా మార్చడానికి కలిసికట్టుగా కృషి చేద్దామని ఎస్పీ జి కృష్ణకాంత్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాలు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం ఆర్టీసీ నుంచి కస్తూర్బా కళాక్షేత్రం వరకు అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. ముందుగా ఈ ర్యాలీని జేసీ కార్తీక్‌తో కలిసి ఎస్పీ ప్రారంభించారు. కేవీఆర్ పెట్రోల్ బంకు వద్ద విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్లకార్డులు, నినాదాలతో మాదకద్రవ్యాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగిన సభలో విద్యార్థులు, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మాదకద్రవ్యాల అనర్థాల గురించి, వాటిని ఏవిధంగా ఎదుర్కోవాలనే అంశాల గురించి యువత తెలుసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలపై సమాచారం ఇవ్వడానికి ఈగల్ టోల్‌ఫ్రీ నెంబర్ 1972 ఏర్పాటు చేసిందన్నారు. యుక్త వయస్సులో చెడు వ్యసనాలకు బానిసై భవిష్యత్తును పాడు చేసుకోవద్దని యువతకు పిలుపునిచ్చారు. జేసీ కార్తీక్ మాట్లాడుతూ మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య, ఎక్సైజ్ ఈఎస్ శ్రీనివాసులునాయుడు, ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్, ఆర్ఐఓ వరప్రసాద్, డ్రగ్ ఎడిషన్ నిర్వాహకులు రవీంద్ర, జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారి ఆయూబ్ తదితరులు పాల్గొన్నారు.

అక్షరం.. సంపూర్ణమయ్యేనా..?

● సత్ఫలితాలనిచ్చిన అక్షర చైతన్య కార్యక్రమం
● రెండు విడతల్లో 1.6 లక్షల మంది ఉత్తీర్ణత
● మూడో విడతలో మరో 2 లక్షల మంది గుర్తింపు
● కార్యక్రమం కొనసాగిస్తే నిరుద్యోగులకు జ్ఞానం

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వయోజన విద్య కార్యక్రమానికి గత ప్రభుత్వంలో బ్రేకులు పడ్డాయి. ఆ క్రమంలో జిల్లా కలెక్టర్‌గా ఉన్న కేవీఎన్ చక్రధర్‌బాబు 'అక్షర చైతన్యం' పేరుతో జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని 46 మండలాల్లో 2021, ఆగస్టు 16న కలెక్టర్ నిధులతో అక్షర చైతన్యం-1 కార్యక్రమం ప్రారంభమైంది. జిల్లాలో 1,33,438 మంది నిరక్షరాస్యులను గుర్తించి, ఐదు నెలలపాటు విద్య నేర్పించారు. ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా 2022, జనవరిలో వీరికి పరీక్ష నిర్వహించారు. 1.24 లక్షల మంది పరీక్ష రాయగా 1.16 లక్షల మంది ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు ప్రకటించారు. అప్పటివరకూ 69 శాతంగా ఉన్న జిల్లా అక్షరాస్యత 84 శాతానికి పెరిగినట్లు వెల్లడించారు. ఆ తర్వాత 2022లో గాంధీ జయంతి (అక్టోబరు 2న) రోజున అక్షర చైతన్యం-2 కార్యక్రమం మొదలైంది. ఈ దఫా జిల్లాలోని 37 మండలాల్లో 51,745 మంది నిరక్షరాస్యులను గుర్తించారు. వీరికి విద్యను నేర్పించి పరీక్షలు నిర్వహించారు. 45,229 మంది ఉత్తీర్ణత సాధించారు. దీంతో జిల్లా అక్షరాస్యత 93 శాతానికి చేరినట్లు అధికారులు ప్రకటించారు.

● సంపూర్ణం కావాలి..!

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జిల్లాకు కలెక్టర్‌గా వచ్చిన ఆనంద్.. నూరు శాతం అక్షరాస్యత సాధించే దిశగా ఆలోచన చేశారు. సంపూర్ణ అక్షరాస్యత కోసం అక్షర చైతన్యం-3 కార్యక్రమం చేపట్టేందుకు నిరక్షరాస్యుల గుర్తింపు మొదలుపెట్టారు. జిల్లాలో సుమారు రెండు లక్షల మంది వరకూ నిరక్షరాస్యులు మిగిలి ఉన్నట్లు నిర్ధారించుకున్నారు. అయితే అక్షర చైతన్యం-3 మొదలుపెట్టేలోపు రాష్ట్ర ప్రభుత్వం వయోజనులకు విద్యను నేర్పించే ఉల్లాస్ పథకాన్ని పునరుద్ధరించింది. దీంతో అక్షర చైతన్యం-3 పథకానికి బ్రేకులు పడ్డాయి. గతేడాది ఈ పథకం కింద 19 వేల మందికి మాత్రమే విజ్ఞానాన్ని నేర్పించారు. ఇదే రీతిలో చేస్తే జిల్లాలోని వారందరినీ సంపూర్ణ అక్షరాస్యులుగా చేయడానికి మరో పదేళ్లకుపైగా సమయం పడుతుంది. అయితే ఇప్పటికే అక్షర చైతన్యం కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా జరిగింది కాబట్టి ఇదే కార్యక్రమాన్ని మూడో విడత చేపడితే సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు వీలు పడుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే ఈదఫా అక్షర చైతన్యం కార్యక్రమం నిర్వహణకు పలువురు దాతలు కూడా ముందుకొచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. కృతనిశ్చయంతో అక్షర చైతన్యం-3 కార్యక్రమాన్ని పూర్తి చేయగలిగితే నిరక్షరాస్యులను విజ్ఞానవంతులుగా మార్చే అవకాశం కలుగుతుంది.

- నెల్లూరు(ఆంధ్రజ్యోతి)

లోగ్రేడు పొగాకుకు దక్కని మద్దతు

● నోబిడ్‌లతో కొనుగోలు చేయని కంపెనీలు
● సాగుదారుల్లో ఆందోళన



నోబిడ్‌లతో వేలం కేంద్రం నుంచి వెనక్కి వెళ్తున్న లోగ్రేడ్ పొగాకు బేళ్లు

కలిగిరి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్‌ను బట్టి పొగాకు కొనుగోళ్లు జరగనున్న నేపథ్యంలో ఈ ఏడాది లోగ్రేడు పొగాకును కంపెనీలు కొనుగోలు చేయకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. మూడేళ్లుగా మార్కెట్ అనుకూలించడంతో రికార్డుస్థాయిలో ధరలు దక్కాయి. దీంతో ఈ ఏడాది కూలీలు, రవాణా, పెట్టుబడులు అమాంతంపెరిగిపోవడంతో గతేడాది కన్నా 30 శాతం మేర ఖర్చులు పెరిగిపోయాయి. దీనికితోడు పొగాకు బోర్డు అనుమతించినదానికంటే ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేసి అధిక ఉత్పత్తి సాధించారు.

ఈ ఏడాది ప్రారంభంలో మేలిమి పొగాకు ధర కిలో రూ.280, లోగ్రేడ్ పొగాకు రూ.220 పలికింది. అయితే ప్రారంభంలో లోగ్రేడుకు దక్కిన మద్దతు ధర క్రమేపి తగ్గుముఖం పట్టి ప్రస్తుతం రూ.160లకు చేరుకుంది. దీంతో రైతులు ధరలు పతనమవుతుండటంతో ఉన్న ధర అందినా చాలనుకొని ఇళ్ల వద్ద ఉన్న లోగ్రేడు పొగాకును కొనుగోలు కేంద్రానికి తీసుకువస్తున్నారు. ఇప్పటివరకు గరిష్ఠ ధరలో మార్పు లేకుండా కొనుగోళ్లు జరుగుతుండటం, లోగ్రేడు పొగాకుకు మద్దతు ధర తగ్గించడంతోపాటు ఎక్కువశాతం కొనుగోలు చేయకుండా నోబిడ్ ప్రకటిస్తూ వెనక్కి తిప్పి పంపడం జరుగుతోంది. వ్యయప్రయాసలతో వేలం కేంద్రానికి తీసుకువచ్చిన పొగాకును తిరిగి ఇంటికి తీసుకు వెళ్లాలంటే శ్రమతోపాటు రవాణా ఖర్చు అవుతుందని సాగుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడులు గణనీయంగా పెరగడం, వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఈ ఏడాది ఎక్కువశాతం లోగ్రేడు పొగాకు దిగుబడి వచ్చిందని, ధరలు లేకపోవడంతో గడ్డుపరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. లోగ్రేడ్ పొగాకు ధరలు పెరగకపోతే తీవ్రంగా నష్టపోతామని ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కంపెనీలు ముందుకు రావడం లేదు.

అంతర్జాతీయ మార్కెట్‌లో లోగ్రేడ్ పొగాకుకు డిమాండ్ లేకపోవడంతో కంపెనీలు కొనుగోలు చేయడానికి ముందుకు రావడంలేదు. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పొగాకు బేళ్లను వేలం కేంద్రానికి తీసుకువచ్చి మద్దతు ధర పొందాలి.

- శివకుమార్, వేలం నిర్వహణాధికారి, కలిగిరి.



ఆదమరిస్తే అంతే..!

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుబోయమడగల - వరికుంటపాడు గ్రామాల సమీపంలోని 5వ నంబరు కాలువపై నిర్మించిన వంతెన ప్రమాదకరంగా మారింది. రహదారి నిర్మించే సమయంలో అక్కడి వాహనాలు వంతెనను ఢీకొనడంతో కొంతమేర రక్షణ గోడ కూలిపోయింది. దీంతో సూచిక బోర్డులు ఏర్పాటుచేసి అధికారులు చేతులు దులుపుకున్నారని, రోజురోజుకు ఇరువైపులా ఉన్న గోడలు మరింత ధ్వంసమవుతున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికితోడు ఆప్రాంతంలో ప్రమాదకర మలుపు ఉండడంతో పరిస్థితి మరీ దారుణంగా మారింది. పలు గ్రామాల ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు ఆమార్గంలో ప్రతినిత్యం మోటారుబైకులు, ఆటోల్లో ప్రయాణాలు సాగిస్తుండడంతో ఏక్షణంలో ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని బెంబేలెత్తిపోతున్నారు. ఎదురు వాహనాలను తప్పించే క్రమంలో ఏమాత్రం ఆదమరిచినా కాలువలో పడిపోయే ప్రమాదం ఉందని, ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన వంతెనపై పూర్తిస్థాయిలో రక్షణ గోడలు నిర్మించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

సముద్ర ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించండి

● పరిశ్రమల ఏర్పాటుకు త్వరగా అనుమతులు : కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (వెంకటేశ్వరపురం), జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సముద్ర ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జరిగింది. ఈ కమిటీ చైర్మన్ అయిన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపనకు సింగిల్ డెస్క్ పోర్టల్ విధానాల్లో 973 దరఖాస్తులు రాగా 856 దరఖాస్తులను అనుమతించినట్లు చెప్పారు. ఈ దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో త్వరితగతిన అనుమతులు ఇవ్వాలన్నారు. అదేవిధంగా జిల్లావ్యాప్తంగా జరుగుతున్న పలు అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. నడికుడి- శ్రీకాళహస్తి రైల్వేలైన్, బుచ్చి - దగదర్తి రోడ్డు, గిలకపాడు వీరాయపాళెం నీటి పైపులైన్‌కు సంబంధించి భూ సేకరణ త్వరగా పూర్తిచేయాలన్నారు. రామాయపట్నంపోర్టు ఇండస్ట్రీయల్ హబ్ ఏర్పాటుకు అవసరమైన భూ వివరాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో జేసీ కార్తీక్, కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, ఆర్డీవోలు అనూష, వంశీకృష్ణ, పావని, పరిశ్రమల శాఖ జీఎం ప్రసాద్, ఏపీఐఐసీ జెడ్ఎం శివకుమార్ పాల్గొన్నారు.



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్